ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్

బుధవారం అక్టోబరు 23, 2024



అన్నుల మిన్నుల.. అదిరే కన్నుల..



మంగళగిరి సీకే కన్వెన్షన్‌లో జ్యోతి వెలిగించి డ్రోన్ సమ్మిట్ ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. పక్కనే కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు తదితరులు

డ్రోన్ పనితీరు గురించి తెలుసుకుంటున్న సీఎం

మంగళగిరికి తరలివచ్చిన యువతీ యువకులు

కృష్ణా తీరంలో డ్రోన్ల విహంగ విహారంతో.. అద్భుతాలు ఆవిష్కృతమయ్యాయి. ఆకాశంలో అపురూప దృశ్యాలు కనువిందు చేశాయి. గతంలో ఎన్నడూ చూడని అద్భుతమైన డ్రోన్ల ప్రదర్శనను చూసి.. వేల మంది ఆహూతులు కేరింతలు కొట్టారు. కృష్ణా నదీ తీరంలో పున్నమిఘాట్‌లో.. దేశంలోనే ఎన్నడూ లేనన్ని రికార్డుల మోత మోగింది. దేశంలోనే అతిపెద్ద డ్రోన్ల ప్రదర్శనకు వేదికగా నిలిచి.. ఏకంగా ఐదు గిన్నిస్ రికార్డులను నెలకొల్పింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి వేల మంది అతిథులు తరలివచ్చి ఈ డ్రోన్ల ప్రదర్శనను తిలకించారు. విజయవాడ, మంగళగిరి కేంద్రాలుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అమరావతి డ్రోన్ సమ్మిట్‌లో తొలిరోజు.. ఊహకే అందని అద్భుతాలు ఆకాశంలో ఆవిష్కృతమయ్యాయి. మంగళవారం ఉదయం మంగళగిరి వేదికగా సమ్మిట్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకారం చుట్టగా.. కేంద్ర మంత్రి రామ్మోహన్, మంత్రులు వంగలపూడి అనిత, అచ్చెన్నాయుడు, సంధ్యారాణి, సవిత తదితర ప్రజాప్రతినిధులు, సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ హాజరయ్యారు.

అపూర్వం



యాలీ డ్రోన్
మనుషులు చేరుకోలేని ప్రాంతాలకు దీని ద్వారా వైద్య సామగ్రిని ఇట్టే పంపవచ్చు.





రెడ్ వింగ్
గమ్యం చేరలేని గ్రామీణ ప్రాంతాలకు మందులను చేరవేసే డ్రోన్ పనితీరు తెలుసుకుంటున్న యువత



భద్రతకు భరోసా
రక్షణకు దోహదం చేసే డ్రోన్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

అమోఘం



సర్వేలెన్స్ డ్రోన్
భూ కొలతలు, సర్వేను పారదర్శకంగా చేపట్టే అధునాతన పరికరం



అన్నదాతకు అండగా..
పంటలకు పురుగు మందులు పిచికారీ చేసే డ్రోన్‌ను పరిశీలిస్తున్న సందర్శకులు

ఈనాడు, డిజిటల్ - అమరావతి, న్యూస్‌టుడే- భవానీపురం, విద్యాధరపురం



చంద్రహాసం...

ఆకాశంలో 5,500 డ్రోన్లు కలిసి చేసిన విన్యాసాలను చూస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆనందం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రులు బి.సి.జనార్దన్‌రెడ్డి, అచ్చెన్నాయుడు, కొండపల్లి శ్రీనివాస్‌తో కలిసి డ్రోన్ల ప్రదర్శనను ముఖ్యమంత్రి తిలకించారు. ముంబయికి చెందిన వికాస్ అన్‌బీటబుల్ డ్రీమ్ టీం చేసిన నృత్య ప్రదర్శనను సైతం చంద్రబాబు ఆసక్తిగా తిలకించారు. ప్రధానంగా సైకిల్‌తో ఈ బృందం చేసిన విన్యాసాలు చూసి.. ముఖ్యమంత్రి నవ్వులు కురిపించారు. డ్రోన్ల ప్రదర్శన, లేజర్‌షో, సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య, సంగీత ప్రదర్శనలు అలరించాయి.

అభినవ డ్రోనాచార్య!

- అన్ని రంగాలనూ నడిపించేది.. డ్రోన్లే
- సాంకేతికతకు.. అభివృద్ధికి బాసట
- నూతన ఆవిష్కరణలపై నయా ఆసక్తి
- అమరావతి డ్రోన్ సమ్మిట్‌కు తరలివచ్చిన యువత

యువ



డ్రోన్ షోలో యువత సందడి..



డ్రోన్‌ల విశిష్టతను వివరిస్తూ..

ఈనాడు, ఈనాడు డిజిటల్ - అమరావతి

ఒక వినూత్న ఆలోచన.. సమాజం పురోభివృద్ధి వైపు అడుగులు వేసేందుకు దోహదపడుతోంది. నిత్య జీవితంలో ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపిస్తోంది. కొత్త పుంతలు తొక్కుతున్న సాంకేతిక పరిజ్ఞానం మానవాళికి ఎంతో ఉపయోగపడుతోంది. భవిష్యత్తులో పలు రంగాల్లో డ్రోన్ టెక్నాలజీ కీలక మార్పులు తీసుకురానుంది. ఇప్పుడిప్పుడే అనేక అవసరాలకు డ్రోన్లు అక్కరకొస్తున్నాయి. తప్పిపోయిన వ్యక్తులను కనిపెట్టడం.. ప్రకృతి వైపరీత్యాల వేళ బాధితులకు ఆహారం, మందులు అందించడం.. నష్టాలను అంచనా వేయడం.. జన సమూహాలపై నిఘా.. వ్యవసాయంలో సస్యరక్షణ.. వంటి విభాగాల్లో ఎంతో ఉపకరిస్తున్నాయి. ఈ రంగంలో కొత్త ఆవిష్కరణలు, విభిన్న అవసరాలకు ఉపయోగపడే డ్రోన్లు, వాటిల్లో నూతన సాంకేతికత, అభివృద్ధిలో డ్రోన్ల పాత్ర, తదితర అంశాలతోపాటు భవిష్యత్తు మార్గసూచీపై గుంటూరు జిల్లా మంగళగిరిలో 'అమరావతి డ్రోన్ సమ్మిట్' ప్రారంభమైంది. దీనికి దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రతినిధులు, సందర్శకులు పెద్దఎత్తున పాల్గొన్నారు. సదస్సుకు వచ్చిన పలువురు ఇది తమకు ఎంతో ఉపయోగపడిందనీ, భవిష్యత్తులో తమ ప్రాజెక్టుల రూపకల్పనకు అక్కరకొస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

సొంతంగా ఎదగాలనే స్టార్టప్ ఏర్పాటు



నాకు విదేశీ వస్తువులంటే పెద్దగా ఇష్టం ఉండదు. దేశీయంగా తయారు చేయాలనే పట్టుదలతోనే స్టార్టప్ ఏర్పాటు చేశాను. నేను అనంతపురం జేఎన్‌టీయూలో బీటెక్ చదివిన తర్వాత హైదరాబాద్ ఐఐటీలో ఇటీవలే ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ పూర్తి చేశాను. ఐఐటీ ప్రాంగణంలో ఉన్న టింకర్స్ ల్యాబ్‌లో నేను ఎక్కువ సమయం గడిపా. అక్కడ సొంతంగా రోబోటిక్ చెయ్యిని తయారు చేసేందుకు చాలా కష్టపడ్డా. ఆ ప్రయోగం విఫలమైంది. ఇది నాలో పట్టుదల పెంచింది. డ్రోన్ల ప్రాజెక్టుకు 'ఆమని ఆటోమేషన్', కృత్రిమ మేధస్సు కోసం 'ఎక్స్ న్యూరోపిల్' అనే స్టార్టప్స్ ఏర్పాటు చేశాను. డ్రోన్ల వేగాన్ని నియంత్రించేందుకు ఎలక్ట్రానిక్ స్పీడ్ కంట్రోలర్ (ఈఎస్‌సీ) పరికరాలను సొంతంగా తయారు చేసి ఆర్డర్లపై సరఫరా చేస్తున్నా. నా వద్ద ఉన్న నిపుణుల బృందం తోడ్పాటుతో.. వచ్చే ఆర్డర్లను తీసుకుని తయారు చేయించి ఇస్తున్నా. వచ్చిన లాభంలో వారికి వాటా ఇస్తున్నా. భవిష్యత్తులో రోబోటిక్స్‌లో పరిశోధనలపైనా దృష్టి సారిస్తా. సాంకేతిక పరిజ్ఞానంతో బయోడీజిల్ తయారు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నా.

- ఎ.పురంధర్, ఎం.టెక్, ఐఐటీ హైదరాబాద్

నిఘా మరింత మెరుగుపరిచేలా...



మేం ఇంజినీరింగ్‌లో రోబోటిక్స్ అండ్ ఆటోమేషన్ విభాగాన్ని ఎంచుకున్నాం. వివిధ వస్తువులను సరఫరా చేసే డ్రోన్లను తయారు చేస్తున్నాం. భవిష్యత్తులో రాత్రి సమయాల్లో పోలీసులకు అక్కరకొచ్చేలా గస్తీకి ఉపయోగపడేలా తయారు చేయాలని భావిస్తున్నాం. అసాంఘిక శక్తుల జాడ పసిగట్టగానే అలారం మోగేలా తయారు చేస్తాం. దీనిని వీలైనంత త్వరగా రూపొందించి వినియోగంలోకి తీసుకురావాలన్న పట్టుదలతో ఉన్నాం. పరిశ్రమల్లో డ్రోన్ల తయారీలో విభాగంలో ఇంటర్న్‌షిప్ అవకాశాలు తెలుసుకునేందుకు సదస్సుకు వచ్చాం. డ్రోన్లు మరింతగా అభివృద్ధి చేసేలా సమ్మిట్‌కు వచ్చిన వారితో చర్చించి సూచనలు, సలహాలు తీసుకున్నాం.

- సీహెచ్.జ్యోతిక, ఎస్.భార్గవి, ఎం.ప్రత్యూష, విజ్ఞాన్ యూనివర్సిటీ, వడ్లమూడి

మార్గం నిర్దేశిస్తే.. గమ్యస్థానం చేరేలా..



మేం ఈసీఈ రెండో ఏడాది చదువుతున్నాం. విమానయాన రంగమంటే చాలా ఇష్టం. ఆ ఆసక్తితో డ్రోన్లపై పరిశోధనలను ప్రారంభించాం. కనీస సౌకర్యాలు అంతంతమాత్రంగా ఉండే గ్రామీణ ప్రాంతాల్లో వీటిని విరివిగా వినియోగిస్తేనే పరిశోధనల ఫలాలు మారుమూల ప్రాంతాలకూ చేరతాయి. డ్రోన్లకు జీపీఎస్ పరికరాన్ని అమర్చి, మార్గాన్ని నిర్దేశించి గమ్యస్థానం చేరేలా తయారు చేశాం. తప్పిపోయిన వ్యక్తిని ఫేషియల్ రికగ్నేషన్ ద్వారా గుర్తించే సాంకేతికతను జోడించాం. గ్రామీణ ప్రాంతాల్లో అత్యవసర వస్తువులను సరఫరా చేసే మరో రెండు డ్రోన్లను కూడా రూపొందించాం. మరింత సామర్థ్యం గల డ్రోన్ల తయారీకి నలుగురం కలిసి బృందంగా ఏర్పడి ప్రయోగం చేస్తున్నాం. ఈ సమ్మిట్ ద్వారా కొత్త ఆవిష్కరణలు తెలుసుకున్నాం.

- పుష్పక్, ఆశిష్, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ, అమరావతి

అవయవాలను తరలించే డ్రోన్ల తయారీపై దృష్టి

మేము మెకానికల్ ఇంజినీరింగ్ నాలుగో సంవత్సరం చదువుతున్నాం. మా కళాశాలలో ఇదివరకే పంటలపై పురుగు మందులు పిచికారీ చేసే డ్రోన్, తప్పిపోయిన వారిని అన్వేషించేందుకు ఉపయోగపడే వాటిని రూపొందించాం. వివిధ అవసరాలకు పనికొచ్చేలా డ్రోన్ల అభివృద్ధికి ఉపకరిస్తుందని ఈ సదస్సుకు వచ్చాం. అవయవ దానం తర్వాత వాటిని తరలించేందుకు ఇప్పుడు అంబులెన్సులకు గ్రీన్ ఛానల్ ఇస్తే కానీ సకాలంలో తీసుకెళ్లలేని పరిస్థితి. కాలహరణాన్ని అధిగమించేందుకు డ్రోన్ల ద్వారా అవయవాలను రవాణా చేసే అంశంపై దృష్టి సారించాం. గత ఏడాది ఐఐటీ మద్రాస్‌లో జరిగిన వర్క్‌షాప్‌లో మేం తయారు చేసిన పలు డ్రోన్లను ప్రదర్శించి, వాటి గురించి వివరించాం. మా ఆవిష్కరణలకు బహుమతులు వరించాయి.

- పి.శశిధర్, పి.తిరుమలేష్, కె.వి.సాయితేజ, డి.ధీరజ్, ఎస్.డి. నవాజ్.. నారాయణ ఇంజినీరింగ్ కళాశాల, నెల్లూరు





లేజర్ షో వీక్షిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు



డ్రోన్ల తళుకులు



ఆకట్టుకున్న కళాకారిణుల నృత్య ప్రదర్శన



ఆలపిస్తున్న గాయకులు



ప్రజలతో కరచాలనం చేస్తూ..



వీఐపీ గ్యాలరీలో ప్రముఖులు

సకళాభివందనం!

భవానీపురం, విద్యాధరపురం: కృష్ణా తీరాన ఆహ్లాద వాతావరణంలో పున్నమి, భవానీ ఘాట్‌ల వేదికగా నిర్వహించిన డ్రోన్ షో ఆద్యంతం అలరించింది. సభా వేదికపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నాట్యకళాకారుడు అజయ్‌కుమార్ బృందం చేసిన కూచిపూడి, జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. శంభో...శివ శంభో, ఘల్లు...ఘల్లు... జోడెడ్లు బండ్లు అంటూ సాగిన నృత్యాలు అలరించాయి. గణపతి బప్పా మోరియా, నాటు...నాటు, నాకముక... నాకముక నృత్యాలు ఆహుతులను రంజింపజేశాయి. వికాస్ డ్రీమ్ టీమ్ విన్యాసాలతో కూడిన నృత్యం ఆకట్టుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు చప్పట్లతో అభినందనలు తెలియజేశారు. మ్యూజిక్ బ్యాండ్ అలరించింది. వందేమాతరం..., కుర్రా ళ్లోయ్.. కుర్రాళ్లు, కరిగిపోయాను...కర్పూర వీణలా అని సాగిన గీతాలు రంజింపజేశాయి. లేజర్ షో ఆద్యంతం ఆకట్టుకుంది. వీవీఐపీలకు రాత్రి భోజనం ఏర్పాటు చేయగా ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, మంత్రులు డిన్నర్ చేసి వెళ్లారు.

వరద బాధితుల ఖాతాల్లో

రూ.235.72 కోట్ల జమ

- ★ 1,44,672 మందికి లబ్ధి
- ★ పరిశీలనలో మరో 2,478 దరఖాస్తులు



మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ నిధిమీనా. పక్కనే డీఆర్వో శ్రీనివాసరావు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : వరదలో నష్టపోయిన ప్రతి బాధిత కుటుంబానికీ పరిహారం అందజేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని, ఏ ఒక్కరూ ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని ఇన్‌ఛార్జి కలెక్టర్ నిధి మీనా తెలిపారు. నగరంలోని కలెక్టరేట్‌లో ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడారు. విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలో సెప్టెంబరులో సంభవించిన అధిక వర్షాలు, బుడమేరు వరద ప్రభావంతో గృహాలు, వాహనాలు తదితరాలకు సంబంధించి 1,44,672 మంది వరద బాధితుల ఖాతాల్లో పరిహారం కింద రూ.235.72 కోట్లు జమ చేసినట్టు వెల్లడించారు. బ్యాంకు ఖాతాలకు అనుసంధానం కాని 476 కుటుంబాలకు సంబంధించి అనుసంధానం చేసి, చెల్లింపుల ప్రక్రియ జరిపేలా చర్యలు తీసుకున్నట్టు పేర్కొన్నారు. ఇంకా పరిశీలనలో 2,478 దరఖాస్తులు ఉన్నట్టు చెప్పారు. ఈనెల 24వ తేదీలోగా దరఖాస్తులను పరిష్కరించి, అర్హులైన వారికి నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. 179 గ్రామ/వార్డు సచివాలయాల్లో వరద గణన జాబితాలతో పాటు, అదనంగా వచ్చిన దరఖాస్తులను పీజీఆర్ఎస్ ఫ్లడ్ మాడ్యూల్‌లో నమోదు చేసినట్టు వివరించారు. ఆధార్‌తో అనుసంధానించిన బ్యాంకు ఖాతాలకు నేరుగా పరిహారం జమ చేసినట్టు తెలిపారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పారదర్శకమైన చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. డీఆర్వో వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వంగవీటి రాధాకు మంత్రి లోకేశ్ పరామర్శ



తాడేపల్లి, న్యూస్‌టుడే: మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధా ఇటీవల అస్వస్థతకు గురై కోలుకుంటున్న నేపథ్యంలో విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ మంగళవారం పరామర్శించారు. తాడేపల్లి పరిధిలోని ప్రాతూరులోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. దిల్లీ పర్యటన ముగించుకుని విజయవాడ చేరుకున్న లోకేశ్ అనంతరం రాధా ఇంటికి చేరుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

తిరువూరులో 20.6 మి.మీ. వర్షం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలోని పలు మండలాల్లో వర్షం కురిసింది. సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం ఉదయం వరకు నమోదైన వివరాల ప్రకారం.. తిరువూరు 20.6 మి.మీ., వత్సవాయి 19.2, ఎ.కొండూరు 12.2, విస్సన్నపేట, ఇబ్రహీంపట్నం 3.4, రెడ్డిగూడెం 2.6, నందిగామలో 1.2 మి.మీ. మేర వర్షపాతం నమోదైంది. జిల్లాలో సగటు వర్షపాతం 3.13 మి.మీ.గా ఉంది.

ఎన్టీఆర్ జిల్లా జాబ్ క్యాలెండర్ విడుదల



జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తున్న ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యే తాతయ్య, శ్రీనివాస్ తదితరులు

పటమట, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 2024-25 సంవత్సరానికి సంబంధించి ఎన్టీఆర్ జిల్లా జాబ్ క్యాలెండర్‌ను ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) విడుదల చేశారు. మంగళవారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో ఎం.ఎస్.ఎం.ఈ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. జిల్లాలో అమలు చేస్తున్న ఎంఎస్ఎంఈ, కేంద్ర పథకాల వివరాలు తెలుసుకున్నారు. ఎంపీ మాట్లాడుతూ... సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల రంగం (ఎం.ఎస్.ఎం.ఈ) ద్వారా అందించే పథకాలు, రాయితీలపై, వాటిని వినియోగించి విజయం సాధించిన పారిశ్రామికవేత్తల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. యూనిట్లను ఎలా ప్రారంభించాలి.. బ్యాంకు రుణం తీసుకునే విధానం, మార్కెటింగ్ తీరు తదితర అంశాలపై ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పించాలని సూచించారు. వచ్చే నెలలో నియోజకవర్గాల వారీగా అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, తెదేపా జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్, విజయవాడ కె.వై.ఐ.సి. చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గ్రీప్, ఎన్టీఆర్ జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఎస్.శ్రీనివాస్, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో / కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 138, 147, 158 చికెన్ విత్ స్కిన్ - 266 చికెన్ స్కిన్‌లెస్ - 276.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 540 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

మిత్రులే.. అంతలోనే శత్రువులై..!

హత్యకు దారితీసిన స్వల్ప వివాదం

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్), న్యూస్‌టుడే

వారిద్దరూ స్నేహితులు. చిన్నపాటి వివాదంతో ఘర్షణపడ్డారు. ఒకరిమీదకు మరొకరు దూసుకెళ్లారు. శత్రువుల్లా కొట్టుకునే క్రమంలో.. ఒకరు ప్రాణాలు కోల్పోయిన ఘటన అజిత్‌సింగ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. హైదరాబాద్‌కు చెందిన వెంకట నరసింహరాజు ఫార్మసీ మందుల దుకాణాలు నిర్వహిస్తుంటారు. ఈయనకు విజయవాడ, అయోధ్యనగర్‌లోని ఒక గేటెడ్ కమ్యూనిటీలో ఫ్లాట్ ఉంది. యనమలకుదురుకు చెందిన మహ్మద్ రఫీ (54), నరసింహరాజులు స్నేహితులు. వీరిద్దరూ సోమవారం అర్ధరాత్రి ఫ్లాట్‌కు వచ్చారు. కలిసి మద్యం తాగారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య చిన్న విషయమై గొడవ జరిగింది.

మాటామాటా పెరగడంతో..

రఫీ కత్తెర తీసుకుని పొడవబోయాడు. నరసింహరాజు తప్పించుకుని.. రఫీ మెడకు టవల్ వేసి నులమడంతో ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన అనంతరం నరసింహరాజు.. పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి సమాచారం చెప్పారు. అజిత్‌సింగ్‌నగర్ సీఐ వెంకటేశ్వర్లు తదితరులు వచ్చి విచారించారు. రఫీ తనను రూ.3 లక్షలు అప్పు అడిగాడని, ఈ విషయంలో డబ్బులు ఎందుకు పాడు చేస్తావంటూ మందలించానని నరసింహరాజు చెబుతున్నారు. రఫీ.. మద్యం మత్తులో కత్తెర తీసుకుని మీదకు వస్తే మెడకు టవల్ వేసి అడ్డుకున్నానని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే అతడు మరణించి ఉంటాడని పోలీసులు తెలిపారు. దీనిపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరువూరు
• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM
తిరువూరు: 85005 44088 మైలవరం: 80085 74705

స్పందనకు వందనం

- పట్టణంలోని 6వ వార్డు సచివాలయం పరిధిలో 11వ వార్డులో మధిర రోడ్డులో రహదారుల వెంట పిచ్చి మొక్కలు పెరిగాయని స్థానికులు మేమున్నాం..మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి సిబ్బందితో తొలగింపజేశారు.



- 7వ వార్డు సచివాలయం పరిధిలో 13వ వార్డులో మధిర రోడ్డులో ఆర్వీఎం చర్చి దగ్గర డ్రెయినేజీలో సిమెంట్ పైపులు పూడుకుపోయాయన్న స్థానికుల ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి సిబ్బందితో పైపులను బయటకు తీయించారు.
- 4వ వార్డు సచివాలయం పరిధిలో 9వ వార్డు పరిధిలోని వీధుల్లో పిచ్చి చెట్లు దట్టంగా పెరిగాయన్న సమస్యను ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సిబ్బందిని పంపి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించారు.
- 10వ వార్డు సచివాలయం పరిధిలో 19వ వార్డులో రజక బజార్‌లో రహదారి వెంట పిచ్చి మొక్కలు ఉన్నాయని స్థానికులు తెలిపిన విషయాన్ని ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సిబ్బందిని పంపి మొక్కలు తొలగించే చర్యలు చేపట్టారు.
- 1వ వార్డు సచివాలయం పరిధిలో 1వ వార్డులో వీధుల్లో చెత్త కుప్పలు ఉన్నాయని, కాల్వల్లో పూడిక పేరుకుపోయి మురుగు నీరు పారుదల లేదని స్థానికులు చేసిన ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్‌కు తెలుపగా ఆయన సిబ్బందిని పంపి ఆ ప్రాంతంలోని చెత్తను తొలగించి కాల్వను బాగుజేయించారు.

\- న్యూస్‌టుడే, తిరువూరు

ఆధార్ సేవలు వాయిదా

కొండపల్లి, న్యూస్‌టుడే: కొండపల్లి పురపాలికలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ సేవలను వాయిదా వేశామని కమిషనర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. సచివాలయ, మండల కార్యాలయ టెక్నీషియన్లు బదిలీపై ఉన్నారని వారిని అందుబాటులోకి తీసుకున్న తర్వాత సేవలు ఏర్పాటు చేస్తామన్నారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: తెలుగునాడు విద్యుత్తు కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఓటు నమోదు కార్యక్రమాన్ని ఇబ్రహీంపట్నంలో మంగళవారం నిర్వహించారు. పట్టభద్రులంతా ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యత ఓటును వేయాలని కోరారు. కార్యక్రమంలో జంపాల సీతారామయ్య, పి.సాంబశివరావు, శివనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




దరఖాస్తులు స్వీకరిస్తున్న తెదేపా, కార్మిక సంఘ నాయకులు

అన్నీ సమస్యలే.. అధికారులు రావాల్సిందే!

రెవెన్యూ గ్రామసభను బహిష్కరించిన రైతులు | సర్వే తీరుపై తీవ్ర ఆగ్రహం

మైలవరం, న్యూస్‌టుడే

'అమ్మిన పొలం సర్వే సంఖ్యను పుస్తకం నుంచి తొలగించలేదు.. అన్నదమ్ములం పంచుకున్న భూములను ఉమ్మడి వ్యవసాయదారులుగా చూపారు. రైతుల్ని పిలవకుండా రాళ్లు పాతారు, అడ్డదిడ్డంగా సర్వే చేసి, తీరా వచ్చి అర్జీలు ఇమ్మంటారా. మీరు చేసిన నిర్వాకానికి కొత్త పుస్తకాల్లో నమోదులతో ఈ క్రాప్ కూడా చేయడంలేదు..కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలతో పాటు కొత్త తలనొప్పులు తెచ్చి పెట్టారు' అని మండలంలోని పుల్లూరు శివారు దాసుళ్లపాలెం రైతులు రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు. వివరాల్లోకి వెళితే.. గత ప్రభుత్వ హయాంలో రీసర్వే చేసిన గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామసభల్లో భాగంగా మంగళవారం దాసుళ్లపాలెం పాఠశాల ఆవరణలో సభ ఏర్పాటు చేశారు. విజయవాడ డివిజన్ సర్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ బేగ్‌తో పాటు



చెట్టు కింద కూర్చున్న రైతులు

మండల, గ్రామ సర్వేయరు, ఇతర రెవెన్యూ సిబ్బంది, సర్పంచి నాగమల్లేశ్వరి హాజరయ్యారు. తహసీల్దార్, డీటీ, ఆర్ఐలకు విజయవాడలో అధికారిక విధులు ఇవ్వడంతో రాలేదు. అయితే గ్రామంలో అత్యధికులకు గత ప్రభుత్వం ఇచ్చిన పాస్‌పుస్తకాల్లో ఉన్న తప్పులను తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని భావించి పెద్ద ఎత్తున పాఠశాల వద్దకు చేరుకున్నారు. అయితే తహసీల్దార్ రాలేదని తెలుసుకున్న రైతులు వచ్చిన సిబ్బందితో తమ ఇబ్బందులను ఏకరువు పెట్టారు. తప్పులు సరిదిద్దడానికి ఉన్నతాధికారులు రావాల్సిందేనని పట్టుబట్టి సిబ్బందిని వెళ్లిపోవాలని కోరారు. తహసీల్దార్ వచ్చే రోజు వరకు సభను వాయిదా వేసుకోవాలంటూ డిమాండ్ చేశారు. అయితే అర్జీలు తీసుకుంటామని వచ్చిన అధికారులు చెప్పినా అంగీకరించక సభా ప్రాంగణం నుంచి బయటకు వచ్చి చెట్టు కింద కూర్చుండిపోయారు.

తప్పులు చేసిన వారికి అర్జీలు ఇవ్వం


ఈ సందర్భంగా అక్కడకు వెళ్లిన విలేకరులతో రైతులు మాట్లాడుతూ..భాగస్వామ్య వాటాలుగా ఎప్పుడో విడిపోయి, వేర్వేరు పాస్ పుస్తకాలను పొందిన తమ పుస్తకాల్లో ఉమ్మడి వ్యవసాయదారుల పేరిట ఇతరుల పేర్లను నమోదు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది చేసిన తప్పులతో ఉమ్మడి భాగస్వామ్య వాటాలను ఈ క్రాప్ నమోదులోనూ తీసుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా పంటల నష్టంతో పాటు, రుణాలు పొందలేకపోతున్నామని వాపోయారు. కొంతమంది చేలల్లో చెప్పకుండానే రాళ్లు పాతారని, దాని వల్ల సరిహద్దు తగాదాలు జరుగుతున్నాయన్నారు. ఒకరి పొలాన్ని మరొకరి ఖాతాలో వేశారని, ఇన్ని పొరపాట్లను చేసిన వ్యక్తులే సభలో ఉంటే ఎలా అర్జీలు ఇస్తామని గ్రామ సర్వేయరు తీరుపై ఆక్షేపణ వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని, అర్జీలు ఇస్తే పరిష్కారమవుతామని సర్వే అధికారి బేగ్ సూచించారు.

అనాధీనంలో ఉంటే ఎలా: ఎ.కోటిరెడ్డి, రైతు



కొనుగోలు చేసిన భూమికి గతంలోనే నాలుగు రిజిస్ట్రేషన్లు జరగ్గా, నేటికీ అనాధీనం అని ఆర్ఎస్ఆర్‌లో కన్పిస్తోంది. దాని వల్ల బ్యాంకు రుణం తీసుకోవడానికి కుదరడంలేదు. మార్చాలని కోరినా ఎవరూ పట్టించుకోవడంలేదు. రీసర్వే అంతా అస్తవ్యస్తంగా జరిగింది.

ఇబ్బందులకు గురిచేస్తున్నారు: భాస్కరరెడ్డి, రైతు



భాగస్వామ్య వాటాలుగా విడిపోయినా ఉమ్మడి వ్యవసాయదారులుగా నమోదు చేయడం విడ్డూరంగా ఉంది. నాతో పాటు చాలా మంది కుటుంబ సభ్యుల పొలాలను విభజించుకుని గతంలోనే చక్కగా పాస్ పుస్తకాలు తీసుకుంటే తీరా ఇప్పుడు మాకిచ్చిన పుస్తకాల్లో వేరే వారి పేర్లు ఎక్కించి ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

ప్రతిభకు మెరుగులు

మైలవరం, న్యూస్‌టుడే: పోటీల్లో ప్రతిభ చాటడం ద్వారా నైపుణ్యాలను పెంపొందించుకోవచ్చని స్థానిక నారాయణ పాఠశాల ప్రిన్సిపల్ రత్నకుమారి పేర్కొన్నారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా పాటవ పరీక్షల్లో భాగంగా మంగళవారం ఆ పాఠశాలలో 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశాలపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. పరీక్షల్లో బి.గోమతి, ఎన్కే నజ్రత్, సీహెచ్ జ్యోతి మొదటి మూడు స్థానాలు సాధించి బహుమతులు అందుకున్నారు. ఏజీఎం హరీష్, ఆర్ఐ గురుప్రసాద్, డీన్ శ్యాంసన్, ఏఓ దివ్య అభినందించారు.



పరీక్ష రాస్తున్న విద్యార్థులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ రత్నకుమారి

వరద సాయం ఇవ్వకపోవడం దారుణం

కొండపల్లి, న్యూస్‌టుడే: వరద సాయం అందించడంలో అర్హులైన బాధితులను మినహాయించడం దుర్మార్గమని వివిధ పార్టీల నాయకులు ఆరోపించారు. వరద పరిహారం కోరుతూ కొండపల్లి శ్రామికనగర్ వాసులు తహసీల్దారు కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. వీరికి మద్దతుగా సీపీఎం, ఎంసీపీఐ, ఐఎంబీయూ, వైకాపా నాయకులు పాల్గొని మద్దతు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెలలో కురిసిన వర్షాలకు కొండపల్లి పురపాలిక మొత్తం నీటమునిగిందని..అందరూ తీవ్రంగా నష్టపోయారన్నారు. అంతటి విపత్తు సంభవిస్తే అర్హులైన బాధితులకు పరిహారం అందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అర్హులైన బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దారుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో శ్రామికనగర్, వడ్డేనగర్, చైతన్యనగర్, ఖిల్లారోడ్డులకు చెందిన నివాసితులు పాల్గొన్నారు.



పాల్గొన్న వివిధ పార్టీ నేతలు, వరద బాధితుల ధర్నా

ఉపాధ్యాయులకు తరగతులు

తిరువూరు, న్యూస్‌టుడే: ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు బోధించే సబ్జెక్టు ఉపాధ్యాయులకు మారిన పాఠ్య పుస్తకాలపై బుధవారం నుంచి తిరువూరు బాలికోన్నత పాఠశాలలో పునశ్చరణ తరగతులు నిర్వహిస్తారని హెచ్‌ఎం పి.సత్యనారాయణరెడ్డి తెలిపారు. 23న తెలుగు, 24న హిందీ, 25న ఆంగ్లం, 26న గణితం, 28న భౌతికశాస్త్రం, 29న జీవశాస్త్రం, 30న సాంఘికశాస్త్రం బోధించే ఉపాధ్యాయులు పాల్గొనాలని ఆయన పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు తరగతులు జరుగుతాయన్నారు. సబ్జెక్టుకు ఇద్దరు చొప్పున ఆర్పీలను నియమించారు.



బూజు పట్టిన మినప మొక్కలను వ్యవసాయాధికారిణికి చూపిస్తున్న కర్షకులు

ప్రభుత్వం ఆదుకోవాలి: మినుము రైతుల విజ్ఞప్తి

చంద్రగూడెం(మైలవరం), న్యూస్‌టుడే: వర్షాలకు మినుము పంట పూర్తిగా దెబ్బతిన్నదని, ప్రభుత్వం ఆదుకోవాలని మండలంలోని చంద్రగూడెం రైతులు కోరారు. మంగళవారం స్థానిక రైతుసేవా కేంద్రంలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి వచ్చిన రైతులు దెబ్బతిన్న మినుము మొక్కలను తెచ్చి మండల వ్యవసాయాధికారిణి సంధ్యారాణికి చూపించారు. రెండు నెలలుగా పూర్తిగా వర్షాల్లో ఉండడంతో గింజలు బూజు పట్టిందని, గతంలో పంటలు నష్టపోయిన సమయంలో పట్టించుకోలేదని వాపోయారు. అయితే గత ఆగస్టు వర్షాల సమయంలో పైరు ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నందున నష్టం అంచనా కిందకు రాలేదని, ప్రస్తుతం పరిస్థితిని ఉన్నతాధికారులకు వివరిస్తామని ఏవో రైతులకు హామీ ఇచ్చారు. ఇదే విషయాన్ని డీఏవో దృష్టికి తీసుకెళ్లగా ప్రభుత్వం దృష్టిలో ఉంచుతామని చెప్పారు.

వినియోగదారులకు బిల్లుల భారం ఉండదు

తిరువూరు, న్యూస్‌టుడే: పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజనను గృహ విద్యుత్తు వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని నూజివీడు డివిజన్ ఈఈ ఎ.సత్యనారాయణ తెలిపారు. స్థానిక విద్యుత్తు శాఖ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తాజాగా అమల్లోకి తీసుకువచ్చిన పథకం ప్రయోజనాలను వివరించారు. పథకం ద్వారా ఏర్పాటు చేసే సోలార్ రూఫ్ టాప్ ప్యానెల్ ద్వారా నెలకు 125 యూనిట్ల వరకు విద్యుత్తు ఉత్పత్తి చేస్తుందన్నారు. వినియోగదారులకు బిల్లుల భారం ఉండదన్నారు. అనంతరం పథకం గోడపత్రికలను ఆవిష్కరించారు. తిరువూరు డీఈఈ పి.రామకృష్ణ, ఏఈలు పి.నాగరాజు, వి.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ గ్రామ సభలు

గంపలగూడెం, విస్సన్నపేట, న్యూస్‌టుడే: రీసర్వే జరిగిన గ్రామాల్లో బుధవారం ఉదయం 10 గంటల నుంచి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఆయా మండలాల రెవెన్యూ అధికారులు తెలిపారు. తిరువూరు మండలంలోని చిట్టేల, గంపలగూడెం మండలం అనుముల్లంక, విస్సన్నపేట మండలం కొర్లమండ, ఎ.కొండూరు మండలం తూర్పు మాధవరంలో భూ సమస్యలపై రైతులు అర్జీలు అందించవచ్చన్నారు.

ఏడు గ్రామాల్లో ఆధార్ శిబిరాలు నేడు

విస్సన్నపేట, ఎ.కొండూరు, న్యూస్‌టుడే: విస్సన్నపేట మండల పరిషత్ కార్యాలయంలో చంద్రుపట్ల, లంబాడీతండా, తెల్లదేవరపల్లి, పుట్రేల గ్రామస్థులకు, తిరువూరు మండలంలోని ముష్టికుంట్ల, ఆంజనేయపురం గ్రామ సచివాలయాల్లో, తిరువూరు నగర పంచాయతీలోని రాజుపేట 1వ వార్డు సచివాలయంలో బుధవారం ఆధార్ శిబిరాలు నిర్వహిస్తామని ఆ మండలాల అధికారులు తెలిపారు.

ప్రజల నుంచి స్పందన

విస్సన్నపేట, తిరువూరు, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో మంగళవారం నిర్వహించిన ఆధార్ శిబిరాలకు ప్రజల నుంచి స్పందన లభించింది. ఆధార్‌లో సవరణలకు కేంద్రాలకు చేరుకుని బయోమెట్రిక్, ఐరిష్ ద్వారా సచివాలయాల ఉద్యోగులకు దరఖాస్తులు అందజేశారు.

పాఠశాలకు రూ.40వేలు వితరణ

నరసాపురం(విస్సన్నపేట), న్యూస్‌టుడే: మండలంలోని నరసాపురం జడ్పీ ఉన్నత పాఠశాలకు ప్రవాసాంధ్రుడు కనకపూడి రామారావు రూ.40వేలు వితరణగా అందించారు. ఆ విరాళంతో పాఠశాలకు అవసరమైన మైక్‌సెట్ కొనుగోలు చేసినట్లు ప్రధానోపాధ్యాయిని ఎస్.శోభాలత తెలిపారు. కార్యక్రమంలో దాత సోదరుడు ఇజ్రాయిల్, తెదేపా నాయకులు జి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, పీడీ మేరుగు రమేష్, గ్రామస్థులు శ్రీనివాసరెడ్డి, పాపారావు, రామకృష్ణ, ఉపాధ్యాయులు అనిల్, శ్రీధర్ పాల్గొన్నారు.

అ వీ ఇ వీ

బాలుర ఉన్నత పాఠశాలకు రూ.10వేలు..

తిరువూరు: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు స్థానికుడైన నాగుబండి శ్యామ్ సుందరరావు మంగళవారం రూ.10వేలు విరాళం అందజేశారని ఇన్‌ఛార్జి హెచ్‌ఎం కె.శంకరరావు తెలిపారు. దాత తన విరాళంతో బడిలో సిమెంట్ బల్లలు ఏర్పాటు చేయాలని కోరారు.

ఎన్‌సీసీతో ఉత్తమ పౌరులుగా ఎదగొచ్చు

మైలవరం: ఎన్‌సీసీ ద్వారా యువత ఉత్తమ పౌరులుగా ఎదగొచ్చని 17వ బెటాలియన్ కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ జీసీ పాండే పేర్కొన్నారు. స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మంజూరైన ఎన్‌సీసీని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిక నిమిత్తం విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించగా ప్రతిభ చూపిన 84 బాలికలు, 13 మంది బాలురు ఎంపికయ్యారు. ప్రిన్సిపల్ ఇల్లా రవి, పీడీ మన్నేస్వామి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పవర్‌లిఫ్టింగ్‌లో పతకాలు

మైలవరం, న్యూస్‌టుడే: కృష్ణాజిల్లాలోని కేసరపల్లిలో అమరావతి పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడిజిల్లా స్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు పతకాలు సాధించినట్లు ప్రిన్సిపల్ కె.అప్పారావు తెలిపారు. ఈఈఈ ద్వితీయ సంవత్సరం చదువుతున్న డి.రామ్‌కుమార్ పతకాలు, కేకే సిద్ధార్థ బంగారు, టి.గోపిచంద్ వెండి, పతకాలను సాధించినట్లు పేర్కొన్నారు. వారిని పీడీ రాజ్‌కుమార్, శిక్షకుడు నటరాజ్‌లను కళాశాల అధ్యక్షుడు జి.శ్రీనివాసరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

రాతపుస్తకాల అందజేత

జి.కొండూరు, న్యూస్‌టుడే: ఇటీవల సంభవించిన వరదల్లో స్థానిక సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం విద్యార్థుల రాత పుస్తకాలు, దుస్తులు, నిత్యావసరాలు కొట్టుకుపోయాయి. విషయం తెలుసుకున్న జి.కొండూరు గ్రామానికి చెందిన ప్రవాస భారతీయుడు ఒరుగంటి నరసింహారావు రూ.10 వేల ఆర్థికసాయం అందించగా ఆయన మిత్రుడు పీ రమేష్ విద్యార్థులకు రాతపుస్తకాలు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమాధికారి ఎం.చంద్రమోహన్, సిబ్బంది సుధీర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై అర్జీల అందజేత

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: పాత నాగులూరు పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం రీసర్వేకు సంబంధించి జరిగిన గ్రామ సభలో రైతులు 28 మంది అర్జీలు అందజేసినట్లు తహసీల్దార్ జె.సుశీలదేవి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి వెంకటేశ్వరరావు(చిన్ని), ఆర్.ఐ జి.పుల్లయ్య, వీఆర్వో శ్రీను, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం గ్రామీణం: రైతులకు సూచనలు ఇస్తున్న డీఐవోఎస్ సుబ్బారావు

కొటికలపూడిలో 15 దరఖాస్తులు

ఇబ్రహీంపట్నంగ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామీణ మండలం కొటికలపూడి గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభలో గతంలో నిర్వహించిన భూ సర్వేలో జరిగిన తప్పులను సరిదిద్దాలని కోరుతూ 15 మంది రైతులు వినతిపత్రాలు అందించారు. డీఐవోఎస్ కె.సుబ్బారావు మాట్లాడుతూ..వినతులు ఇచ్చిన రైతులకు రశీదులిచ్చి భూమిని పరిశీలించి ఆయా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచి నాగరాజు, ఉప తహసీల్దారు సుజాత, గ్రామ కార్యదర్శి బాషా, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని చెన్నవరంలో నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభలో భూ సంబంధిత సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 37 మంది రైతులు వినతిపత్రాలు అందజేశారని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మాదాసు వీరభద్రరావు తెలిపారు. సభలో మండల సర్వేయర్ సాంబశివరావు, వీఆర్వోలు ఏవీఆర్.మూర్తి, కనకదుర్గారావు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

ఆంజనేయపురం(తిరువూరు), న్యూస్‌టుడే: మండలంలోని ఆంజనేయపురంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో విస్తీర్ణంలో తేడాలు, సర్వే నంబరు, ఎల్‌పీఎం, ఖాతా నంబర్లు సరిజేయుట, మ్యుటేషన్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 35 మంది రైతులు అర్జీలు అందజేశారని ఆర్ఐ బి.మోహన్‌రావు, మండల సర్వేయరు నల్లిబోయిన గోపాలకృష్ణ తెలిపారు. సర్పంచి మామిడి కుటుంబరావు, ఎంపీటీసీ సభ్యురాలు మామిడి కోటేశ్వరి, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

సామూహిక నివారణ చర్యలు మేలు

చంద్రగూడెం(మైలవరం), న్యూస్‌టుడే: పంటలను నాశనం చేసే ఎలుకలను నిర్మూలించాలంటే సామూహిక నివారణ చర్యలు చేపడితేనే మేలని జిల్లా వ్యవసాయాధికారిణి నాగమణెమ్మ పేర్కొన్నారు. మండలంలోని చంద్రగూడెం రైతుసేవాకేంద్రం వద్ద మంగళవారం ఎలుకల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బ్రోమోడయోలిన్ అనే మందును ఉపయోగించి పొలాల్లో ఎలుకలు ప్రవేశించే రంధ్రాల్లో ఉంచాలని సూచించారు. రైతులకు కావాల్సిన ఎరువులు రైతుసేవాకేంద్రాల్లో అందుబాటులో ఉంటాయన్నారు. వ్యవసాయశాఖ డైరెక్టరేట్ డీడీఏ ఎ.శారదతో కలిసి పొలాల్లో నివారణా విధానాన్ని ప్రదర్శించారు. వ్యవసాయ అధికారులు సంధ్యారాణి, అనితాభాను, ఊర్మిళ,



మూలపాడులో రైతులతో విషపు ఎరలు తయారుచేయిస్తున్న వ్యవసాయాధికారులు



మైలవరం: ఎలుకల నివారణ మందు అందజేస్తున్న డీఏఓ నాగమణెమ్మ, అధికారులు



ఎ.కొండూరు : డీటీ మాధవీలత ఆధ్వర్యంలో...

నాయకులు రోశాలు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పోలిశెట్టిపాడు(ఎ.కొండూరు): వరిలో ఎలుకల ద్వారా పంట నష్టం అధికంగా ఉంటుందని, సామూహిక ఎలుకల నిర్మూలన ప్రక్రియ ద్వారా రైతుల పంటనష్టం నివారించవచ్చని జిల్లా వనరుల కేంద్రం డీటీ టి.మాధవీలత సూచించారు. సర్పంచి బి.చిట్టిబాబు, ఏడీఏ జి.కెనడి, ఏవో ఎస్‌కే.టిప్పుసుల్తాన్, హెచ్‌వో బి.నరేంద్ర, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గానుగపాడు(తిరువూరు): సమగ్ర ఎలుకల యాజమాన్యం, యాంత్రిక పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం డీడీ టి.మాధవీలత రైతులకు సూచించారు.

ఇబ్రహీంపట్నంగ్రామీణం, న్యూస్‌టుడే: ఇబ్రహీంపట్నం గ్రామీణ మండల పరిధిలోని గ్రామాల్లో మంగళవారం వ్యవసాయాధికారుల ఆధ్వర్యంలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వాళ్లు మాట్లాడుతూ..విషపు ఎరలను తయారు చేయడానికి రెండు గ్రాముల బ్రోమోడయోలిన్ మందును ఉపయోగించాలన్నారు. వ్యవసాయాధికారులు శారద, అనితా భాను, ఊర్మిల, వాసుదేవనాయక్, శ్రీనివాస్, రజనిలతోపాటు వ్యవసాయ సహాయకులు పుష్ప, సాయి రైతులు పాల్గొన్నారు.

ఇరుక్కుపోయిన కంకర లారీ



భారీ వర్షానికి కట్లేరుకు చేరిన వరద నీరు మంగళవారం వినగడప సమీప వంతెన వద్ద మళ్లింపు రోడ్డుపై ప్రవహించింది. అదే సమయంలో సామర్థ్యానికి మించి కంకర లోడుతో వచ్చిన టిప్పర్ మళ్లింపు రోడ్డు మధ్యలో ఒక పక్కకు ఒరిగి ఆగిపోయింది. దీంతో అటుగా పయనించే వాళ్లకు ఆటంకమైంది. మధ్యాహ్నం రెండు భారీ పొక్లెయిన్ల సాయంతో లారీని బయటకు తీసుకువచ్చారు. మళ్లింపు రోడ్డుపైకి వరద నీరు చేరగానే అటుగా భారీ వాహనాలు రాకుండా నియంత్రించాల్సిన అధికారులు పట్టించుకోలేదు. దీంతో సమస్య ఉత్పన్నమైందని ప్రజలు తెలుపుతున్నారు. సాయంత్రం వరకు వాహనదారులు రాకపోకలు సాగించలేక ఇబ్బందులు పడ్డారు.

\- న్యూస్‌టుడే, వినగడప(గంపలగూడెం)

ఇసుక కోసం ట్రాక్టర్ల బారులు



రేవుల్లో ఇసుకను ఉచితంగా తీసుకెళ్లేందుకు ట్రాక్టర్ లేదా ఎడ్ల బండి ఏర్పాటు చేసుకోవచ్చు. వినియోగదారుడు కూలీలు లేదా తానే స్వయంగా ట్రాక్టర్‌లో ఇసుక లోడు చేసుకోవచ్చు. కానీ ఇందుకు విరుద్ధంగా తిరువూరు మండలం గానుగపాడు సమీప కట్లేరు రేవుకు మంగళవారం వందల సంఖ్యలో ట్రాక్టర్లు ఒక్కసారిగా చేరుకున్నాయి. చింతలపాడు-గానుగపాడు దారిలో ఇసుక కోసం వచ్చిన ట్రాక్టర్లు పదుల సంఖ్యలో బారులు దీరాయి. దీంతో ఆ రోడ్డుపై గంటల తరబడి ట్రాఫిక్ సమస్య ఏర్పడింది.

\- న్యూస్‌టుడే, తిరువూరు

అంబులెన్స్, లారీ ఢీకొని ఆరుగురికి గాయాలు

తల్లాడ, న్యూస్‌టుడే: ప్రైవేట్ అంబులెన్స్, లారీ ఢీకొన్న ఘటనలో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. తిరువూరు మండలం మునుకుళ్లకు చెందిన సీహెచ్ కనకమ్మ అనారోగ్యంతో బాధపడుతుండగా కుటుంబీకులు మంగళవారం రాత్రి ఓ ప్రైవేట్ అంబులెన్స్‌లో తిరువూరు నుంచి ఖమ్మం ఆసుపత్రికి తరలిస్తున్నారు. తల్లాడ బస్టాండ్ సమీపంలో రహదారి పక్కన నిలిపి ఉంచిన ఓ లారీని తప్పించే క్రమంలో డివైడర్ దాటి ఎదురుగా వస్తున్న మరో లారీని అంబులెన్స్ ఢీకొంది. ప్రమాదంలో అంబులెన్స్‌లో ఉన్న ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను తల్లాడ, ఏన్కూరు 108 వాహనాల్లో ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వాగులో మునిగి కూలీ మృతి

మైలవరం, న్యూస్‌టుడే: చేపలు పడుతూ ప్రమాదవశాత్తూ నీటిలో మునిగి ఒకరు మృతి చెందారు. ఎస్సై కె.సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. కూలి పనులు చేసుకునే మైలవరానికి చెందిన బొంక రాజు (55) సోమవారం కుమారుడు, మేనల్లుడితో కలిసి వెల్వడంలోని బుడమేరులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ఒక ఒడ్డు నుంచి వల వేసుకుంటూ మరో ఒడ్డుకు వస్తున్న సమయంలో లోతుగా ఉన్న గుంతలో రాజు మునిగిపోయాడు. అతడి మేనల్లుడు పట్టుకునే ప్రయత్నం చేసినా..వాగులో ప్రవాహానికి కొట్టుకుపోయాడు. మునిగిన ప్రాంతానికి దాదాపు అర కిలోమీటరు దూరంలో మంగళవారం మృతదేహం ఒడ్డుకు రావడంతో పోలీసులు పోస్టుమార్టానికి తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

కుండలకు భలే గిరాకీ

ఇబ్రహీంపట్నంగ్రామీణం, కొండపల్లి, న్యూస్‌టుడే

వివాహాల్లో వీటికి ప్రాధాన్యం ఎక్కువ

అవిరేణి కుండలు, గరిక ముంతలు, పోలు ముంత, కూరాడు, అఖండ దీపం వంటి మట్టి కుండలకు హిందూ వివాహ వ్యవస్థలో ప్రాధాన్యం సంతరించుకున్నాయి. వీటిని తీర్చిదిద్దడంలో కొండపల్లి శాలివాహన గృహిణులు చేయితిరిగిన వారు. ఈ నెల 12వ తేదీ నుంచి పెళ్లి ముహూర్తాలు ప్రారంభం కాగా ఈ ఏడాది చివరి వరకు కొనసాగనున్నాయి. దీంతో కొండపల్లి శాలివాహనులు మట్టికుండలను తీర్చిదిద్దుతూ, రంగులతో అలంకరించి మెరుగులు పెట్టి విక్రయాలకు సిద్ధంగా ఉంచారు.



గరిక ముంతకు రంగులు అద్దుతున్న గృహిణి

రూ.100 నుంచి రూ.500 వరకు

వివాహ ముహూర్తాల సమయంలో వీటికి విజయవాడ నగరంతోపాటు పరిసర శివారు గ్రామాల్లో మంచి డిమాండ్ ఉంది. సీజన్‌కు ముందే మగవారు వీటిని తయారు చేసి బట్టీల్లో కాల్చిన తరువాత వాటిని గృహిణులకు అందజేస్తారు. వారు తీరిక సమయాల్లో వాటికి రంగులు అద్ది తీర్చిదిద్దుతారు. విజయవాడ నగరంలో కృష్ణలంక తదితర ప్రాంతాల్లో వీటి విక్రయాలు చేసే వ్యాపారులు ముందస్తుగా వీళ్లతో ఒప్పందాలు కుదుర్చుకుని టోకుగా కొనుగోలు చేస్తుంటారు. కొండపల్లి శాలివాహన బజారులో ఇళ్ల వద్ద కూడా విక్రయిస్తుంటారు. పెళ్లి ముహూర్తాల సమయంలోనే గిరాకీ ఉంటుందని రూ.100 నుంచి రూ.500 వరకు అమ్ముతామని తయారీదారులు చెబుతున్నారు.

ప్రతిభా పోటీలో విద్యార్థినుల సత్తా

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామ శ్రీవిద్య ఉన్నత పాఠశాలలో మంగళవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీ నిర్వహించారు. 8, 9, 10వ తరగతి విద్యార్థులకు 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు... విద్యార్థులపై సోషల్‌మీడియా ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. పి.సంజన (పదో తరగతి) ప్రథమ, ఆర్.సుస్మిత (తొమ్మిదో తరగతి) ద్వితీయ, కె.మేఘన (పదో తరగతి) తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులను డైరెక్టర్ మేకల రాము, ప్రిన్సిపల్ చిన్నజోష్ అందజేశారు. పాఠశాల ఛైర్మన్ మల్లికార్జునరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


వ్యాసం రాస్తున్న విద్యార్థులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డైరెక్టర్ రాము, ప్రిన్సిపల్ చిన్నజోష్ తదితరులు

నందిగామ

• నందిగామ • జగ్గయ్యపేట


ఉత్పత్తులు పరిశీలిస్తున్న అధ్యక్షురాలు సౌజన్య, సీఎంఎం సత్యవతి తదితరులు

మెప్మా బజార్ ప్రారంభం

నందిగామ: గాంధీ సెంటర్‌లో మంగళవారం మెప్మా, పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెప్మా బజారును పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సౌజన్య ప్రారంభించారు. డ్వాక్రా సంఘాల ఆధ్వర్యంలో మహిళలు తయారు చేసిన పలు రకాల వస్తువులు ఇక్కడ విక్రయిస్తారు. ఉత్పత్తులకు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చినట్లు సిటీ మిషన్ మేనేజర్ సత్యవతి తెలిపారు. మహిళా సమైక్య కార్యదర్శి కోటేశ్వరమ్మ, కోశాధికారి దుర్గ, రమాఆదిలక్ష్మి పాల్గొన్నారు.

నిండా పూడిక.. నీరు చేరక

పిచ్చిచెట్లతో సాగర్ కాలువలు అధ్వానం

పెనుగంచిప్రోలు, వత్సవాయి, న్యూస్‌టుడే

ఈ ఏడాది నాగార్జున సాగర్ పూర్తిగా నిండడంతో ఆయకట్టు రైతుల్లో ఆనందం వ్యక్తమైంది. పంటల సాగుకు నీరందుతుందనే ఉద్దేశంతో ఆలస్యమైనా మిర్చి సాగు చేపట్టారు. ప్రధాన కాలువల్లో నీరు పారుతున్నా.. మేజర్, మైనర్ కాల్వలకు అందకపోవడంతో అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారు. ఆ కాలువలకు ఏళ్ల తరబడి కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో పూడిక పెరిగి, కంపచెట్లతో అధ్వానంగా మారడమే దీనికి కారణం.

ఆయకట్టు కింద లక్ష ఎకరాలు

జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఎన్నెస్పీ కాలువల కింద లక్ష ఎకరాలకు సాగునీరు అందాలి. సుమారు 25 వేల ఎకరాల్లో మిర్చి సాగు చేస్తుంటే.. అందులో సుమారు 10 వేల ఎకరాలకు ఎన్నెస్పీ నీరే ఆధారం. గత ప్రభుత్వ హయాంలో తెలంగాణ నుంచి సరిగా సాగునీరు విడుదల కాలేదు. కనీస నిర్వహణ లేక కాలువల్లో పిచ్చి చెట్లు పెరిగి చిట్టడివిని తలపిస్తున్నాయి. పదేళ్ల కిందటే కాలువలన్నింటికీ సిమెంటు లైనింగ్ చేసినా అందులో పూడిక పేరుకుంది. ఫలితంగా నీరు పారని దుస్థితి నెలకొంది.

శనగపాడు మేజర్-1

దీని పరిధిలో 9,100 ఎకరాల ఆయకట్టు ఉంది. భీమవరం వద్ద మొదలైన ఈ కాలువలో సుమారు పది కి.మీ. వరకు బాగానే ఉన్నా, దిగువన పిచ్చిచెట్లు ఉండడంతో ముండ్లపాడు దాటి కొళ్లికూళ్ల, వెంకటాపురం వరకు నీరు పారడం లేదని రైతులు వాపోతున్నారు.

శనగపాడు-2


దీని ఆయకట్టులో 7 వేల ఎకరాలున్నాయి. ఇది భీమవరం నుంచి మొదలవుతోంది. ముండ్లపాడు దిగువన ఈ కాలువ పరిస్థితి అధ్వానంగా మారింది. కంపచెట్లతో నిండి సాగునీరు ముందుకు కదలడం లేదని అన్నదాతలు చెబుతున్నారు.

పెనుగంచిప్రోలు మేజర్

ఈ కాలువ పరిధిలో 6,900 ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రధాన కాలువైన డీవీఆర్ బ్రాంచి మంగొల్లు నుంచి గోపినేనిపాలెం, మక్కపేట, పెనుగంచిప్రోలు వరకు ఉన్నా చివరి భూములకు సాగునీరు అందడం లేదు. ఈ గ్రామాల పరిధిలో సుమారు రెండు కి.మీ. మేర కాలువల్లో పిచ్చికంప పెరిగి సాగునీరు పారడం లేదు.

నిధులు రాగానే మరమ్మతులు

ప్రస్తుతం నిధుల కొరత వల్ల పనులు చేపట్టలేకపోతున్నాం. మరమ్మతులకు అవసరమైన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపుతున్నాం. నిధులు రాగానే పనులు చేపడతాం. **- రాంబాబు, ఎన్నెస్పీ డీఈ**


కంప చెట్లతో పెనుగంచిప్రోలు ప్రధాన కాలువ

ఉపాధి పథకం ఎఫ్‌ఏపై ఫిర్యాదు

పెనుగంచిప్రోలు: గుమ్మడిదుర్రు గ్రామానికి చెందిన ఉపాధి హామీ పథకం క్షేత్రసహాయకుడు (ఎఫ్‌ఏ) అజరయ్యపై వచ్చిన ఆరోపణలపై అధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోవాలని గ్రామ తెదేపా నాయకులు మండల అధికారులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎఫ్‌ఏను గత ఏప్రిల్‌లో అధికారులు విధుల నుంచి తొలగించారు. తర్వాత ఎటువంటి విచారణ లేకుండానే మళ్లీ విధుల్లోకి తీసుకున్నారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. అయినా అతనిలో మార్పు రాలేదని, కూలీల పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ.. పనులు చేపట్టే విషయంలో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. అధికారులు పూర్తి స్థాయి విచారణ చేసి తొలగించాలని వారు డిమాండ్ చేశారు.

సీపీఎం గ్రామ మహాసభలు

జగ్గయ్యపేట గ్రామీణం: మండలంలోని అనుమంచిపల్లి, తక్కెళ్లపాడు గ్రామాల్లో సీపీఎం గ్రామ మహాసభలను సోమవారం షేక్ జాన్ సాహెబ్, నాచుబోయిన పద్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభలకు సీపీఎం మండల కమిటీ నాయకులు కోట రవికుమార్, జుజ్జవరపు వెంకటరావులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇటీవల మృతి చెందిన సీపీఎం ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్యలకు సంతాప సూచికంగా మౌనం పాటించారు. అనుమంచిపల్లి, తక్కెళ్లపాడు గ్రామ సీపీఎం కార్యదర్శులుగా దాసరాజు అబ్బాస్, నాచుబోయిన పద్మలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం అనుమంచిపల్లిలోని మహాసభలో ఐదు తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

జగ్గయ్యపేట: 8008 574714, నందిగామ: 8008 574713

స్పందనకు వందనం

❖ పెనుగంచిప్రోలు తూర్పుబజార్ రంగిశెట్టివారి వీధిలో డ్రెయిన్లలో పూడిక తీయాలని 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా సర్పంచి వేల్పుల పద్మకుమారి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆమె సిబ్బందిని పంపించి డ్రెయిన్లను శుభ్రం చేయించారు.

❖ పెనుగంచిప్రోలు పోస్టాఫీస్ రోడ్డులో తాగునీటి సరఫరా పైపులు మరమ్మతులకు గురికావడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. స్థానికులు సమస్యను పంచాయతీ కార్యదర్శి శ్యాంకుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన మరమ్మతులు చేయించారు.

❖ పెనుగంచిప్రోలు తుఫాన్‌కాలనీ మండల పరిషత్తు కార్యాలయం వద్ద డ్రెయిన్లలో పూడిక తీయాలని స్థానికులు సర్పంచి పద్మకుమారి దృష్టికి తీసుకెళ్లారు. ఆమె సిబ్బందిని పంపించి డ్రెయిన్లు శుభ్రం చేయించారు. **- పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే**

❖ పెద్దవరం గ్రామంలో ఎల్‌ఈడీ వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా పంచాయతీ కార్యదర్శి జనార్దనకుమార్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన కార్మికులతో ఎల్‌ఈడీ దీపాలు ఏర్పాటు చేయించారు.

❖ పెద్దవరం శివారు చెర్వుకొమ్ముపాలెం ఎస్సీ కాలనీలో డ్రెయిన్లు శుభ్రం చేయించాలని స్థానికులు పంచాయతీ కార్యదర్శి జనార్దనకుమార్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన పూడిక తీయించారు.

❖ సోమవరంలో పట్టపగలు వీధి దీపాలు వెలుగుతున్నాయని స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా గ్రామ సచివాలయ కార్యదర్శి సతీష్ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన మరమ్మతులు చేయించారు. **- నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే**

ఎలుకల నివారణ చేపట్టాలి

వత్సవాయి, న్యూస్‌టుడే: వరి పంటను అధికంగా నష్టపరిచే ఎలుకల నివారణ చర్యలపై అన్నదాతలు దృష్టి సారించాలని జగ్గయ్యపేట వ్యవసాయ సహాయ సంచాలకులు సి.భవాని సూచించారు. భీమవరంలో వ్యవసాయాధికారులు, సిబ్బంది, రైతులతో కలిసి పొలాల్లో పొలంబడి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు.

మోకాళ్ల చికిత్సకు సాయం

జగ్గయ్యపేట: వత్సవాయికి చెందిన బిట్ర నాగమణి మోకాళ్ల నొప్పులతో బాధపడుతూ వైద్యుల సలహా మేర శస్త్రచికిత్స అవసరం కావడంతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి విడుదలైన సాయాన్ని ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య మంగళవారం కుటుంబ సభ్యులకు అందజేశారు. రూ.2.17 లక్షల విలువైన ఎల్‌ఓసీ పత్రాన్ని ఆయన వారికి అందజేశారు.

మురుగు అరికట్టేందుకు అధికారుల పరుగులు


కాకాని నగర్‌లో ఫిర్యాదుదారు కృష్ణారెడ్డి కుటుంబాన్ని ప్రశ్నిస్తున్న అధికారులు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: 'పైపులైన్ పగిలి.. తాగునీరు మురికి' శీర్షికన 'ఈనాడు'లో మంగళవారం ప్రచురితమైన కథనం మున్సిపల్ అధికారులను పరుగులు పెట్టించింది. 'ఈనాడు' కథనానికి తోడు తాగునీటి కాలుష్యాన్ని ఉపేక్షించేది లేదంటూ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేసిన హెచ్చరికలతో కలెక్టర్ స్పందించి వెంటనే పరిష్కారం చూడాలని ఆదేశించడంతో పట్టణ శివార్లలో వైద్యారోగ్య, ప్రజారోగ్య సిబ్బంది ప్రత్యేక పర్యటనలు చేపట్టారు. పట్టణంలో గత నెల మొదటివారంలో వరదల ఉద్ధృతికి పైపులైన్ల ధ్వంసమై 50 రోజులైనా పురపాలక సంఘం సమస్య పరిష్కరించకపోవడంతో ఏర్పడుతున్న దుస్థితిని అధికారులు పరిశీలించారు. డీఎంహెచ్‌ఓ సుహాసిని ఆదేశాలతో డాక్టర్ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్యాధికారుల బృందం మురుగునీటి ప్రభావంపై ప్రత్యక్షంగా పరిశీలన చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ రామ్మోహనరావు ఆదేశాలతో డీఈ కలీముల్లా సహా ఇంజినీరింగ్ విభాగం ఎక్కడెక్కడ పైపులైన్ల లీకులు ఉన్నాయో కనిపెట్టే పనిలో నిమగ్నమయ్యారు. ఇటీవల రాజీవ్‌చౌక్‌లో పైపులైన్ లీకుపై 'మేమున్నాం మీకుతోడుగా' ద్వారా ఇచ్చిన ఫిర్యాదును పరిశీలించారు. కాకాని నగర్‌లో మురుగు నీటి సరఫరాపై ఫిర్యాదు చేసిన ఎన్.వి.కృష్ణారెడ్డి కుటుంబాన్ని బృందాలు కలిసి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నాలుగు నెలల క్రితం జగ్గయ్యపేటలో డయేరియా విజృంభించి ఎనిమిది మందిని పొట్టన పెట్టుకున్న నేపథ్యంలో 'ఈనాడు' కథనంతో జిల్లా అధికారులు ఒక్కసారిగా అప్రమత్తమై ఈ మేరకు స్పందించారు. మురుగునీటి వల్ల ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వైద్యాధికారి అనిల్ కుమార్ తెలిపారు. రెండ్రోజుల్లో పట్టణంలోని పైపులైన్ లీకున్నింటినీ గుర్తించి అవసరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ రామ్మోహనరావు తెలిపారు.

పాడిరైతుల సంక్షేమానికి కృషి

నందిగామ గ్రామీణం: పాడిరైతుల సంక్షేమానికి కృష్ణా మిల్క్ యూనియన్ కృషి చేస్తోందని జిల్లా అధ్యక్షుడు చలసాని ఆంజనేయులు తెలిపారు. మంగళవారం పల్లగిరి పాల కేంద్రాన్ని ఆయన సందర్శించి పాలకవర్గ సభ్యులు, పాడి రైతులతో సమావేశం నిర్వహించారు. పాలకవర్గ సభ్యులు నెలకుదిటి నాగేశ్వరరావు, ట్రస్ట్ డైరెక్టరు కోకా వెంకటేశ్వరరావు, పశువైద్యుడు ప్రసాద్, మేనేజరు యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పథకాల పరిశీలన

నందిగామ గ్రామీణం: అడవిరావులపాడు సీపీడబ్ల్యూఎస్ స్కీం, రాఘవాపురం తాగునీటి పైలట్ ప్రాజెక్టులను మంగళవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ విద్యాసాగర్ పరిశీలించారు. అడవిరావులపాడు వద్ద తాగునీటి చెరువు, ఫిల్టర్‌బెడ్లు చూశారు. ఈ చెరువుకు కృష్ణానదిపై నిర్మించిన కాట్రేనిపల్లి స్కీంను, చందర్లపాడు మండలం గుడిమెట్ల తాగునీటి పైలట్ ప్రాజెక్టును పరిశీలించారు. నందిగామ ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఎంవీవీఎస్ శాస్త్రి, ఏఈ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

సత్యమ్మతల్లి సేవలో ఎమ్మెల్యే కన్నా

నందిగామ గ్రామీణం: అంబారుపేట సత్యమ్మ తల్లిని మంగళవారం సాయంత్రం పల్నాడు జిల్లా సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ దర్శించుకున్నారు. హైదరాబాద్ నుంచి సత్తెనపల్లి వెళ్తూ.. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు.

'పట్టభద్రులకు అండగా ఉంటా'

నందిగామ గ్రామీణం: తనను గెలిపిస్తే పట్టభద్రులకు అండగా ఉంటానని కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి లగడపాటి వేణుగోపాల్ చెప్పారు. మంగళవారం నందిగామ చైతన్య కళాశాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి పోరాటానికి సిద్ధంగా ఉన్నానని అన్నారు. బీసీ సంఘం నాయకుడు బి.శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నిధుల కొరత గదుల కొరత

చందర్లపాడు, న్యూస్‌టుడే

మండలంలోని వెలదికొత్తపాలెం ఉన్నత పాఠశాలలో తరగతి గదుల నిర్మాణం నిలిచిపోయింది. ఇక్కడ ఆరు నుంచి పదో తరగతి వరకు 130 మంది చదువుతున్నారు. నాడు-నేడు కింద అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.1.75 కోట్లు కేటాయించారు. గత ఏడాది పనులు ప్రారంభించారు. మరుగుదొడ్లు, పాత గదులకు మరమ్మతులు పూర్తి చేసి మూడు అదనపు గదుల నిర్మాణం మొదలుపెట్టారు. నిధుల కొరతతో జూన్ నుంచి పనులు నిలిచిపోయాయి. గదుల వెలుపల ప్లాస్టరింగ్, విద్యుత్తు, రంగులు, తలుపులు, కిటికీలు అమర్చాలి. గదుల కొరతతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పరిస్థితిని ఉపాధ్యాయులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా... కూటమి ప్రభుత్వం రూ.మూడు లక్షలు సమకూర్చింది.

★ నిధుల కొరతతో ప్రహరీ నిర్మాణం నిలిపివేయాలని గత ప్రభుత్వంలో ఆదేశాలు జారీ చేశారు. ప్రహరీ నిర్మాణానికి రూ.28 లక్షలతో ప్రతిపాదనలు పంపారు. ప్రస్తుతం పాఠశాల ఆవరణలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయి.


వెలదికొత్తపాలెంలో అసంపూర్తిగా తరగతి గదులు

త్వరలో పనులు ప్రారంభిస్తాం

ఇప్పటివరకు రూ.70.84 లక్షల విలువైన పనులు చేశారు. మరో రూ.3 లక్షలు విడుదల చేశారు. త్వరలో పనులు ప్రారంభిస్తాం. విద్యుత్తు సామగ్రి సిద్ధంగా ఉంది. ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. అనుమతులు వచ్చిన వెంటనే నిర్మిస్తాం. **- ఎస్‌ఎస్‌ఏ ఏఈ పేమ్‌సాగర్**


తలుపు లేని మరుగుదొడ్లు

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే

బలుసుపాడు ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పనులు ఆగిపోయాయి. రెండో దశలో పాఠశాలకు రూ.96 లక్షలు కేటాయించారు. విద్యుత్తు సౌకర్యం కల్పించడంతో పాటు వంటగది, మరుగుదొడ్లు, 3 అదనపు గదుల నిర్మాణం చేపట్టారు. సిమెంట్, ఇసుక లేక పనులు సగంలోనే ఆగిపోయాయని పాఠశాల ఇన్‌ఛార్జ్ ప్రధానోపాధ్యాయుడు దుర్గాప్రసాద్ తెలిపారు. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా మినరల్ వాటర్ సదుపాయం కూడా ఏర్పాటు చేశామన్నారు. దాదాపు నిర్మాణం మొత్తం పూర్తయిన మరుగుదొడ్లకు తలుపులు లేవు. అవి వినియోగంలోకి రాలేదు. అదనపు గదులకు ఇంకా స్లాబ్ కూడా వేయలేదు. నిధులు మంజూరు చేయాల్సి ఉంది.

ఉపాధ్యాయులు లేక ఇబ్బంది

పాఠశాలలో బాలికలు 57, బాలురు 63 మంది ఉన్నారు. అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులు లేరు. ముఖ్యంగా ప్రధానోపాధ్యాయుడు లేకపోవడం గమనార్హం. సాంఘికశాస్త్రం ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్‌ను ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. గణిత శాస్త్రం, జీవ శాస్త్రం బోధించడానికి పని సర్దుబాటులో భాగంగా ఇద్దరిని కేటాయించారు. కేవలం తెలుగు, హిందీ, ఆంగ్లం, ఫిజికల్ సైన్స్, సాంఘిక శాస్త్రానికే శాశ్వత ఉపాధ్యాయులున్నారు. అన్ని సబ్జెక్టులకు శాశ్వత ఉపాధ్యాయులను కేటాయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు కూడా లేరు.

కంప చెట్లు.. వాహనదారుల ఇక్కట్లు



బలుసుపాడు - జగ్గయ్యపేట మార్గంలో ఇరువైపులా కంప చెట్లు పెరిగిపోయాయి. మలుపుల్లో ఎదురు వాహనాలు కనిపించడం లేదు. ఇటీవల ఎదురుగా వచ్చిన రెండు ద్విచక్ర వాహనాలు ప్రమాదానికి గురయ్యాయి. ఇద్దరూ నెమ్మదిగా వెళ్లడంతో స్వల్ప గాయాలయ్యాయి. ఆర్అండ్‌బీ అధికారులు కంప చెట్లను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు. **- జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే**

చంద్రబాబు పాలనలో ఏపీ అభివృద్ధి: తుమ్మల


వసంతతో నాగేశ్వరరావు

నందిగామ, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో ఏపీ అభివృద్ధి చెందుతుందని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం ఐతవరంలో మంగళవారం మాజీ హోం శాఖ మంత్రి వసంత నాగేశ్వరరావును మంత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రిని వసంత సత్కరించారు. మంత్రి మాట్లాడుతూ.. ఏపీ పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. తెలుగు రాష్ట్రాల ప్రజలంతా సంతోషంగా ఉండాలని అన్నారు. వసంత మాట్లాడుతూ... రెండు రాష్ట్రాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నాయని, ఆ దిశగా ఇరు రాష్ట్రాల సీఎంలు పని చేస్తున్నారని పేర్కొన్నారు. నాయకుడు రేపాల మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

అయ్యదేవర స్థలంలో సామాజిక సేవ

నందిగామ, న్యూస్‌టుడే: నందిగామలో ఉమ్మడి ఏపీ మాజీ స్పీకర్ దివంగత అయ్యదేవర కాళేశ్వరరావు దానమిచ్చిన స్థలంలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించనున్నామని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు తెలిపారు. ఐతవరంలో మంగళవారం మాజీ మంత్రి నాగేశ్వరరావును వడ్డేతో పాటు సెంట్రల్ విద్యుత్తు ఇంజినీర్ల సంఘం అధ్యక్షుడు అశోక్‌రావు మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని వసంత సత్కరించారు.

సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహణ

అల్లూరు(వీరులపాడు): మండలంలోని అల్లూరులో 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ గ్రామ సభను మంగళవారం నిర్వహించారు. వివిధ పనుల వివరాలు, పురోగతిని వివరించారు. ఎస్ఆర్‌పీ బి.సూర్యనారాయణ, ఏపీవో జనార్దన్, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

జీవాలకు నట్టల మందు

పేరకలపాడు(కంచికచర్ల), న్యూస్‌టుడే : మండలంలోని పేరకలపాడులో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందును వైద్యాధికారులు మంగళవారం పంపిణీ చేశారు. సర్పంచి మన్నె సాత్విక మాట్లాడుతూ... ప్రభుత్వం పశు వైద్యానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, జీవాల్లో నులి పురుగులను నివారిస్తే.. ఆరోగ్యంగా ఎదుగుతాయని అన్నారు. వైద్యాధికారి విజయ్ విశ్వనాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

చందర్లపాడు: స్థానిక మానవ వనరుల కేంద్రంలో ప్రత్యేక అవసరాల విద్యార్థులకు చర్చ్ ఆఫ్ క్రైస్ట్ ఎడ్యుకేషనల్ సొసైటీ, డూలాస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అందజేసిన పుస్తకాలు, పలకలు, పెన్సిళ్లను ఎంఈవో శ్యాంబాబు మంగళవారం పంపిణీ చేశారు. దాతలను ఎంఈవో అభినందించారు. పగిడిపల్లి దేవసహాయం, మణిఆనంద్, రత్నవినోద్, సిబ్బంది పాల్గొన్నారు.

బాబా మందిరంలో ప్రత్యేక పూజలు

వత్సవాయి, న్యూస్‌టుడే: వత్సవాయిలోని శిర్డీ సాయి మందిరంలో చేపట్టిన విగ్రహ పునః ప్రతిష్ఠ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం రుత్వికులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి గండి పూడ్చివేత


గ్రావెల్‌ని సరి చేస్తున్న జేసీబీ

నందిగామ గ్రామీణం: వరదలకు ఐతవరం వద్ద దెబ్బతిన్న విజయవాడ - హైదరాబాద్ జాతీయ రహదారికి మరమ్మతులు చేపట్టారు. ఎన్‌హెచ్-65 అధికారుల ఆధ్వర్యంలో కీసర టోల్‌ప్లాజా అధికారులు గ్రావెల్‌తో గండిని పూడ్చుతున్నారు. మునేటి వరదకు జాతీయ రహదారి అంచు భారీ కోతకు గురైన సంగతి తెలిసిందే. మరమ్మతుల వల్ల విజయవాడ నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్లే వాహనాలకు కొంత అసౌకర్యం కలుగుతోంది. రాకపోకలు జాప్యమవుతున్నాయి. మరమ్మతులు పూర్తి కావడానికి కొంత సమయం పడుతుందని కీసర టోల్‌ప్లాజా భద్రత మేనేజరు ఉమామహేశ్వరరావు తెలిపారు.

భాజపా నాయకుడు నోముల రఘుపై దాడికి యత్నం

జనసేన జిల్లా అధ్యక్షుడు ఉదయభానుపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటకు చెందిన భాజపా నాయకుడు, ప్రస్తుత తెదేపా కౌన్సిలర్ భర్త నోముల రఘుపై మంగళవారం స్థానికంగా దాడి యత్నం జరిగింది. స్కూటీపై చిల్లకల్లు వైపు వెళ్తుండగా ఎస్‌జీఎస్ కళాశాల వద్ద కారులో మంకీ క్యాపులు ధరించిన నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు కర్రలు, కత్తులతో తనపై దాడికి ప్రయత్నం చేశారని రఘు పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కారులో వెంటాడుతూ స్కూటీని ఢీకొట్టి కింద పడిన వెంటనే తనపై దాడికి ప్రయత్నించారని, వారిని నెట్టుకొని పారిపోయానన్నారు. తనను చంపాలన్న ఉద్దేశంతోనే ఈ దాడి జరిగిందని, దీనికి పూర్తి బాధ్యత ప్రస్తుత జనసేన జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభానుదేనని ఆరోపించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తన భార్య తెదేపా తరఫున పోటీ చేసి ఉదయభాను వార్డు నుంచి గెలిచారని, ఇటీవల ఉదయభాను, అతని బంధువులు, అనుచరులు చేస్తున్న ఇసుక వ్యాపారాలు, ఇతర అంశాలపై తాను నేరుగా ఫిర్యాదు చేయడం వల్లే కక్షసాధింపుగా ఈ హత్యాయత్నానికి పాల్పడ్డారని ఆరోపించారు. దీనిపై ఎస్‌ఐ వెంకటేశ్వరరావుని వివరణ కోరగా ఫిర్యాదుపై విచారణ చేస్తున్నామని, దాడిలో పాల్గొన్న నలుగురి ఆచూకీ కోసం సీసీ కెమెరాల సాయంతో అన్వేషిస్తున్నామన్నారు. కారులో ఇంకొందరు ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్న నేపథ్యంలో వారెవరనే విషయంపై కూడా దర్యాప్తు సాగుతుందన్నారు.

రహదారికి మరమ్మతులు చేయించండి


ఎంపీ శివనాథ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు కళావతి, హైమారావు తదితరులు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: దాములూరు - కూడలి ఆర్అండ్‌బీ రహదారిపై ఏర్పడ్డ భారీ గండ్లకు మరమ్మతులు చేయించాలని ఏటిపట్టు గ్రామాల తెదేపా నాయకులు సోమవారం రాత్రి ఎంపీ కేశినేని శివనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. గత నెలలో వైరా, కట్టలేరు వరదకు ఆర్అండ్‌బీ రహదారి రూపు కోల్పోయిందని, రోడ్డుపై కనీసం నడిచే పరిస్థితి కూడా లేక అవస్థలు పడుతున్నారని చెప్పారు. కూడలిలో సంగమేశ్వరస్వామి దేవాలయానికి కార్తీక మాసంలో భక్తులు వస్తారని, వారు ఇబ్బంది పడకుండా మరమ్మతులు చేయించాలని తెదేపా నాయకులు మన్నె కళావతి, చెరుకూరు హైమారావు, చల్లా తులసారావు, లగడపాటి శ్రీనివాసరావు వినతిపత్రం అందజేశారు. ఆర్అండ్‌బీ ఎస్ఈ దృష్టికి తీసుకువెళ్లి మరమ్మతులు చేయిస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. మంగళవారం తెదేపా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాంకు కూడా వినతిపత్రం అందజేశారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోండి

చందర్లపాడు: ఎమ్మెల్సీ ఓటు నమోదు చేయించుకోవాలని కోనాయపాలెంలో పట్టభద్రులకు తెదేపా నాయకులు మంగళవారం అవగాహన కల్పించారు. కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి త్వరలో ఎన్నికలు జరుగుతాయన్నారు. గతంలో ఓటు ఉన్న ఓటర్లు కూడా తప్పనిసరిగా మళ్లీ నమోదు చేయించుకోవాలని సూచించారు. ఓటు నమోదుకు అవసరమైన దరఖాస్తులను ఓటర్లకు అందజేశారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు వాసిరెడ్డి ప్రసాద్, గుత్తికొండ రాంబాబు, గ్రామస్థులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్‌లో భాగంగా జగ్గయ్యపేట బాలుర హైస్కూల్ వేదికగా జిల్లా స్థాయిలో నిర్వహించే అండర్-14 బాలురు, బాలికల కబడ్డీ పోటీలను ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య మంగళవారం ప్రారంభించారు. జిల్లా జట్టు ఎంపిక కోసం జరిగే ఈ పోటీలకు ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి 64 జట్లు పాల్గొన్నాయి. ప్రారంభ సభలో శ్రీరాంతాతయ్య మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల శారీరక దారుఢ్యానికి, మనోవికాసానికి తోడ్పడే క్రీడలకు అత్యంత ప్రాధాన్యమిస్తుందన్నారు. క్రీడోపాధ్యాయుడు గంటా వెంకటేశ్వరరావు బృందం ఆధ్వర్యంలో ప్రారంభమైన కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, ప్రధానోపాధ్యాయిని మాధవీలత, కౌన్సిలర్లు కంచేటి గీతారాణి, పేరం సైదేశ్వరరావు, పితాని శ్రీనాథ్, చిట్టూరి రమేష్, బాలకృష్ణ, నవీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అబ్దుల్ కలాం ఇండోర్ స్టేడియంలో అండర్-14, అండర్-17 బాలురు, బాలికల పవర్‌లిఫ్టింగ్, వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు బుధవారం ఉన్నట్లు గంటా వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్ర, శనివారాల్లో బాలుర హైస్కూల్ గ్రౌండ్‌లో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

విజయవాడ పశ్చిమ

వ్యాసరచనలో విద్యార్థుల ప్రతిభా పాటవం


వ్యాసం రాస్తున్న విద్యార్థులు


విజేతలకు బహుమతులు అందిస్తున్న పాఠశాల డైరెక్టర్ సూర్యారావు, వైస్ ప్రిన్సిపల్ శ్రీరామ్

చిట్టినగర్, న్యూస్‌టుడే: గొల్లపాలెంగట్టు సాయిబాబాగుడి సమీపంలోని గీతాంజలి ఇంగ్లీషు మీడియం పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు మంగళవారం నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు- విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు జరిగాయి. ఆయా పోటీలలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. పోటీల్లో ఎస్. మోహన్ ప్రసన్నకుమార్ రెడ్డి(10వ తరగతి) ప్రథమ, వి. చరణ్‌తేజ్(8వ తరగతి) ద్వితీయ, ఎస్.కె.చాందిని(7వ తరగతి) తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల డైరెక్టర్ ఎన్.సూర్యారావు, వైస్ ప్రిన్సిపల్ శ్రీరామ్ బహుమతులు అందించి అభినందించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

విజయవాడ నగరపాలక సంస్థ: నగరపాలక సంస్థ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఆప్కాస్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు కమిషనర్ ధ్యానచంద్రను కోరారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు దోనేపూడి కాశీనాథ్ ఆధ్వర్యంలో యూనియన్ నాయకులు మంగళవారం ప్రధాన కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. కార్మికుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. కమిషనర్ మాట్లాడుతూ... కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కార్మికుల వేతనాలపై కార్పొరేషన్‌కు ఆదేశాలు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ పరిధిలో ఒప్పంద పద్ధతిన విధులు నిర్వహిస్తున్న కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని న్యాయస్థానం సూచించింది. దీనిపై గతంలో ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు ఎ.రంగనాయకులు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించేందుకు కార్పొరేషన్ అంగీకరించారు. ఆపై న్యాయస్థానం ఆదేశాలను అమలు చేయలేదు. దీనిపై న్యాయస్థానం అసహనం వ్యక్తం చేయడంతో పాటు, తమ ఆదేశాలను ధిక్కరించినట్లు గుర్తించింది. తగిన వివరణ ఇవ్వాలని అధికారులకు సూచించింది. అయినా అధికారులు స్పందించకపోవడంతో న్యాయస్థానం గతంలో ఇచ్చిన ఆదేశాలు అమలు చేయాలంటూ రంగనాయకులు తిరిగి కోర్టుని ఆశ్రయించారు. స్పందించిన న్యాయస్థానం 6 వారాల్లో కార్మికుల వేతనాల సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించింది. డైరెక్టర్ ఆఫ్ కమిషనర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ద్వారా బాధ్యులైన అధికారులకు న్యాయస్థానం సూచనలు చేసింది. ఫలితంగా డైరెక్టర్ ఆఫ్ కమిషనర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ నుంచి నగరపాలక సంస్థ కార్యాలయానికి మంగళవారం సర్క్యులర్ జారీ అయ్యింది. ప్రతిగా నగరపాలక సంస్థ అధికారులు న్యాయస్థానానికి హాజరై తమ వాదన వినిపించాల్సి ఉంటుంది.

ర్యాంపు రోడ్డు పనులు ప్రారంభం

చిట్టినగర్, న్యూస్‌టుడే: ర్యాంపు రోడ్డు పనులు ఎట్టకేలకు ప్రారంభం కావటంతో స్థానిక ప్రజల్లో సంతోషం వెల్లివిరిసింది. 50వ డివిజన్‌లోని టెట్రా పిళ్లైస్వామివారి వీధిలో 6 నెలలుగా ర్యాంపు రోడ్డు పనులు ముందుకు సాగడం లేదు. స్థానిక కార్పొరేటర్, సీపీఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు డివిజన్‌లోని పలు అభివృద్ధి పనుల విషయమై ఇటీవల నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్రకు వినతి పత్రం అందించారు. కమిషనర్ వెంటనే స్పందించి పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించటంతో ర్యాంపు పనులను మంగళవారం ప్రారంభించారు. ఆయా పనులను కార్పొరేటర్ పరిశీలించారు.


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సత్యబాబు

కొండప్రాంతాల్లో రక్షణగోడల నిర్మాణం, గొల్లపాలెం గట్టు ప్రధాన రహదారి ముంపునకు గురికాకుండా ఎత్తు పెంచాల్సి ఉందని ఆయా పనులను కూడా పూర్తి చేయాలని అధికారులను ఆయన కోరారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత



విజయవాడ నగర పాలక సంస్థ, న్యూస్‌టుడే: పటమట కరణంగారి వీధిలో పూర్తి స్థాయి అనుమతి పొందకుండా అక్రమంగా నిర్మించిన ఓ భారీ భవనాన్ని నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళికాధికారులు మంగళవారం కూల్చివేశారు.

← నిర్మాణాన్ని కూల్చివేస్తున్న సిబ్బంది

పులకించిన పున్నమి ఘాట్

డ్రోన్ సదస్సుకు చక్కటి స్పందన


నవోత్సాహం


పున్నమిఘాట్‌లో డ్రోన్ విన్యాసాలను ఆసక్తిగా తిలకిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు


యువత.. కేరింత

ఈనాడు డిజిటల్ – అమరావతి, న్యూస్‌టుడే – భవానీపురం, విద్యాధరపురం

పున్నమి, భవానీ ఘాట్ వేదికగా నిర్వహించిన డ్రోన్ షో చూపరులను ఆకట్టుకుంది. మంగళవారం ఉదయం మంగళగిరిలో సీఎం చంద్రబాబునాయుడు సమ్మిట్‌ను ప్రారంభించారు. 'షో'ను చూడటానికి ప్రజలు భారీ ఎత్తున తరలొచ్చారు. ఒక్కసారిగా వేలాది డ్రోన్లు ఆకాశంలోకి ఎగిరి ప్రదర్శించిన దృశ్యాలను దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన అతిథులు ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సినిమా, జానపద పాటలకు కళాకారుల చేసిన నృత్యాలు ప్రేక్షకులను హోరెత్తించాయి. లేజర్ షో ఆకట్టుకుంటుంది.


చిన్నారులను అభినందిస్తూ..


మంగళగిరి సీకే కన్వెన్షన్‌లో సాంస్కృతిక ప్రదర్శనను తిలకిస్తున్న సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి రామ్మోహన్, రాష్ట్ర మంత్రులు అనిత, అచ్చెన్నాయుడు, అధికారులు తదితరులు

ఆశ్చర్యంగా ఉంది



ఇలాంటి సదస్సులు మాలాంటి విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతగానో ఉపయోగపడతాయి. నూతన సాంకేతికతతో ఒకేసారి ఐదు వేలకు పైగా డ్రోన్ల ప్రదర్శన ఆశ్చర్యంగా అనిపిస్తోంది. ఈ కార్యక్రమంతో కొత్త విషయాలు తెలుసుకున్నాం.

– ఎన్.అజయ్, సన్ని, చందు (విద్యార్థులు)

కనువిందు చేసింది



గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇలాంటి సదస్సు నిర్వహించలేదు. సాంకేతికతో డ్రోన్ల ప్రదర్శనలతో పాటు సాంప్రదాయ నృత్య, గీతాలాపనలు కనువిందు చేస్తున్నాయి. ఒకే సదస్సులో ఇన్ని కార్యక్రమాలు నిర్వహించడం నూతన అనుభూతిని ఇస్తున్నాయి.

– శ్రావ్య (గృహిణి, విజయవాడ)

చాలా ఆనందంగా ఉంది



ఇలాంటి ప్రదర్శన ఎప్పుడూ చూడలేదు. మంగళగిరిలో జరుగుతున్న సదస్సు అందరికీ ఎంతో ఉపయోగకరం. కొత్త పరిజ్ఞానాన్ని అందరూ తెలుసుకునేందుకు ఇలాంటివి ఎంతో దోహదపడతాయి. మన విజయవాడలో డ్రోన్ షో నిర్వహించడం చాలా ఆనందంగా ఉంది. పిల్లలకు ఇలాంటి కార్యక్రమాలు మరింతగా నచ్చుతాయి.

– కె.కృష్ణ ప్రియ (ప్రైవేటు ఉద్యోగిని, విజయవాడ)

డ్రోన్ షో ఆకట్టుకుంది



గతంలో ఎన్నడూ లేని విధంగా విజయవాడ వేదికగా ఏర్పాటు చేసిన భారీ డ్రోన్‌షో ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనను తిలకించడానికి అవకాశం కల్పించడం శుభ పరిణామం. సాంకేతికతపై సామాన్యులు అవగాహన పెంచుకునేందుకు వీలవుతుంది. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి అందరినీ భాగస్వామ్యం చేస్తున్న కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు.

– సురేష్‌కుమార్ (ప్రైవేటు ఉద్యోగి, అయోధ్యనగర్)

కొత్త ఆలోచనలకు దోహదం



భారీ సంఖ్యలో డ్రోన్లను ఒకేచోట ప్రదర్శించడం అద్భుతంగా ఉంది. ఇలాంటి సదస్సులు మా భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడతాయి. వీటి ద్వారా నూతన సాంకేతికతపై మరింత ఆసక్తి పెరుగుతోంది. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న ప్రభుత్వానికి ధన్యవాదాలు.

– వి.కావ్య, ప్రవళిక, సరోజిని (కళాశాల విద్యార్థినులు)

నిత్యాన్నదాన పథకానికి విరాళాలు



జి.జనార్దనరావు, కె.వి.వరప్రసాద్‌లకు అమ్మవారి చిత్రపటాలు అంజేస్తున్న ఆలయ అధికారులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వారి దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి ఇద్దరు దాతలు రూ.2,01,004 విరాళాలు మంగళవారం అందజేశారు. హైదరాబాద్ మియాపూర్ నివాసి జి.జనార్దనరావు రూ.1,01,000, పుదుచ్చేరి రాష్ట్రం యానానికి చెందిన కె.వి.వరప్రసాద్ రూ.1,00,004 విరాళాలను వేర్వేరుగా అందజేశారు. దాతల కుటుంబాలకు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. ఆశీర్వచన మండపంలో వారికి వేద పండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం డిప్యూటీ ఈవో రత్నంరాజు, ఏఈవో శ్రీనివాసరావు వారికి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

సెమీ కండక్టర్ విధానంలో ప్రగతి


విద్యార్థులకు ధ్రువపత్రాలు అందిస్తున్న కళాశాల అధ్యక్షులు మల్లికార్జునరావు, తదితరులు

చిట్టినగర్, న్యూస్‌టుడే: భారతదేశం సెమీ కండక్టర్ విధానంలో అద్భుతమైన ప్రగతి సాధించిందని పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షులు చలవాది మల్లికార్జునరావు అన్నారు. ఆ కళాశాల ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో వీఎల్ఎస్ఐ డిజైన్ ఫర్ టెస్టాబిలిటీ అండ్ ఫిజికల్ డిజైన్ అనే అంశంపై ఐదు రోజుల పాటు జరిగిన కార్యశాల మంగళవారంతో ముగిసింది. అనంతరం విద్యార్థులకు ధ్రువపత్రాలు అందించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి అమరసుధీర్, ఉపాధ్యక్షులు సురేంద్రకుమార్, కోశాధికారి రాఘవయ్య, రిసోర్స్ పర్సన్స్ అష్రఫ్ అలీ, ఉపేంద్రరావు, ప్రిన్సిపల్ పతంజలిశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

మట్టి ఖర్చులకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం

చిట్టినగర్, న్యూస్‌టుడే: పేద కుటుంబానికి మట్టి ఖర్చుల నిమిత్తం పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి ఆర్థిక సాయం అందించినట్లు కార్పొరేటర్ విజయ్‌కుమార్ తెలిపారు. 49వ డివిజన్ ప్రైజర్‌పేటలో ఉండే కొండ ఇజ్రాయేలు రాడ్ బెండింగ్ పని చేస్తారు. అతను అనారోగ్యంతో మృతి చెందడంతో సాయం అందించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా స్పందించి భార్య రమణను ఎమ్మెల్యే కార్యాలయం సిబ్బంది ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు.

విద్యార్థులకు వాస్తవికతపై అవగాహన


సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో రాజారావు తదితరులు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణతో విద్యార్థులకు వాస్తవికతపై అవగాహన పెరుగుతోందని బీఆర్ఆర్ హైస్కూల్ కరస్పాండెంట్ రాజారావు అన్నారు. గట్టువెనుక ప్రాంతంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో శిక్షణలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ ఉపాధ్యాయుడు వరకుమార్ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రాజారావు మాట్లాడుతూ.. విద్యార్థిదశలో స్కౌట్స్ అండ్ గైడ్స్, ఎన్‌సీసీ వంటి శిక్షణ పొందిన వారికి ప్రభుత్వ ఉద్యోగాలు పొందడంలో రిజర్వేషన్లు ఉంటాయని తెలిపారు. ఇటీవల బుడమేరు వరదలో సైతం స్కౌట్స్ విద్యార్థులు సేవల అందించడం స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం స్కౌట్స్ వ్యవస్థాపకులు లార్డ్ బేడన్ పోవెల్ చిత్రపటం వద్ద విద్యార్థులు గౌరవ వందనం చేశారు. పాఠశాల కమిటీ కార్యదర్శి శ్యామ్ ప్రకాష్, ప్రిన్సిపల్ లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలివ్వాలని డిమాండ్


ధర్నా చేస్తున్న ఆర్ఆర్‌పేట వాసులు

చిట్టినగర్, న్యూస్‌టుడే: పాతరాజరాజేశ్వరీ పేటలోని రైల్వే ఆక్రమిత ప్రాంతాల్లో నివాసముంటున్న ప్రజలకు ఇళ్ల పట్టాలు ఇచ్చి ఆదుకోవాలని స్థానికులు ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవల రైల్వే అధికారులు ఆయా ప్రాంతాల్లో ఉండే ప్రజలకు ఖాళీ చేయాలని నోటీసులు ఇవ్వడంతో నిరసన ధర్నా చేపట్టారు. ధర్నా మంగళవారానికి 4వ రోజుకు చేరింది. 40 ఏళ్లకు పైబడి ఇళ్లు నిర్మించుకుని జీవనం సాగిస్తుంటే పక్షం రోజుల్లో ఖాళీ చేయాలని రైల్వే అధికారులు దండోరా వేయించడం సమంజసం కాదని ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ జోక్యం చేసుకుని న్యాయం చేయాలని కోరారు. సీపీఎం ఫ్లోర్ లీడర్ సత్యబాబు, సీఐటీయూ నాయకులు నారాయణ స్థానికులు ధర్నాకు సంఘీభావం తెలిపినట్లు వివరించారు. నిరసన శిబిరానికి చేరుకున్న జనసేన నాయకురాలు మల్లెపు విజయలక్ష్మికి ఆర్ఆర్‌పేట వాసులు తమ సమస్యను పార్టీ అధినాయకత్వానికి విన్నవించి ఇళ్ల పట్టాలు ఇప్పించాలని వినతిపత్రం అందించారు. ధర్నా కార్యక్రమంలో షాహీన్, ఖుర్షీదా, పాండు తదితరులు పాల్గొన్నారు.

వేగ నిరోధకాలు ఏర్పాటు చేయరూ..


స్పీడ్ బ్రేకరు ఏర్పాటు చేయాల్సింది ఇక్కడే..

చిట్టినగర్, న్యూస్‌టుడే: కేఎల్‌రావునగర్‌లోని ప్రధాన రహదారిలో వేగ నిరోధకాలు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలరా ఆసుపత్రి సెంటర్‌లోని సర్కిల్-1 కార్యాలయం ఎదురు రోడ్డులో ద్విచక్రవాహనాలు, ఆటోలు అతివేగంగా రాకపోకలు సాగించడం వల్ల స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఇళ్లల్లో నుంచి బయటకు రావాలన్నా, ఇళ్ల ముంగిట నిలబడాలంటే హడలెత్తిపోతున్నారు. ఆ రోడ్డులోని లయన్స్‌క్లబ్ ఆఫ్ విజయవాడ స్మైల్స్ కార్యాలయం నుంచి కనకదుర్గ అమ్మవారి ఆలయం వరకు వేగ నిరోధకాలు లేకపోవటంతో పలుమార్లు ప్రమాదాలు జరిగిన ఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

గంజాయి స్వాధీనం


స్వాధీనం చేసుకున్న సరకుతో రైల్వే పోలీసులు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: రైల్లో తరలిస్తున్న గంజాయిని మంగళవారం విజయవాడ రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రైల్వే డీఎస్పీ రత్నరాజు పర్యవేక్షణలో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సీఐలు జె.వి.రమణ, ఫతేఅలీ నేతృత్వంలో సిబ్బంది రైల్వేస్టేషన్‌లోని 9వ నెంబరు ప్లాట్‌ఫాంపై తనిఖీలు నిర్వహిస్తుండగా కర్ణాటక రాష్ట్రం హుబ్లీకి చెందిన రెహానా అనుమానాస్పదంగా కనిపించింది. అనుమానంతో ఆమె బ్యాగు తనిఖీ చేయగా అందులో నాలుగు కేజీల గంజాయి లభించింది. నర్సీపట్నంలో తక్కువ ధరకు కొనుగోలు చేసి హుబ్లీలో ఎక్కువ ధరకు చిన్నచిన్న పొట్లాలు చేసి విక్రయిస్తానని నిందితురాలు విచారణలో తెలిపింది. విశాఖపట్నం నుంచి టికెట్టు లేకుండా ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తూ విజయవాడ రైల్వేస్టేషన్‌కు చేరుకొని ఇక్కడి నుంచి హుబ్లీ వెళ్లేందుకు మరో రైలు కోసం వేచి ఉండగా అదుపులోకి తీసుకున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి రైల్వే కోర్టులో హాజరు పరచనున్నట్లు చెప్పారు.

30న స్థాయీ సంఘం సమావేశం

విజయవాడ నగరపాలక సంస్థ: నగరపాలక సంస్థ స్థాయీ సంఘం సమావేశం ఈ నెల 30న నిర్వహించనున్నారు. సమావేశం తేదీ నిర్ణయించడంతో అధికారులు ప్రియాంబుల్స్ సిద్ధం చేస్తున్నారు. మరో వైపు అన్ని విభాగాల అధికారులు తమ పరిధిలో ప్రతిపాదిత అంశాలను కార్పొరేషన్ కార్యదర్శి విభాగానికి పంపాలని అధికారులకు సర్క్యులర్ జారీ చేశారు.

పిల్లలు ఏం చేస్తున్నారో గమనించాలి

చిట్టినగర్: పిల్లలు ఏం చేస్తున్నారో తల్లిదండ్రులు నిత్యం గమనిస్తూ ఉండాలని హిందూ హైస్కూల్స్ కమిటీ ఏవో నారాయణరావు అన్నారు. కొత్తపేట కేబీఎన్ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దడానికి తమ కళాశాల యాజమాన్యం పూర్తి స్థాయిలో కృషి చేస్తుందన్నారు. ప్రిన్సిపల్ కృష్ణవేణి, వైస్ ప్రిన్సిపాళ్లు ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, కన్వీనర్ కె.ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ తూర్పు

సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలకు అదనపు బాధ్యతలు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ ప్రణాళికా విభాగంలో కొన్ని మార్పులు చేస్తూ అధికారులు చర్యలు తీసుకున్నారు. కొందరు టీపీఎస్‌లు, టీపీవోలు బదిలీ కావడం, డివిజన్ల పర్యవేక్షక బాధ్యతలు చూసేందుకు కావాల్సినంత మంది టీపీబీవోలు లేకపోవడంతో ఆ బాధ్యతలను ప్రస్తుతం సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలకు అప్పగించారు. కార్పొరేషన్ పరిధిలో 240 మంది సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలు ఉన్నారు. వారిలో సీనియారిటీ, ఇతర అర్హతల ఆధారంగా 12 మందిని ఎంపిక చేసి టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఆఫీసర్ (టీపీబీవో) ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. టీపీబీవో-1గా దగ్గుబాటి ప్రదీప్ కశ్యప్, టీపీబీవో-2గా మైలు వసంతరావు, టీపీబీవో-3గా నెలమలిపురి ఐశ్వర్య, టీపీబీవో-4గా జరుగుల నేతాజీ, టీపీబీవో-5గా అంజూరి సత్యనారాయణ, టీపీబీవో-6గా చెన్నూరి సాయికిషోర్, టీపీబీవో-7గా జిలానీ మీరం సాహెబ్ షరి, టీపీబీవో-8గా తడ్డి లక్ష్మణరావు, టీపీబీవో-9గా కరణం రవికుమార్, టీపీబీవో-10గా పరిసె ప్రభుకుమార్, టీపీబీవో-11గా దావు వీర వెంకట రాజ్‌కుమార్, టీపీబీవో-12గా కర్రి నాగేశ్వరరావులకు బాధ్యతలు అప్పగించారు.

అనుమతి బాధ్యతలిలా..

భవన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చే బాధ్యతలను అధికారుల కేడర్, స్థాయికి అనుగుణంగా అప్పగించారు. ఆ నిర్ణయం ఆగస్టులో తీసుకున్నా, ప్రస్తుతం అమల్లోకి తెస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 100 చ.మీ.లోపు విస్తీర్ణంలో భవన నిర్మాణాలకు అనుమతి మంజూరు చేసే అధికారాన్ని ఇన్‌ఛార్జి టీపీబీవోలకు అప్పగించారు. 101 - 200 చ.మీ.విస్తీర్ణంలో ప్లాను మంజూరు చేసే అధికారాన్ని టౌన్‌ప్లానింగ్ అధికారి, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్‌కు ఇచ్చారు. 201 - 500 చ.మీ. విస్తీర్ణం గల స్థలంలో ప్లాను మంజూరు చేసే అధికారాన్ని డిప్యూటీ సిటీ ప్లానర్, అసిస్టెంట్ సిటీప్లానర్లకు అప్పగించారు. 501 - వెయ్యి చ.మీ. విస్తీర్ణంగల స్థలానికి ప్లాను మంజూరు చేసే బాధ్యత ప్రణాళికా విభాగం ముఖ్య అధికారికి, 1001 చ.మీ. పైబడిన స్థలంలో నిర్మాణాలకు ప్లాను మంజూరు చేసే అధికారం కమిషనర్‌కు కల్పిస్తూ ఆదేశాలు జారీచేశారు.

30న స్థాయీ సంఘం సమావేశం

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ స్థాయీ సంఘం సమావేశం ఈ నెల 30న నిర్వహించనున్నారు. సమావేశం తేదీ నిర్ణయించడంతో అధికారులు ప్రియాంబుల్స్ సిద్ధం చేస్తున్నారు. మరోవైపు అన్ని విభాగాల అధికారులు తమ పరిధిలో ప్రతిపాదిత అంశాలను కార్పొరేషన్ కార్యదర్శి విభాగానికి పంపాలని అధికారులకు సర్క్యులర్ జారీ చేశారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఆప్కాస్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు కమిషనర్ ధ్యానచంద్రను కోరారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు దోనేపూడి కాశీనాథ్ ఆధ్వర్యంలో యూనియన్ నాయకులు మంగళవారం ప్రధాన కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. కార్మికుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. కమిషనర్ మాట్లాడుతూ... కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ యూనియన్ నాయకులు

నాయకులు జ్యోతిబసు, టి.ప్రవీణ్, టి. తిరుపతమ్మ, కృష్ణ, నల్ల శ్రీను, జల సూత్రం నాగరాజు, హరిబాబు, టి.చిన్న తదితరులు పాల్గొన్నారు.

బౌలింగ్‌లో నిప్పులు చెరిగిన ఇస్మాయిల్



ఇస్మాయిల్ (8/37)

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ఆంధ్రా జట్టుకు చెందిన ఇస్మాయిల్ బౌలింగ్ మాయాజాలానికి మేఘాలయ జట్టు కుప్పకూలింది. మూలపాడులోని ఏసీఏ మైదానంలో జరుగుతున్న కల్నల్ సీకే నాయుడు అండర్-23 క్రికెట్ టోర్నీ(మల్టీ డే)లో భాగంగా ఆంధ్రా జట్టు ఇన్నింగ్స్ ఆధిక్యంతో మేఘాలయ జట్టుపై విజయం సాధించింది. మేఘాలయ జట్టు 23 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో మూడో రోజైన మంగళవారం రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్‌ను కొనసాగించి 64.4 ఓవర్లలో 125 పరుగులకే ఆలౌటైంది. జట్టులో కెవిన్ 51 పరుగులు చేయగా.. ప్రత్యర్థి బౌలర్లు ఇస్మాయిల్ (8/37), శ్రీకర్ (1/23), సాకేత్ రామ్ (1/32) మెరిశారు. ఆంధ్రా జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 402 పరుగుల వద్ద డిక్లేర్ చేయగా.. మేఘాలయ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 184 పరుగులకు ఆలౌటైంది. దీంతో ఆంధ్రా జట్టు ఇన్నింగ్స్, 93 పరుగుల ఆధిక్యంతో మేఘాలయ జట్టుపై విజయం సాధించింది. ఆంధ్రా జట్టు 16 పాయింట్లు, మేఘాలయ జట్టు రెండు పాయింట్లు తమ ఖాతాలో జమ చేసుకున్నాయి. ఈ నెల 27 నుంచి విదర్భ జట్టుతో ఆంధ్రా జట్టు తలపడనుంది.

ఆసక్తిగా టెన్నిస్ టోర్నీ



రాధాకృష్ణమూర్తి

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: నగరంలోని విజయమాధవి టెన్నిస్ ప్రాంగణంలో జరుగుతున్న 70+ కేటగిరీలో నగరానికి చెందిన కె.రాధాకృష్ణమూర్తి సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నాడు. ఆయనతో పాటు టి.సుందర్, బీజీ రెడ్డి కూడా సెమీ ఫైనల్స్ బెర్త్ ఖరారు చేసుకున్నారు. ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నీలో భాగంగా స్థానిక ఐజీఎంసీ స్టేడియం టెన్నిస్ కాంప్లెక్స్‌లో మ్యాచ్‌లు జరుగుతున్నాయి. 35+ సింగిల్స్‌లో మహేశ్వరరావు, నగేష్, శబరీష్, అశోక్, 45+ సింగిల్స్‌లో కేవీఎల్ఎన్ మూర్తి, సంపత్, వాహిద్, హరీష్, ఎంఎస్ కిరణ్‌లు క్వార్టర్ ఫైనల్స్‌లో ప్రవేశించారు. వర్షానికి క్లే కోర్టులో మ్యాచ్‌ల నిర్వహణకు అంతరాయం కలిగింది. ఐజీఎంసీ స్టేడియంలోని టెన్నిస్ కాంప్లెక్స్‌లోని సింథటిక్ కోర్టుల్లో విద్యుత్తు దీపకాంతుల్లో మంగళవారం రాత్రి పోటీలు కొనసాగుతున్నాయని టోర్నీ చీఫ్ రిఫరీ కె.శ్రీకుమార్ తెలిపారు.

నేటి నుంచి క్రీడా పోటీలు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: కృష్ణా విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల ఫెన్సింగ్, తైక్వాండో స్త్రీ, పురుషుల పోటీలను ఈ నెల 23, 24వ తేదీల్లో ఏలూరు జిల్లా కైకలూరులోని వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తామని వర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి జె.నవీన లావణ్యలత తెలిపారు. 23న ఫెన్సింగ్, వర్సిటీ జట్టు ఎంపిక పోటీలు, 24న తైక్వాండో, వర్సిటీ జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 72075 27443 నంబరులో సంప్రదించాలన్నారు.

24 నుంచి రాష్ట్ర స్థాయి ఓపెన్ ఫుట్‌బాల్ టోర్నీ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: జేవియర్ ఫుట్‌బాల్ ట్రోఫీ కోసం స్థానిక ఐజీఎంసీ స్టేడియంలో ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి ఓపెన్ ఫుట్‌బాల్ టోర్నీ నిర్వహిస్తామని కన్వీనర్ వి.శామ్యూల్ రత్నం తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా ఫుట్‌బాల్ సంఘం అనుమతితో ఈ టోర్నీ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అండర్-11, 13, 15, 18 బాలుర, సీనియర్ పురుషుల విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఉత్సాహంగా బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక పోటీలు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కృష్ణా వర్సిటీ బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక పోటీలో పలువురు క్రీడాకారులు ఉత్సాహంగా తలపడ్డారు. మంగళవారం జరిగిన పోటీల్లో వర్సిటీ పరిధిలోని 26 మంది క్రీడాకారులు తలపడ్డారు. జట్టు ఎంపిక కమిటీ సభ్యులుగా వాసిరెడ్డి నాగేశ్వరరావు (పీడీ, కేవీఆర్ కళాశాల, నందిగామ), ఆర్.రఘురామ్ (పీడీ, సప్తగిరి డిగ్రీ కళాశాల, విజయవాడ) వ్యవహరించారు. ఎంపికైన క్రీడాకారుల జాబితాను త్వరలో వెల్లడిస్తారు.



పోటీలో తలపడుతున్న క్రీడాకారుడు

విజయవాడ తూర్పు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
80085 74652

❖ పటమట లక్ష్మి హాస్పిటల్ రోడ్డు 72-5-20 ఇంటి ఎదురుగా భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్ నుంచి మురుగు నీరు లీకేజీ అవుతోందని స్థానిక నివాసి సుధారాణి మేమున్నాం... మీకు తోడుగా ద్వారా ఏఈ జశ్వంత్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి మరమ్మతులు చేయించారు.

❖ 8వ డివిజన్ టిక్కిల్ రోడ్డు శ్యామ్ నగర్‌లో 8-63/19 విద్యుత్ స్తంభానికి ఉన్న దీపం వెలగడం లేదని స్థానిక నివాసి కోనేరు లక్ష్మి మేమున్నాం...మీకు తోడుగా ద్వారా ఏఈ ప్రభాకర్ రావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కొత్త దీపాన్ని ఏర్పాటు చేయించారు.

? మూడో డివిజన్ విజయలక్ష్మి కాలనీ 1, 2 రోడ్ల మార్జిన్లలో చెత్త కుప్పలు గత కొంత కాలం నుంచి తొలగించడం లేదు.
- అశోక్ గాంధీ

✔ పరిశీలించి తొలగిస్తాం -ఆంథోనీ, శానిటరీ అధికారి
- న్యూస్‌టుడే, కరెన్సీనగర్

కార్మికుల వేతనాలపై కార్పొరేషన్‌కు ఆదేశాలు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ పరిధిలో ఒప్పంద పద్ధతిన విధులు నిర్వహిస్తున్న కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని న్యాయస్థానం సూచించింది. దీనిపై గతంలో ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు ఎ. రంగనాయకులు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, కార్మికులకు సమాన పనికి సమాన వేతం చెల్లించేందుకు కార్పొరేషన్ అధికారులు అంగీకరించారు. ఆపై న్యాయస్థానం ఆదేశాలను అమలు చేయలేదు. దీనిపై న్యాయస్థానం అసహనం వ్యక్తం చేయడంతో పాటు, తమ ఆదేశాలను ధిక్కరించినట్లు గుర్తించింది. తగిన వివరణ ఇవ్వాలని అధికారులను సూచించింది. అయినా అధికారులు స్పందించకపోవడంతో న్యాయస్థానం గతంలో ఇచ్చిన ఆదేశాలు అమలు చేయాలంటూ రంగనాయకులు తిరిగి కోర్టుని ఆశ్రయించారు. స్పందించిన న్యాయస్థానం 6 వారాల్లో కార్మికుల వేతనాల సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించింది. డైరెక్టర్ ఆఫ్ కమిషనర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ద్వారా బాధ్యులైన అధికారులకు న్యాయస్థానం సూచనలు చేసింది. ఫలితంగా డైరెక్టర్ ఆఫ్ కమిషనర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ నుంచి నగరపాలక సంస్థ కార్యాలయానికి మంగళవారం సర్క్యులర్ జారీ అయ్యింది. ప్రతిగా నగరపాలక సంస్థ అధికారులు న్యాయస్థానానికి హాజరై తమ వాదన వినిపించాల్సి ఉంటుంది.

ప్రణాళికాధికారుల రిలీవ్

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగంలో సుదీర్ఘకాలంగా విధులు నిర్వహిస్తున్న పలువురు ప్రణాళికాధికారులను ప్రభుత్వం ఇటీవల బదిలీ చేయగా, ఎట్టకేలకు వారందరినీ రిలీవ్ చేస్తూ ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రణాళిక విభాగంలో చాలా కాలంగా పనిచేస్తున్న అధికారులను సెప్టెంబరు నెలలోనే ప్రభుత్వం బదిలీ చేసింది. ఉత్తర్వులు కూడా జారీ అయ్యాయి. వరదల కారణంగా వారిని రిలీవ్ చేసే ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోయింది. వరద తగ్గినా ప్రణాళికా విభాగంలో అధికారులను రిలీవ్ చేయలేదు. దీనిపై 'ఈనాడు'లో ఈనెల 18న 'బదిలీ అయ్యారు.. రిలీవ్ కాలేదు' శీర్షికన వార్త ప్రచురితమైంది. కమిషనర్ స్పందించి బదిలీ అయిన అధికారులందరినీ రిలీవ్ చేయాలని ప్రణాళిక విభాగం ముఖ్య అధికారిని ఆదేశించారు. సోమవారం రాత్రి ఆదేశాలు జారీ చేయగా, మంగళవారం వారంతా రిలీవ్ అయ్యి వెళ్లిపోయారు. సత్యనారాయణపురం ప్రాంతంలో పనిచేస్తున్న వీఎంసీ రమణారెడ్డి, కేదారేశ్వరిపేట పరిధిలోని కె. అరుణ, పాతబస్తీ పరిధిలోని కె.ఆశ, భవానీపురం ప్రాంతంలోని కె.వెంకటేశ్వరరావు, పటమట ప్రాంతంలోని శేషు, రామలింగేశ్వరనగర్ పరిధిలోని కొండలరావు తదితర టీపీవోలు, టీపీఎస్‌లు తమ బదిలీ ప్రాంతాలకు వెళ్లిపోయారు.

చదరంగంలో రాష్ట్రానికి పూర్వ వైభవం


టోర్నీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఉమామహేశ్వరరావు, గ్రాండ్‌మాస్టర్ లలిత్‌బాబు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: చదరంగంలో రాష్ట్రానికి పూర్వ వైభవం రానుందని విజయవాడకు చెందిన గ్రాండ్‌మాస్టర్ ముసునూరి రోహిత్ లలిత్‌బాబు పేర్కొన్నారు. స్థానిక వికాస్ పబ్లిక్ స్కూల్ వేదికగా ఆరు రోజుల పాటు నిర్వహించనున్న భారతీయ నవీన క్రీడా ఉత్సవ్ (బీఎన్‌కేయూ) ఇంటర్నేషనల్ ఫిడే రేటింగ్ చెస్ ఫెస్టివల్-2024 ప్రారంభోత్సవానికి మంగళవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఒకే వేదికపై క్లాసికల్, ర్యాపిడ్, బ్లిట్జ్ విభాగాల్లో సుమారు 508 మంది క్రీడాకారులు పాల్గొనడం సంతోషంగా ఉందని రోహిత్ అన్నారు. ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు సారథ్యంలో క్రీడలకు మంచి ప్రోత్సాహం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. టోర్నీ నిర్వహణ ద్వారా నూతన క్రీడాకారులు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంటుందని అన్నారు. అనంతరం అతిథులతో కలిసి చదరంగం బోర్డుపై ఎత్తు వేసి టోర్నీ ప్రారంభించారు. కార్యక్రమానికి వికాస్ పబ్లిక్ స్కూల్ ఛైర్మన్ కొండేటి రాజేంద్ర అధ్యక్షత వహించారు. స్కూల్ డైరెక్టర్ యద్ధ పార్థసారథి, టోర్నీ కన్వీనర్ షేక్ ఖాసిం, బీఎన్‌కేయూ అధ్యక్షుడు సలపల భీమారావు తదితరులు పాల్గొన్నారు.

సరిపడా లేవు.. సమయానికి రావు

ఆర్టీసీ బస్సులతో విద్యార్థుల ఇక్కట్లు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

బస్సులు సమయానికి రాకపోవడం వల్ల విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విజయవాడ పీబీ సిద్ధార్థ కళాశాలకు నగరంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు వస్తుంటారు. ఉదయం కళాశాలకు వచ్చినప్పుడు, తిరిగి వెళ్లినప్పుడు బస్సులు అందుబాటులో లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఉదయం పండిట్ నెహ్రూ బస్టాండ్ నుంచి కళాశాలకు రావాలంటే అరగంటకుపైగా నిరీక్షించాల్సి వస్తోందని చెబుతున్నారు. తిరిగి కళాశాల నుంచి బస్టాండ్‌కు వెళ్లాలంటే అరగంట వేచి ఉండాలని వాపోతున్నారు. ఒకే సారి రెండు బస్సులు వస్తున్నాయని, కొన్ని సార్లు చాలా సేపు రావని చెబుతున్నారు. ఇటుగా 333 మెట్రో సర్వీస్ ఉన్నా పాస్‌కు అనుమతి లేదు. ఇటు వైపు తిరిగే సర్వీస్‌లు తగ్గించేశారని చెబుతున్నారు. 11.50 గంటలకు కొన్ని తరగతులు వదులుతారు. అప్పుడు బస్సులు లేవని, అధికారులు సమస్య పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.


సిద్ధార్థ సర్కిల్ వద్ద నిరీక్షిస్తున్న విద్యార్థినులు

ఆలస్యంగా వస్తున్నాయి



ఆర్టీసీ బస్సులు సమయానికి రావడం లేదు. మధ్యాహ్నం కళాశాల వదలగానే బస్టాప్ దగ్గరకు వస్తున్నాం. అరగంటకు పైగా ఎదురుచూడాల్సి వస్తోంది. ఎప్పుడు వస్తాయో తెలియక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. కొన్నిసార్లు ఆటోలో బస్సు స్టేషన్‌కు వెళ్తున్నాం.
- మహేశ్‌బాబు

సర్వీస్‌లు పెంచితే మేలు



మాది జి.కొండూరు. కళాశాలకు రోజూ బస్‌లో వస్తాను. గతంలో పోల్చుకుంటే బస్సులు తక్కువగా తిరుగుతున్నాయి. ఫలితంగా వాటి కోసం నిరీక్షించాల్సి వస్తోంది. సత్యసాయి హోటల్ దగ్గర బస్ షెల్టర్ లేదు. ఐదో నంబరు రూట్ వైపు సర్వీస్‌లు పెంచాలి.
- కుసుమ

ఉదయమే చాలా ఇబ్బంది



మాది వెలగలేరు. అక్కడ నుంచి పండిట్ నెహ్రూ బస్ స్టేషన్‌కు వస్తాను. కళాశాలకు వెళ్లడానికి అక్కడ మరో బస్సు ఎక్కుతాను. ముఖ్యంగా ఉదయం 7.30 నుంచి 8 గంటల సమయంలో బస్సులు ఉండటం లేదు. కళాశాలకు సమయం అవుతుందని ఆటోలో వస్తున్నాం.
- భవ్యశ్రీ

డ్రెయినేజీ సమస్యలు పరిష్కరిస్తాం: గద్దె

పటమట: వైకాపా ప్రభుత్వ చేతకానితనంతో నియోజకవర్గంలో యూజీడీ, సైడ్ కాలువలు స్తంభించి ప్రజలు అవస్థలు పడుతున్నారని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. మంగళవారం 10 డివిజన్ న్యూ పోస్టల్ కాలనీలో ఎమ్మెల్యే పర్యటించారు. యూజీడీ, సైడ్ కాలువలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైకాపా పాలకులు భూగర్భ మురుగు కాలువలు, మురుగు నీటి కాలువలు, వర్షం నీటి కాలువలను అస్తవ్యస్తంగా తయారు చేశారని ఆరోపించారు. గత తెదేపా ప్రభుత్వ హయాంలోనే వర్షం నీటి కాలువల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారని, నిధులు ఖర్చు చేయకపోగా దారి మళ్లించారని పేర్కొన్నారు. ఫలితంగా కొద్దిపాటి వర్షానికే రహదారులపై నీరు నిల్వ ఉంటోందని చెప్పారు. కార్పొరేటర్లు దేవినేని అపర్ణ, ముమ్మనేని ప్రసాద్, భాజపా నేత పోతంశెట్టి నాగేశ్వరరావు, ఏపీ సామ్రాజ్యం, ఎలక్ట్రికల్ ఏఈ ఏడుకొండలు, నాయకులు దండమూడి చంద్రశేఖరరావు, తుమ్మల వెంకటరత్నం, రామారావు, తమిరిని రామారావు, పరుచూరి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత

విజయవాడ నగర పాలక సంస్థ, న్యూస్‌టుడే: పటమట కరణంగారి వీధిలో పూర్తి స్థాయి అనుమతి పొందకుండా అక్రమంగా నిర్మించిన ఓ భారీ భవనాన్ని నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళికాధికారులు మంగళవారం కూల్చివేశారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: ఆంధ్రా లయోలా కళాశాలలో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కళాశాలలోని అధ్యాపకులు, విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. వైద్యుడు రాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నియామకం

గాంధీనగర్, న్యూస్‌టుడే : గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్ తాత్కాలిక రాష్ట్ర నూతన ప్రధాన కార్యదర్శిగా బత్తుల అంకమ్మరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జానీపాషా మంగళవారం గాంధీనగర్‌లోని ఏపీ ఎన్జీవో కార్యాలయంలో నియామక పత్రం అందజేశారు. సంఘం ఎన్నికలు నిర్వహించే వరకు అంకమ్మరావు ఆ పదవిలో కొనసాగుతారని ఆయన తెలిపారు.

సీఎం సహాయనిధికి విరాళం

పటమట, న్యూస్‌టుడే: తూర్పు నియోజకవర్గంలో పలు కాలనీల ప్రజలు, వివిధ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు సీఎం సహాయనిధికి అందించిన రూ.25 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, గద్దె క్రాంతి కుమార్ మంగళవారం ఉండవల్లిలోని మంత్రి నారా లోకేశ్‌ని కలిసి అందజేశారు. నియోజకవర్గంలో అభివృద్ధి గురించి మంత్రి అడిగి తెలుసుకున్నారు. వరదల సమయంలో సేవలు అందించిన క్రాంతి కుమార్ అభినందించారు.


మంత్రి లోకేశ్‌కు చెక్కులు అందజేస్తున్న గద్దె రామ్మోహన్, పక్కన క్రాంతి కుమార్

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం


మాట్లాడుతున్న ఏసీపీ దామోదర్

పటమట, న్యూస్‌టుడే : సైబర్ నేరాల పట్ల బ్యాంకు అధికారులు కూడా అప్రమత్తంగా ఉండాలని సెంట్రల్ జోన్ ఏసీపీ దామోదర్ అన్నారు. సైబర్ నేరాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై మంగళవారం పటమట పోలీస్ స్టేషన్ ఆవరణలో సెంట్రల్ జోన్ పరిధిలోని వివిధ బ్యాంకుల సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... అనుమానాస్పద లావాదేవీలు జరిగే ఖాతాలపై బ్యాంకర్లు నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే గోల్డెన్ అవర్‌లో 1930కు ఫిర్యాదు చేయించాలని చెప్పారు. బ్యాంకుతో పాటు పరిసర ప్రాంతాలు, ఏటీఎంల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, వాటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని పేర్కొన్నారు. పటమట సీఐ వి.పవన్ కిషోర్, గుణదల సీఐ వాసిరెడ్డి శ్రీను పాల్గొన్నారు.

పార్ట్‌టైం ఉద్యోగం పేరిట మోసం

గృహిణి నుంచి రూ.17 లక్షల వసూలు

విజయవాడ నేరవార్తలు: ఆన్‌లైన్ మోసాలపై పోలీసులు అవగాహన కల్పిస్తున్నా.. అమాయక ప్రజలు సైబర్ నేరగాళ్ల బుట్టలో పడిపోతున్నారు. తాజాగా ఓ గృహిణి రూ.17 లక్షలు పంపి, మోసపోయారు. పటమట ఎన్టీఆర్ సర్కిల్ సమీపంలో ఉండే ఓ యువతి (38) గృహిణిగా ఉన్నారు. ఆమెకు ఆగస్టు 10న గుర్తు తెలియని వాట్సాప్ నంబరు నుంచి ప్రెస్టీజ్ కంపెనీ ప్రతినిధిని అంటూ మేసేజ్ వచ్చింది. పార్ట్ టైం ఉద్యోగం ఉందని, ఒక లింక్ పంపి కొన్ని టాస్కులు ఇచ్చారు. వాటిని పూర్తి చేయగానే.. ఆమె ఖాతాలోకి డబ్బులు వచ్చాయి. తర్వాత వారు మరో లింక్ పంపి, పేరు రిజిస్టర్ చేసుకోమని చెప్పడంతో అలాగే చేశారు. వారు పంపిన పలు టాస్కులు పూర్తిచేశారు. ఈ సారి ఆమె ఖాతాలో ఆదాయానికి బదులు.. నెగెటివ్ బ్యాలెన్స్ చూపడంతో సదరు కంపెనీకి ఫోన్ చేశారు. వారు చెప్పిన మాటలు నమ్మి.. విడతల వారీగా రూ.17లక్షలు పంపారు. చివరికి తాను మోసపోయినట్లు గుర్తించి.. సైబర్ క్రైం పోర్టల్‌లో ఫిర్యాదు చేశారు. విజయవాడ సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా ఉద్యోగికి గాయం

ఆటోనగర్, న్యూస్‌టుడే: ఆటోనగర్ డిపోలో బస్సు వెనక్కి నడుపుతుండగా జరిగిన ప్రమాదంలో కాంట్రాక్టు మహిళా ఉద్యోగి కాలికి బలమైన గాయమైంది. కృష్ణలంకకు చెందిన ఎం.మరియమ్మ ఆటోనగర్‌లోని ఆర్టీసీ డిపోలో కాంట్రాక్టు ఉద్యోగిగా పని చేస్తున్నారు. మంగళవారం రాత్రి 7 గంటల సమయంలో ఆమె బస్సు శుభ్రం చేస్తున్నారు. అదే సమయంలో మరో బస్సును రివర్స్ చేస్తున్న డ్రైవర్ మరియమ్మను గమనించకుండా వేగంగా నడపడంతో రెండు బస్సుల మధ్య ఇరుక్కుపోయింది. ఆమె కుడి కాలికి బలమైన గాయమైంది. డిపో సిబ్బంది ఆమెను వెంటనే కొత్త ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడనుంచి మెరుగైన వైద్యం నిమిత్తం తాడేపల్లిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

అధికారుల తప్పు.. ముంపు ముప్పు!


రాణిగారితోట సర్వీసు రోడ్డులోని తూముల నుంచి పడుతున్న నీరు


గౌతమీనగర్ 3వ లైనులో పరిస్థితి ఇదీ


రాణిగారితోట అవుట్‌ఫాల్ డ్రెయిన్‌లో వ్యర్థాలు

కృష్ణలంక, న్యూస్‌టుడే

అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా దశాబ్దాల నుంచి ప్రజలు అవస్థలు పడుతున్నారు. కనకదుర్గమ్మ పైవంతెన పనుల్లో భాగంగా కృష్ణలంక జాతీయ రహదారి విస్తరణ చేపట్టారు. వృథా నీటిని మళ్లించే పనులు చేయడంలో మాత్రం అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఫలితంగా వర్షాలు కురిసిన ప్రతిసారి జాతీయ రహదారిపై నీరు మొత్తం కృష్ణలంక, రాణిగారితోట సర్వీసు రోడ్లపైకి చేరుతోంది. నీరు నిల్వ ఉండి ప్రజలు రాకపోకలు సాగించడానికి ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి నివారణ చర్యలు తీసుకోకపోతే ఎప్పటికైనా ఇబ్బందులు తప్పదన్న భావన స్థానిక ప్రజల్లో వ్యక్తమవుతోంది. వర్షం నీరు మళ్లింపునకు చేపట్టిన తాత్కాలిక పనులు ఫలితాలను ఇవ్వనందున శాశ్వత ప్రాతిపదికన డ్రెయిన్ నిర్మించాలని కోరుతున్నారు.

సర్వీసు రోడ్డులోకి పైపులు

విస్తరణ సమయంలో జాతీయ రహదారిపై వర్షపు నీరు నిల్వ ఉండకుండా అధికారులు సర్వీసు రోడ్డుకు అనుసంధానించి నిర్మించిన గోడ కింద డ్రెయిన్ నిర్మించి అందులోకి తూములు ఏర్పాటు చేశారు. వాస్తవానికి సర్వీసు రోడ్డు.. జాతీయ రహదారి కంటే పల్లంగా ఉంది. ఫలితంగా వర్షాలు కురిస్తే... జాతీయ రహదారిపై పడిన నీరు గోడకు ఆనుకొని కట్టిన డ్రెయిన్‌లో చేరి సమీపంలోని డ్రెయిన్లలోకి వెళ్తోంది. అప్పటికే అందులో మురుగు ఉండటంతో అదనంగా చేరిన నీరు ఆ ప్రాంతంలోని రహదారులను ముంచెత్తుతోంది. పైగా డ్రెయిన్లలో పూడిక తొలగించకపోవడం, మ్యాన్‌హోళ్లను తరచూ శుభ్రం చేయకపోవడం వల్ల మురుగు పారడం లేదు. పారిశుద్ధ్య పనుల నిర్వహణలో నగర పాలక సంస్థ సిబ్బంది తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

వరద కాదు మురుగే..

క్రీస్తురాజపురంలోని జయప్రకాశ్‌నగర్ వద్ద డ్రైనేజీ పొంగి రోడ్డుపై ప్రవహిస్తోంది. స్థానికులు వారి ఇళ్లలోకి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల తాగునీటి పైపులైన్ పగిలిపోతే రోడ్డు తవ్వి మరమ్మతులు చేశారు. కానీ గుంతను పూడ్చకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. డ్రైనేజీ నుంచి పొంగిన మురుగునీరు పది రోజులుగా గుంతల్లో నిలిచి ఉండటంతో తాగు నీరు కలుషితం అవుతుందని స్థానికులు భయందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి డ్రెయినేజీ సమస్యతో పాటు తాగునీటి పైపులైను కోసం తవ్విన గుంతను పూడ్చాలని కోరుతున్నారు.



- గుణదల (పటమట), న్యూస్‌టుడే

రోడ్డుపైనే డంపర్ బిన్

క్రీస్తురాజపురంలోని జయప్రకాశ్‌నగర్ వద్ద చెత్త వేసేందుకు ఏర్పాటు చేసిన డంపర్ రోడ్డుపై పెట్టడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. చెత్తను లారీలో ఎక్కించేందుకు అనువుగా ఉంటుందని వీఎంసీ సిబ్బంది డంపర్లను ఇలా రోడ్డుపై పెడుతున్నారు. పలుమార్లు చెప్పినా డంపర్లను రోడ్డుపైనే పెడుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

- గుణదల (పటమట), న్యూస్‌టుడే



ఇళ్ల పట్టాలిచ్చి ఆదుకోవాలి



ధర్నా చేస్తున్న ఆర్ఆర్‌పేట వాసులు

చిట్టినగర్, న్యూస్‌టుడే: పాతరాజరాజేశ్వరీ పేటలోని రైల్వే ఆక్రమిత ప్రాంతాల్లో నివాసముంటున్న ప్రజలకు ఇళ్ల పట్టాలు ఇచ్చి ఆదుకోవాలని స్థానికులు ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవల రైల్వే అధికారులు ఆయా ప్రాంతాల్లో ఉండే ప్రజలకు ఖాళీ చేయాలని నోటీసులు ఇవ్వడంతో నిరసన ధర్నా చేపట్టారు. ధర్నా మంగళవారానికి 4వ రోజుకు చేరింది. 40 ఏళ్లకు పైబడి ఇళ్లు నిర్మించుకుని జీవనం సాగిస్తుంటే పక్షం రోజుల్లో ఖాళీ చేయాలని రైల్వే అధికారులు దండోరా వేయించడం సమంజసం కాదని ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ జోక్యం చేసుకుని న్యాయం చేయాలని కోరారు. సీపీఎం ఫ్లోర్ లీడర్ సత్యబాబు, సీఐటీయూ నాయకులు నారాయణ స్థానికులు ధర్నాకు సంఘీభావం తెలిపినట్లు వివరించారు. నిరసన శిబిరానికి చేరుకున్న జనసేన నాయకురాలు మల్లెపు విజయలక్ష్మికి ఆర్ఆర్‌పేట వాసులు తమ సమస్యను పార్టీ అధినాయకత్వానికి విన్నవించి ఇళ్ల పట్టాలు ఇప్పించాలని వినతిపత్రం అందించారు. ధర్నా కార్యక్రమంలో షాహీన్, ఖుర్షీదా, పాండు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: రైల్లో తరలిస్తున్న గంజాయిని మంగళవారం విజయవాడ రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రైల్వే డీఎస్పీ రత్నరాజు పర్యవేక్షణలో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సీఐలు జె.వి.రమణ, ఫతేఅలీ నేతృత్వంలో సిబ్బంది రైల్వేస్టేషన్‌లోని 9వ నెంబరు ప్లాట్‌ఫాంపై తనిఖీలు నిర్వహిస్తుండగా కర్ణాటక రాష్ట్రం హుబ్లీకి చెందిన రెహానా అనుమానాస్పదంగా కనిపించింది. అనుమానంతో ఆమె బ్యాగు తనిఖీ చేయగా అందులో నాలుగు కేజీల గంజాయి లభించింది. నర్సీపట్నంలో తక్కువ ధరకు కొనుగోలు చేసి హుబ్లీలో ఎక్కువ ధరకు చిన్నచిన్న పొట్లాలు చేసి విక్రయిస్తానని నిందితురాలు విచారణలో తెలిపింది. విశాఖపట్నం నుంచి టికెట్టు లేకుండా ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తూ విజయవాడ రైల్వే స్టేషన్‌కు చేరుకొని ఇక్కడి నుంచి హుబ్లీ వెళ్లేందుకు మరో రైలు కోసం వేచి ఉండగా అదుపులోకి తీసుకున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి రైల్వే కోర్టులో హాజరు పరచనున్నట్లు చెప్పారు.

హెచ్‌పీ తొలి ఏఐ ల్యాప్‌టాప్

హెచ్‌పీ ఇండియా తమ తొలి ఏఐ ఆధారిత 2 ఇన్ 1 ల్యాప్‌టాప్‌ను ఆవిష్కరించింది. పేరు ఓమ్నిబుక్ అల్ట్రా ఫ్లిప్. ఇంటెల్‌కు చెందిన లూనార్ లేక్ ప్రాసెసర్, ప్రత్యేక న్యూరల్ ప్రాసెసింగ్ యూనిట్




(ఎన్‌పీయూ) తో కూడిన ఇది సెకనుకు 48 ట్రిలియన్ల ఆపరేషన్స్ చేయగలదు. ఫ్రీలాన్సర్లు, కంటెంట్ క్రియేటర్లను దృష్టిలో పెట్టుకొని దీన్ని రూపొందించారు. 2.8కె ఓఎల్ఈడీ డిస్‌ప్లే గల దీని బ్యాటరీ 21 గంటల వరకూ పనిచేస్తుంది. ల్యాప్‌టాప్, ట్యాబ్లెట్, టెంట్ మోడ్‌ల్లోకి మార్చుకోవచ్చు. ఏఐ జనరేటెడ్ ముప్పులు, సైబర్ దాడులను అడ్డుకోవటానికి రూపొందించిన హెచ్‌పీ వోల్ఫ్ సెక్యూరిటీ అనే ఏఐ భద్రతా వ్యవస్థ రక్షణగా ఉంటుంది. మెరుగైన వర్చువల్ సమావేశాల కోసం 9ఎంపీ ఏఐ కెమెరా, పాలీ ఆడియో జోడించారు. ఎక్లిప్స్ గ్రే, అట్మాస్ఫెరిక్ బ్లూ రంగుల్లో ఉండే అల్ట్రా 7 రకం ప్రారంభ ధర రూ.1,81,999. అట్మాస్ఫెరిక్ బ్లూ రంగులో వచ్చే అల్ట్రా 9 రకం ధర రూ. 1,91,999. వీటిని హెచ్‌పీ ఆన్‌లైన్ స్టోర్, ఇతర ఆన్‌లైన్ అంగళ్లలో కొనుక్కోవచ్చు.

కొత్తగా ఐప్యాడ్ మినీ

ఐప్యాడ్ మినీ ప్రియులకు శుభవార్త. మూడేళ్ల తర్వాత ఇది కొత్త రూపు సంతరించుకుంది. ఐప్యాడ్ మినీ 2024గా అందుబాటులోకి వచ్చింది. దీన్ని **ఐప్యాడ్ మినీ 7** అనీ పిలుచుకుంటున్నారు. 8.4 అంగుళాల లిక్విడ్ రెటీనా డిస్‌ప్లేతో కూడిన ఇది యాపిల్ ఏ17 ప్రొ చిప్‌సెట్‌తో పనిచేస్తుంది. ఈ చిప్‌సెట్‌తో కొత్త ఐప్యాడ్ మినీకి యాపిల్ ఇంటెలిజెన్స్ తోడైనట్టయ్యింది. దీంతో రైటింగ్ టూల్స్, కస్టమ్ ఎమోజీల వంటివన్నీ వాడుకోవచ్చు. ఇది యాపిల్ పెన్సిల్ ప్రొ టూల్‌నూ సపోర్టు చేస్తుంది. దీంతో బొమ్మలు గీసుకోవచ్చు, రాసుకోవచ్చు. వెనకాల యాపిల్ స్మార్ట్ హెచ్‌డీఆర్ 4 కంప్యుటేషన్లను సపోర్టు చేసే 12ఎంపీ వైడ్ కెమెరా సెన్సర్.. సెల్ఫీలు, వీడియో కాల్స్ కోసం ముందు 12ఎంపీ కెమెరా ఉన్నాయి. స్టోరేజీ కూడా రెట్టింపయ్యింది. 128జీబీ స్టోరేజీ మొదలుకొని 256జీబీ, 512జీబీ రకాలూ అందుబాటులో ఉన్నాయి. మరింత వేగంగా వై-ఫై ప్రసారానికి వీలుకల్పించే వై-ఫై 6జీని కూడా ఇది సపోర్టు చేస్తుంది. కేవలం వై-ఫై మోడల్ ధర రూ.49,900. వై-ఫైతో పాటు సెల్యులర్ మోడల్‌కైతే రూ.64,900 చెల్లించాల్సి ఉంటుంది. బ్లూ, పర్పుల్, స్టార్‌లైట్, స్పేస్ గ్రే రంగుల్లో లభిస్తుంది.

వయసా మరలవే!

వృద్ధాప్యాన్ని ఆపితే? ఆ మాటకొస్తే వెనక్కి తిప్పితే? మనకు అసాధ్యమేమోగానీ శాస్త్రవేత్తలు తలచుకుంటే కానిదేముంది? యాంటీబయాటిక్ మందుల ఆవిష్కరణతో ఇన్‌ఫెక్షన్ మరణాలను గణనీయంగా తగ్గించి, ఫలితంగా జీవనకాలాన్నీ పెంచిన శాస్త్రరంగం ఇప్పుడు ఆయుష్షును పెంచటం మీదా దృష్టి సారించింది. వయసు మీరే ప్రక్రియను అర్థం చేసుకునే దిశగా పురోగతీ సాధించింది. వ్యాధి కారక కణాలను నిర్మూలించగల మాత్రలను కనుగొనటం దగ్గరి నుంచి జెల్లీఫిష్ పునరుజ్జీవనం వెనక రహస్యాలను ఛేదించటం వరకూ శాస్త్రవేత్తలు ఎన్నెన్నో ప్రయత్నాలు చేస్తున్నారు. వాన పాములు, కోతుల వంటి జంతువులను ఎక్కువకాలం ఆరోగ్యంగా జీవించేలా చేయగలుగుతున్నారు. ప్రస్తుతానికి చాలా పరిశోధనలు ఎలుకల వరకే పరిమితమైనప్పటికీ వీటిల్లో కొన్నయినా త్వరలోనే మనుషుల మీద ప్రయోగ పరీక్షల దశకు చేరుకోవచ్చని ఆశిస్తున్నారు. అన్నీ సవ్యంగా సాగితే మరో పదేళ్లలోనే వీటి ఫలితాలను చవి చూసినా ఆశ్చర్యపోనవసరం లేదు. మరణాన్ని జయించ లేకపోయినా ఎక్కువకాలం ఆరోగ్యంగా జీవించొచ్చన్నది నిస్సందేహం. అలాంటి కొన్ని ప్రయత్నాలు ఇవిగో..



వృద్ధ కణాల ఊడ్చివేత

శరీరం వెలుపల కణ విభజన నిరంతరం కొనసాగుతుందని ఒకప్పుడు భావించేవారు. అయితే 50 సార్లు విభజన చెందిన తర్వాత, ఈ ప్రక్రియ ఆగిపోతున్నట్టు లియోనార్డ్ హేఫ్లిక్ 1961లో గుర్తించారు. ఇవి వృద్ధాప్యానికి చేరుకుంటున్నట్టు బయటపడింది. మనుషులు, జంతువుల్లోనూ ఇవి వృద్ధాప్యానికి కారణమవుతున్నాయా? దీనికి అవుననే సమాధానం వస్తోంది. వయసు మీద పడుతున్నకొద్దీ శరీరంలో ఇలాంటి కణాలు పోగుపడుతూ వస్తుంటాయి. మంచి విషయం ఏంటంటే- వీటిని ఊడ్చివేసే, నిర్మూలించే మందులను ఆవిష్కరించటం. డాసాటినిబ్ అనే కీమోథెరపీ మందు.. పండ్లు, కూరగాయల్లోని క్వెర్‌సెటిన్ అనే రుచి కారకం ఎలుకల్లో 'వృద్ధ' కణాలను నిర్మూలించి, మంచి ఆరోగ్యంతో ఎక్కువ కాలం జీవించేలా చేస్తున్నట్టు బయటపడింది. క్యాన్సర్, గుండెజబ్బుల వంటి వ్యాధుల నివారణకే కాకుండా శరీరానికి ఇంకాస్త బలాన్నీ ఇస్తున్నట్టు వెల్లడైంది. కంపెనీలు ఇలాంటి మరికొన్ని మందులను రూపొందించటం మీదా దృష్టి సారించాయి. వీటిల్లో ఏది సఫలమైనా వయో ప్రక్రియను ఆపే దిశగా కొత్త ముందడుగు పడినట్టే.

ఐస్‌లాండ్‌లో అద్భుత మందు

భారీ రాతి బొమ్మలకు నిలయమైన ఐస్‌లాండ్ అద్భుతమైన మందునూ ప్రసాదించింది. అదే రాపామైసిన్. దీన్ని 60ల్లో అక్కడి నేలలో గుర్తించారు. బ్యాక్టీరియా జాతులతో పుట్టుకొచ్చే ఇది క్యాన్సర్ చికిత్సలకు, రోగనిరోధకశక్తిని అణచి పెట్టటానికి తోడ్పడుతుంది. అంతేకాదు.. గతి తప్పిన ప్రొటీన్లనూ అడ్డుకుంటుంది. మన శరీరం సజావుగా పని చేయటానికి తోడ్పడే ప్రొటీన్లు గతి తప్పితే విషతుల్యాలుగా మారతాయి. అదృష్టం కొద్దీ మన శరీరంలో స్వీయ భక్షణ (ఆటోఫేజీ) ప్రక్రియ కొన సాగుతూ ఉంటుంది. దీని మూలంగానే కణాలు గతి తప్పిన అణువులను దారిలోకి తేవటం, సరికొత్తగా తయారుచేయటం సాధ్యమవుతోంది. ఇక్కడే రాపామైసిన్ ప్రాధాన్యం సంతరించుకుంటోంది. ఇది గతి తప్పిన ప్రొటీన్లను ఊడ్చి వేయటానికి కణాలకు తగిన శక్తిని ప్రసాదిస్తుంది. ఇలా వయో ప్రక్రియను అడ్డుకుంటుంది. ఇది ఎలుకల్లో 20% వరకూ ఆయుష్షును పెంచినట్టు ప్రయోగ పరీక్షల్లో బయటపడింది. గుండె, చిగుళ్ల జబ్బుల వంటి వాటినీ తగ్గిస్తున్నట్టు వెల్లడైంది. ఈస్ట్, నేలపాములు, ఈగల జీవనకాలాన్నీ పెంచుతున్నట్టు తేలింది. వృద్ధుల్లోనూ రాపామైసిన్ ఇలాంటి ప్రభావమే చూపుతుండటం విశేషం.

శిశువుల్లో దాగిన రహస్యం

శిశు జననం అద్భుతమైన ప్రక్రియ. జీవ నిర్మాణం ఏదో ఒక స్థాయిలో వృద్ధాప్య ప్రక్రియను వెనక్కి మళ్లించిందనటానికిదో నిదర్శనమనీ చెప్పుకోవచ్చు. ఎందుకంటే తల్లిదండ్రుల నుంచి సంక్రమించిన కణాలతోనే పిండం అభివృద్ధి చెందుతుంది. అంటే వారిలోని పాత కణాలు తిరిగి తొలి వయసు నుంచి పురుడు పోసుకుంటున్నాయన్న మాట. వివిధ రకాల ప్రాణుల్లో అంతగా క్షీణించకుండా తరతరాలుగా, లక్షలాది ఏళ్లుగా కొనసాగుతూ వస్తుండటం విశేషం. పిల్లల్లో ఇదెలా సంభవమో తెలుసుకుంటే పెద్దవారిలోనూ వయో ప్రక్రియను నిలువరించొచ్చా? టురిటోప్సిస్ డోర్నీ అనే 'అమర' జెల్లీఫిష్‌లు దీన్ని సాధించనట్టే కనిపిస్తోంది. ఇవి ఒత్తిడికి గురైనప్పుడు తమ వయో ప్రక్రియను శిశు దశకు మళ్లిస్తాయి. తిరిగి మొదటి నుంచీ పునరుజ్జీవం చెందుతాయి. ఇలా ఎన్నిసార్లయినా చేస్తాయి కూడా. వయసును వెనక్కి మళ్లించటమనేది జీవనశాస్త్ర నియమాలకు విరుద్ధం కాదనే సంగతిని ఇవి రుజువు చేస్తున్నాయి. మనుషుల్లోనూ ఇది సాధ్యమైతే? పరిపక్వ కణాల్లో గడియారాన్ని వెనక్కి తిప్పొచ్చని 2012 నోబెల్ గ్రహీత ప్రొఫెసర్ షిన్యా ఎమనక, ప్రొఫెసర్ జాన్ గుర్డాన్ నిరూపించారు కూడా. కేవలం నాలుగు జన్యువులతోనే ఇది సాధ్యమవుతున్నట్టు, ఇవి పాత కణాలను తిరిగి మూల కణాలుగా మారుస్తున్నట్టు తేలింది. ఈ పక్రియను మనుషులకు ఎలా వర్తింపజేయొచ్చనేది ఇంకా తెలియనప్పటికీ అమెజాన్ సంస్థకు చెందిన ఆల్టోస్ ల్యాబ్ దీని మీద గట్టిగానే కృషి చేస్తోంది. ఎలుకల్లో జీవనకాలం 25% పెరిగినట్టు ప్రాథమిక ఫలితాలు చెబుతున్నాయి. పూర్తిస్థాయి ఫలితాలు వెలువడితే అది గొప్ప విషయమే కాగలదు.

ఇప్పటికే ఉన్న ఔషధాలతోనూ..

ఇతర జబ్బులకు వాడుతున్న కొన్ని ఔషధాలూ వయో ప్రక్రియను అడ్డుకోవటం గమనార్హం. ఉదాహరణకు- మధుమేహానికి వాడే ఎస్‌జీఎల్‌టీ-2 ఇన్‌హిబిటార్స్ రకానికి చెందిన కానాగ్లిఫ్లోజిన్, డాపాగ్లిఫ్లోజిన్, ఎంపాగ్లిఫ్లోజిన్‌లనే చూడండి. ఇవి గ్లూకోజును తగ్గించటంతో పాటు మొత్తంగా ఆరోగ్యాన్ని మెరుగు పరచే పనినీ చేపడుతున్నాయి. ఇలా ఆయుష్షు పెరిగేలా చేస్తున్నాయి. కానాగ్లిఫ్లోజిన్ ఎలుకల్లో 14% వరకు జీవనకాలాన్ని పొడిగిస్తున్నట్టు వెల్లడైంది. గ్లూకోజును తగ్గించే మెట్‌ఫార్మిన్, అకార్బోస్.. ఎముకల పటుత్వాన్ని కాపాడే బిస్‌ఫాస్ఫేట్ రకం మందులు సైతం మంచి ఫలితం చూపుతున్నాయి. బరువు తగ్గటానికి కొత్తగా అందుబాటులోకి వచ్చిన సెమాగ్లుటైడ్ కూడా ఆశలు రేపుతోంది. ఇది తక్కువ ఆహారం తినేలా చేయటం ద్వారా జంతువుల్లో జీవనకాలాన్ని పెంచుతున్నట్టు బయట పడింది. ఈ మందులు ఇప్పటికే అందు బాటులో ఉండటం మరింత ఆసక్తి కరమైన విషయం.

ఔషధాలను మిళితం చేసి..

ఒక్కో మందుతోనే సమర్థ ఫలితాలు కనిపిస్తున్నప్పుడు అన్నింటికీ కలిపితే? శాస్త్రవేత్తలు ఈ దిశగానూ ప్రయత్నించారు. రాపామైసిన్, అకార్బోస్ మందుల కలయిక మంచి ప్రభావం చూపిస్తున్నట్టు తేలింది. వీటి సాయంతోనే ఒక ఎలుక ప్రస్తుతం ఎక్కువకాలం జీవిస్తున్న మూషిక రికార్డును కొట్టేసింది. రాపామైసిన్ రక్తంలో గ్లూకోజు మోతాదులను అస్తవ్యస్తం చేస్తుంది. దీన్ని అడ్డుకోవటానికే అకార్బోస్‌ను జోడించారు. వీటి కలయికతో మగ ఎలుకల్లో 40%, ఆడ ఎలుకల్లో 30% జీవనకాలం పెరగటం విశేషం. రాపామైసిన్, వృద్ధ కణాలను నిర్మూలించే మందు, డీఎన్ఏ మీది రక్షణ టోపీలను బలోపేతం చేసే చికిత్స, ఎముక మజ్జ మార్పిడి.. ఇలా నాలుగు పద్ధతులను మేళవించీ శాస్త్రవేత్తలు ప్రయోగాలు నిర్వహించారు. ఇదీ ఆయుష్షును పెంచుతున్నట్టు తేలింది.

its@eenadu.in

పాట రాసి.. బాణీ కట్టి..

సంగీతాన్ని సృష్టించటంలో సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతోంది. కృత్రిమ మేధ (ఏఐ) రాకతో ఇది మరింత పుంజుకుంది. అతి సులభంగా నిమిషాల్లోనే సంగీతాన్ని సృష్టించటానికి వీలు కల్పిస్తోంది. కేవలం వాయిద్యాలతోనే కాదు, కావాలంటే పాటలనూ రాసిపెట్టే స్థాయికి చేరుకుంది. ఇందుకు ఓ మంచి ఉదాహరణ **ట్యాడ్ ఏఐ** (https://tad.ai) ఇదో ఆన్‌లైన్ ఏఐ సాంగ్ జనరేటర్. సులభంగా ఒరిజినల్ సంగీతాన్ని సృష్టించటం దీని ప్రత్యేకత. యూజర్ ఇచ్చిన ఇన్‌పుట్స్ (ప్రాంప్ట్స్)ను విశ్లేషించి పాట శీర్షిక, అంశాలను సూచిస్తుంది. తనే ప్రత్యేకమైన బాణీలు సమకూర్చుతుంది. ఇది మెషిన్ లెర్నింగ్ ఆల్గోరిథమ్‌ల సాయంతో అప్పటికే పెద్దమొత్తంలో ఉన్న సంగీతాన్ని విశ్లేషించుకొని వివిధ రీతులను, శైలులను నేర్చుకుంటుంది. అందువల్ల యూజర్ ఇన్‌పుట్స్ సాయంతో ఒరిజినల్ బాణీలను సృష్టిస్తుంది. సంగీతం మాస్టార్లు తమ కొత్త పాటలకు ఆధారాలు, ఐడియాల కోసం ట్యాడ్ ఏఐని వాడుకోవచ్చు. సంగీత పరిజ్ఞానం అంతగా లేనివారికీ ఉపయోగపడుతుంది. పెద్దగా శిక్షణ తీసుకోకున్నా, వాయిద్యాల వంటి వనరులు లేకున్నా కేవలం పదాల సూచనలతోనే కోరుకున్న మ్యూజిక్ ట్రాక్స్‌ను సృష్టించుకోవచ్చు. అదీ కొద్ది నిమిషాల్లోనే. మధ్యలో ఏదైనా అవాంతరం వచ్చినా, ఎలాంటి బాణీ కావాలో తేల్చుకోకపోయినా ఇది సాయం చేస్తుంది. కొత్త సంగీత ఐడియాలను, జానర్లను ముందుంచుతుంది.

ఎలా వాడుకోవాలి?

- ముందుగా https://tad.ai లోకి వెళ్లాలి. ఖాతాను సృష్టించుకోవాలి. గూగుల్ ఖాతాతోనైనా సైన్‌ఇన్ కావొచ్చు.
- హోం పేజీలో జనరేట్ ఏఐ సాంగ్స్ ఫర్ ఫ్రీ అనే బాక్సు మీద క్లిక్ చేయాలి.
- ఎడమ వైపున సాంగ్ టైటిల్ బాక్సులో పాటకు శీర్షిక పెట్టుకోవాలి.
- లిరిక్స్ బాక్సులోకి వెళ్లి పాటను



రాయాలి. రాయటం రాకపోతే ఏఐ జనరేట్ ఆప్షన్‌ను ఎంచుకోవాలి.
- ఎలాంటి జానర్, మూడ్ అవసరమో నిర్ణయించుకోవాలి.
- అనంతరం క్రియేట్ బటన్ మీద క్లిక్ చేయాలి. అంతే. ఇచ్చిన సమాచారాన్ని ఏఐ విశ్లేషించి నిమిషాల్లో ప్రత్యేకమైన పాటను బాణీతో సహా క్రియేట్ చేసి పెడుతుంది.
- తర్వాత ఆ పాటను వినొచ్చు. నచ్చినట్టుగా వస్తే ట్రాక్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఒకవేళ నచ్చకపోతే ఇన్‌పుట్స్‌ను సవరించుకొని, తిరిగి కొత్తది సృష్టించుకోవచ్చు. ఈ ప్రక్రియ కొద్ది నిమిషాల్లోనే పూర్తవుతుంది కాబట్టి తక్కువ సమయంలోనే బోలెడన్ని పాటలను క్రియేట్ చేసుకోవచ్చు.

వాట్సప్‌లో ఛాట్ రికార్డింగ్

వాట్సప్‌లోని మెటా ఏఐ పర్సనల్ అసిస్టెంట్‌గా బాగా ఉపయోగపడుతోంది. సందేహాలకు సమాధానాలిస్తూ చాలా విషయాల్లో చేదోడుగా నిలుస్తోంది. దీనికి కొత్తగా ఛాట్ మెమరీ ఫీచర్ జత కానుంది. మనం మెటాకు అందించిన అవసరమైన మొత్తం సమాచారాన్ని రికార్డు చేయటం దీని ప్రత్యేకత. ఇలా ఇది మరింత మెరుగైన పర్సనల్ అసిస్టెంట్‌గా తోడుంటుంది. ఉదాహరణకు- యూజర్ శాకాహారి అని అది గుర్తించిందనుకోండి. ఆ వంటకాలనే సూచిస్తుంది. ప్రస్తుతానికి ఈ ఫీచర్ అభివృద్ధి దశలోనే ఉంది. ఇష్టా యిష్టాలను బట్టి పనిచేసే దీన్ని త్వరలోనే కొందరు యూజర్లు పరీక్షించటానికి అందుబాటులోకి తేవొచ్చని భావిస్తున్నారు.

మరిన్ని కథనాల కోసం చూడండి. https://epaper.eenadu.net

ఈనాడు ప్రతిభ

pratibha.eenadu.net/eenadupratibha.net

విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

కరెంట్ అఫైర్స్

■ ఇండియన్ కోస్ట్‌గార్డ్ (ఐసీజీ) దేశీయంగా అభివృద్ధి చేసిన భారత దేశపు మొట్టమొదటి కాలుష్య నియంత్రణ నౌక ఏది? (2024 ఆగస్టు 29న ఈ నౌకను గోవాలో ప్రారంభించారు. గోవా షిప్‌యార్డు లిమిటెడ్ (జీఎస్ఎల్) నిర్మించిన ఈ నౌక పొడవు 114.5 మీటర్లు, వెడల్పు 16.5 మీటర్లు, బరువు



మాదిరి ప్రశ్నలు

4170 టన్నులు.) **జ:** సముద్ర ప్రతాప్

■ 2023-24 ఆర్థిక సంవత్సరంలో లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) భారత ప్రభుత్వానికి ఎంత మొత్తంలో డివిడెండ్‌ను చెల్లించింది? (ఎల్ఐసీలో 96.5 శాతం మెజారిటీ వాటాను కలిగి ఉన్న భారత ప్రభుత్వం, ఎల్ఐసీ వార్షిక రాబడిలో భాగంగా ఈ డివిడెండ్ చెల్లింపును పొందింది.) **జ:** రూ.6,103.62 కోట్లు

■ ఎస్ఏఎఫ్ఎఫ్ (సౌత్ ఏషియన్ ఫుట్‌బాల్ ఫెడరేషన్) అండర్ - 20 ఫుట్‌బాల్ ఛాంపియన్ షిప్ 2024 టైటిల్ విజేతగా ఏ జట్టు నిలిచింది? (ఈ టైటిల్‌ను గెలవడం ఈ జట్టుకు ఇదే తొలిసారి. ఆతిథ్య నేపాల్ జట్టు పై ఈ జట్టు ఫైనల్లో 4-1 గోల్స్ తేడాతో విజయం సాధించింది. ఈ టోర్నీలో పాల్గొన్న 6 జట్లు: భారత్, నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక, మాల్దీవులు, భూటాన్.) **జ:** బంగ్లాదేశ్

మరింత సమాచారం

ప్రిపరేషన్ టెక్నిక్

చదివిన పాఠాన్ని, నేర్చుకున్న అంశాలను స్నేహితులకు బోధించాలి. ఆ విధంగా ఇతరులకు వివరించడం ద్వారా విషయంపై అవగాహన పెరుగుతుంది. మౌలికాంశాలపై పట్టు మరింత బలోపేతం అవుతుంది.

డీఎస్సీ-2024 బయాలజీ మెథడాలజీ

స్థిరం.. సులభం.. సరళం!

జనరల్ స్టడీస్ | అరిథ్‌మెటిక్



ఎవరికైనా అప్పు ఇస్తే కొంత కాలానికి అసలుతోపాటు అదనంగా కొంత సొమ్ము అందుతుంది. బ్యాంకులో డబ్బు డిపాజిట్ చేస్తే, అకౌంట్‌లో మొత్తం కొద్దికొద్దిగా పెరుగుతూ ఉంటుంది. ఆ అదనాన్ని, ఈ పెరుగుదలను వడ్డీ అంటారు. ఇందులో అనేక రకాలు ఉన్నప్పటికీ ముందుగా గుర్తుకు వచ్చేది బారువడ్డీ. దీనినే సాధారణ వడ్డీ లేదా సరళ వడ్డీ అని కూడా అంటారు. వడ్డీ రేటు స్థిరంగా ఉండే దీనిని లెక్కించడం సులభం. అభ్యర్థుల్లో ఆర్థికపరమైన లెక్కల ప్రాథమిక పరిజ్ఞానాన్ని అంచనా వేయడానికి పోటీ పరీక్షల్లో వీటిపై ప్రశ్నలు అడుగుతుంటారు. శాతాలు, గుణకార, భాగహారాలపై పట్టు పెంచుకుంటే ఈ లెక్కలను వేగంగా చేయవచ్చు.



బారు వడ్డీ

అసలు: కొంత కాలానికి అప్పు తెచ్చుకున్న సొమ్మును అసలు (P) అని అంటారు.

వడ్డీ (Interest): అప్పు తెచ్చుకున్న వ్యక్తి తాను తీసుకున్న సొమ్మును వాడుకున్నందుకు, అప్పు ఇచ్చిన వ్యక్తికి కొంత సొమ్మును (అసలు కాకుండా) అదనంగా చెల్లిస్తాడు. దాన్నే వడ్డీ అని అంటారు.

వడ్డీ రెండు రకాలు

1) బారు వడ్డీ

2) చక్ర వడ్డీ

బారు వడ్డీ (Simple Interest)

ఎంత కాలానికైనా వడ్డీని అసలు పైనే లెక్కగడితే అలాంటి వడ్డీని 'బారు వడ్డీ' అని అంటారు.

సంవత్సరానికి వడ్డీ రేటు (%): దీన్ని ముందుగానే ఒక షరతు మీద ఆధారపడి నిర్ణయించి వడ్డీని లెక్కగడతారు.

కాల వ్యవధి: అప్పును ఎంత కాలానికైతే తీసుకుంటామో దాన్ని 'కాల వ్యవధి' అని అంటారు.

మొత్తం సొమ్ము = అసలు + బారు వడ్డీ

అసలు = P, వడ్డీరేటు = R% సంవత్సరానికి కాలం = T, మొత్తం = A అనుకుంటే

బారువడ్డీ (S.I.) $= \frac{PTR}{100}$

$A = P + S.I.$

$A = P + \frac{PTR}{100} = P\left(1 + \frac{TR}{100}\right)$

ముఖ్యమైన అంశాలు:

$SI = \frac{PTR}{100}$; $T = \frac{SI.100}{PR}$

$R = \frac{SI.100}{PT}$; $P = \frac{SI.100}{TR}$

మాదిరి ప్రశ్నలు

1. సంవత్సరానికి 12% చొప్పున నిర్దిష్ట మొత్తంపై సంపాదించిన సాధారణ వడ్డీ ఆరు సంవత్సరాల్లో రూ. 10,800 అయితే మొత్తం ఎంత?

1) రూ.21,000 2) రూ.18,000 3) రూ.15,000 4) రూ.12,000

వివరణ: అసలు = P

సంవత్సరానికి అయ్యే వడ్డీ శాతం = 12%

∴ 6 సంవత్సరాలకు అయ్యే వడ్డీ శాతం = 72%

6 సంవత్సరాల్లో అయ్యే వడ్డీ రూపాయల్లో 10,800

∴ 72% ... 10,800, 100% ... ?

$\frac{100}{72} \times 10,800 =$ రూ.15,000 **జ: 3**

2. అరవింద్ తన కుమారుడికి ఆరేళ్ల వయసులో సంవత్సరానికి 15% సాధారణ వడ్డీ మీద కొంత సొమ్మును బ్యాంకులో డిపాజిట్ చేశాడు. తన కుమారుడికి 12 ఏళ్లు వచ్చేటప్పటికి ఆ బ్యాంకులో సొమ్ము రూ.37,240 అయ్యింది. అయితే అరవింద్ బ్యాంకులో డిపాజిట్ చేసిన సొమ్ము ఎంత?

1) రూ.11,500 2) రూ.16,900 3) రూ.19,600 4) ఏదీకాదు

వివరణ: అసలు (P) = 100% అనుకుంటే బ్యాంకులో ఆ సొమ్మును 6 సంవత్సరాలు ఉంచాడు.

∴ సంవత్సరానికి అయ్యే వడ్డీ = 15%

6 ఏళ్లకు అయ్యే వడ్డీ = 6 × 15% = 90%

మొత్తం = అసలు + వడ్డీ

= 100% + 90% = 190%

లెక్క ప్రకారం

∴ 190% ... 37,240, 100% ... ?

$\frac{100}{190} \times 37,240 =$ రూ.19,600 **జ: 3**

3. ఒక వ్యక్తి మూడేళ్లపాటు నిర్దిష్ట మొత్తాన్ని, నిర్దిష్ట సాధారణ వడ్డీరేటు చొప్పున పెట్టుబడి పెట్టాడు. అయితే ఇప్పుడున్న సాధారణ వడ్డీరేటు కంటే 4% పాయింట్లు ఎక్కువ సాధారణ వడ్డీకి పెట్టుబడి పెట్టినట్లయితే రూ.96 ఎక్కువ లాభం వస్తే, అతడి పెట్టుబడి ఎంత?

1) రూ.2,400 2) రూ.1,600 3) రూ.400 4) రూ.800

వివరణ: పెట్టుబడి (లేదా) అసలు = రూ.x

వడ్డీరేటు = r% అనుకుంటే

లెక్కప్రకారం వడ్డీరేటును 4% పాయింట్లు పెంచితే రూ.96 అదనంగా లాభం వస్తుంది.

$\therefore \frac{x \times 3 \times (r+4)}{100} - \frac{x \times 3 \times r}{100} = 96$

$= \frac{3xr + 12x - 3xr}{100} = 96$

$\therefore 12x = 96 \times 100 \Rightarrow x =$ రూ.800

పెట్టుబడి (x) = రూ.800 **జ: 4**

4. ఒక నిర్దిష్ట మొత్తంలో 25% సొమ్మును సంవత్సరానికి 12% సాధారణ వడ్డీకి, 50% సొమ్మును 8% వడ్డీకి, మిగిలిన సొమ్మును 6% చొప్పున రుణంగా ఇచ్చారు. అయితే ఆ మొత్తానికి సంవత్సరానికి సాధారణ వడ్డీ సుమారు ప్రభావవంతమైన రేటు ఎంత?

1) 8% 2) 9% 3) 7.5% 4) 8.5%

వివరణ: అసలు (P) = x అనుకుంటే

లెక్కప్రకారం ఆ అసలులో 25% సొమ్ముకు 12%; 50% సొమ్ముకు 8%; మిగిలిన 25% సొమ్ముకు 6% వడ్డీరేటు చొప్పున రుణంగా ఇచ్చారు.

$\therefore \left(\frac{25x}{100} \times \frac{12}{100}\right) + \left(\frac{50x}{100} \times \frac{8}{100}\right) + \left(\frac{25x}{100} \times \frac{6}{100}\right) = \frac{x \times 1 \times R}{100}$

$= \frac{3x}{100} + \frac{x}{25} + \frac{3x}{200} = \frac{Rx}{100}$

$= \frac{6x + 8x + 3x}{200} = \frac{Rx}{100}$

$\Rightarrow \frac{17x}{200} = \frac{Rx}{100} \Rightarrow R = \frac{17}{2} \Rightarrow 8.5\%$ **జ: 4**

5. హేమంత్ ఒక వ్యక్తి నుంచి సంవత్సరానికి 12% వడ్డీరేటుపై (సాధారణ వడ్డీ మీద) రూ.15,000 అప్పుగా తీసుకున్నాడు. ఆ తర్వాత దానిలో రూ.8,000 లను నగేశ్‌కు సంవత్సరానికి 15% సాధారణ వడ్డీకి అప్పుగా ఇచ్చాడు. మిగిలిన మొత్తాన్ని ....% వడ్డీరేటు చొప్పున రాజుకు అప్పుగా ఇచ్చాడు. హేమంత్ ఆ ఇద్దరి వద్ద నుంచి రూ.1,980 సాధారణ వడ్డీని మూడు సంవత్సరాలకు పొందితే, మూడేళ్ల తరువాత హేమంత్ చెల్లించాల్సిన మొత్తం వరుసగా....

1) 15% రూ.2,500 2) 16% రూ.4,800 3) 18% రూ.5,400 4) 20% రూ.6,600

వివరణ: హేమంత్ అప్పుగా తీసుకున్న అసలు రూ.15,000

నగేష్ రూ.8,000 15% | రాజు రూ.7,000 r% అనుకుంటే

లెక్క ప్రకారం $8,000\left(1+\frac{3 \times 15}{100}\right) + 7000\left(1+\frac{3r}{100}\right) - 15,000\left(1+\frac{3 \times 12}{100}\right) = 1,980$

$= 11,600 + 7,000\left(1+\frac{3r}{100}\right) - 20,400 = 1,980$

$7,000\left(1+\frac{3r}{100}\right) = 1,980 + 8,800$

$1 + \frac{3r}{100} = \frac{10,780}{7,000}$

$\frac{3r}{100} = \frac{10,780}{7,000} - 1$

$\frac{3r}{100} = \frac{10,780 - 7,000}{7,000}$

$\frac{3r}{100} = \frac{3,780}{7,000} \Rightarrow 3r = 54$

$r = 18\%$

∴ 3 సంవత్సరాల తరువాత హేమంత్ చెల్లించిన వడ్డీ

$= \frac{3 \times 12 \times 15,000}{100}$

$= 3 \times 12 \times 150$

= రూ.5,400 **జ: 3**



రచయిత: డాక్టర్ కంచుమర్తి దొర

పదోతరగతి — గణితం



వర్గబహుపది కనుక్కుంటారా..!

ప్రశ్నలు జవాబులు

2 మార్కులు — **బహుపదులు**

1) ఒక వర్గ బహుపది శూన్యాల మొత్తం, లబ్ధం వరుసగా −3, 2 అయితే ఆ వర్గబహుపదిని కనుక్కోండి.

సాధన: ఆ బహుపది శూన్యాలు α, β అనుకోండి.

$\alpha + \beta = -3, \alpha.\beta = 2$ అని ఇచ్చారు.

కావాల్సిన వర్గ బహుపది $p(x) = k[x^2 - (\alpha + \beta)x + \alpha.\beta]$, 'k' ఒక వాస్తవ సంఖ్య.

$\Rightarrow k[x^2 - (-3)x + 2] \Rightarrow k = 1$ విలువకు బహుపది $x^2 + 3x + 2$.

2) ఒక వర్గ బహుపది శూన్యాల మొత్తం, లబ్ధం వరుసగా $\frac{1}{4}, -1$ అయితే ఆ వర్గబహుపదిని కనుక్కోండి.

సాధన: ఆ బహుపది శూన్యాలు α, β అనుకుంటే.

$\alpha + \beta = \frac{1}{4}, \alpha.\beta = -1$

కావాల్సిన వర్గ బహుపది $p(x) = k[x^2 - (\alpha + \beta)x + \alpha.\beta]$, 'k' ఒక వాస్తవ సంఖ్య.

$\Rightarrow k\left[x^2 - \left(\frac{1}{4}\right)x + (-1)\right] \Rightarrow k\left(\frac{4x^2 - x - 4}{4}\right)$

k = 4, విలువకు బహుపది $4x^2 - x - 4$.

3) ఒక వర్గ బహుపది శూన్యాల మొత్తం, లబ్ధం వరుసగా $\sqrt{2}, \frac{1}{3}$ అయితే ఆ వర్గ బహుపదిని కనుక్కోండి.

సాధన: ఆ బహుపది శూన్యాలు α, β అనుకుంటే.

$\alpha + \beta = \sqrt{2}, \alpha.\beta = \frac{1}{3}$

కావాల్సిన వర్గ బహుపది $p(x) = k[x^2 - (\alpha + \beta)x + \alpha.\beta]$, 'k' ఒక వాస్తవ సంఖ్య.

$\Rightarrow k\left[x^2 - (\sqrt{2})x + \left(\frac{1}{3}\right)\right] \Rightarrow k\left(\frac{3x^2 - 3\sqrt{2}x + 1}{3}\right)$

k = 3, విలువకు బహుపది $3x^2 - 3\sqrt{2}x + 1$.

ముఖ్యమైనవి మరికొన్ని.. (4 మార్కులు)

1) బహుపది $6x^2 - 3 - 7x$ యొక్క శూన్యాలను కనుక్కుని, బహుపది శూన్యాలకు, గుణకాలకు మధ్య ఉన్న సంబంధాన్ని సరిచూడండి.

2) బహుపది $t^2 - 15$ యొక్క శూన్యాలను కనుక్కుని, బహుపది శూన్యాలకు, గుణకాలకు మధ్య ఉన్న సంబంధాన్ని సరిచూడండి.

జవాబుల కోసం

- డాక్టర్ టీఎస్‌వీఎస్ సూర్యనారాయణ మూర్తి

విజయవాడ మధ్య

'వైకాపాది దుర్మార్గ పాలన'

సత్యనారాయణపురం, న్యూస్‌టుడే : గత తెదేపా ప్రభుత్వం హయాంలో తాను శంకుస్థాపన చేసిన సత్యనారాయణపురం పోలీసు స్టేషన్ భవన నిర్మాణాన్ని వైకాపా ప్రభుత్వం పూర్తి చేయలేకపోవడంపై ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన భవన నిర్మాణాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రూ.2.30 కోట్లతో నాడు శంకుస్థాపన చేశామని గుర్తు చేశారు. వెంటనే పూర్తిచేయాలన్న సంకల్పంతో పనులు ప్రారంభించామన్నారు. ప్రభుత్వం మారడంతో.. పనులు ఆగిపోయాయని, వైకాపా దుర్మార్గ పాలనకు ఇది నిదర్శనమని దుయ్యబట్టారు. తక్షణం పనులు ప్రారంభించి, పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. కార్పొరేటర్ రామమోహనరావు, నాయకులు సాంబశివరావు, విజయ్ కుమార్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలపాటి రాజాను గెలిపించండి



మాట్లాడుతున్న సాంబశివరావు. వేదికపై రామ్మోహనరావు, రమణారావు తదితరులు

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్), న్యూస్‌టుడే : కృష్ణా, గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఆలపాటి రాజాను గెలిపించాలని తెదేపా రాష్ట్ర కార్యదర్శి నవనీతం సాంబశివరావు, నాయకుడు గంటా కృష్ణమోహన్‌లు పిలుపునిచ్చారు. మంగళవారం అజిత్‌సింగ్‌నగర్‌లోని తెదేపా సెంట్రల్ కార్యాలయంలో డివిజన్ ఇన్‌ఛార్జులు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ... నియోజకవర్గంలో 21 డివిజన్లలో 2021 అక్టోబరు నాటికి డిగ్రీ పూర్తి చేసిన వైద్యులు, న్యాయవాదులు, ఇంజినీర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయులను ఓటర్లుగా నమోదు చేయించాలని కోరారు. నవంబరు 6 వరకు మాత్రమే గడువు ఉందని గుర్తు చేశారు. గతంలో నమోదు చేసుకున్నా వారితోనూ చేయించాలని సూచించారు. నూతన సభ్యత్వ నమోదు ఉత్సాహంగా చేయాలని కోరారు. చెన్నగిరి రామ్మోహనరావు, ఎరుబోతు రమణారావు, కంచి ధనశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి ధర్నా విజయవంతానికి పిలుపు

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్), న్యూస్‌టుడే : బుడమేరు వరద బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన విధంగా నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ నార్త్ తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించే ధర్నాకు బాధితులంతా రావాలని సీపీఎం ఓ ప్రకటనలో పిలుపునిచ్చింది. గత నాలుగు రోజులుగా నష్టపరిహారం రానివారితో దరఖాస్తులు పెట్టించామని నాయకులు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అందరికీ న్యాయం చేస్తానని చెప్పి.. 50 రోజులు గడిచిందని గుర్తు చేశారు. ఇంకా పరిహారం అందని వారు చాలా మంది ఉన్నారని తెలిపారు. బాధితులను గుర్తించడంలో అధికారులు, సిబ్బంది విఫలమయ్యారని విమర్శించారు. ప్రజలు ధర్నాకు తరలిరావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సి.హెచ్.బాబూరావు పిలుపునిచ్చారు.

'ఈవోకు నోటీసు ఇవ్వడం సరికాదు'

గాంధీనగర్, న్యూస్‌టుడే : పన్ను బకాయిలు చెల్లించాలంటూ మున్సిపల్ అధికారులు దుర్గగుడి ఈవోకు నోటీసు ఇవ్వడం సరికాదని ఏపీసీసీ ఉపాధ్యక్షుడు కొలనుకొండ శివాజీ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మల్లికార్జున మండపం, సీవీ రెడ్డి ఛారిటీస్ స్థలంలో కట్టడాలపై ఆస్తి పన్ను ఎలా విధిస్తారని ప్రశ్నించారు. గతంలో దేవాదాయ శాఖ కమిషనర్ హిందూ ధార్మిక సంస్థలకు చెందిన నిర్మాణాలకు నోటీసులు ఇవ్వరాదని ఇచ్చిన ఉత్తర్వులు నగరపాలక సంస్థ అధికారులకు గుర్తుకు రాలేదా అన్నారు. భక్తుల సౌకర్యార్థం నిర్మించే వాటికి పన్నులేంటని ఇదేమన్నా వ్యాపారసంస్థలా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో దేవస్థానాలకు పన్నులు కట్టాలంటూ నోటీసులు ఇచ్చిన దాఖలాలు లేవని చెప్పారు. ధార్మిక సంస్థల పట్ల వ్యాపార ధోరణితో వ్యవహరించడం సరికాదన్నారు. మున్సిపల్ శాఖ మంత్రి స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

కారు ఢీకొని గాయాలు

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్), న్యూస్‌టుడే : అజిత్‌సింగ్‌నగర్ పైవంతెనపై ఆదివారం రాత్రి కారు ఢీకొని తూము రమేష్ (40) అనే వ్యక్తి గాయపడినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన రమేష్ ద్విచక్రవాహనంపై వెళుతుండగా.. గుర్తు తెలియని కారు వచ్చి ఢీకొట్టింది. అతడికి స్వల్ప గాయాలు కాగా.. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

30న స్థాయీ సంఘం సమావేశం

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ స్థాయీ సంఘం సమావేశం ఈ నెల 30న నిర్వహించనున్నారు. సమావేశం తేదీ నిర్ణయించడంతో అధికారులు ప్రియాంబుల్స్ సిద్ధం చేస్తున్నారు. మరోవైపు అన్ని విభాగాల అధికారులు తమ పరిధిలో ప్రతిపాదిత అంశాలను కార్పొరేషన్ కార్యదర్శి విభాగానికి పంపాలని అధికారులకు సర్క్యులర్ జారీ చేశారు.

విజయవాడ మధ్య

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఆప్కాస్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు కమిషనర్ ధ్యానచంద్రను కోరారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు దోనేపూడి కాశీనాథ్ ఆధ్వర్యంలో యూనియన్ నాయకులు మంగళవారం ప్రధాన కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. కార్మికుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. కమిషనర్ మాట్లాడుతూ... కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. నాయకులు జ్యోతిబసు, టి.ప్రవీణ్, టి.తిరుపతమ్మ, కృష్ణ, నల్ల శ్రీను, జలసూత్రం నాగరాజు, హరిబాబు, టి.చిన్న పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

63036 11232

? దేవీనగర్ ఆరో లైన్‌లోని డీఆర్‌డబ్ల్యూఏ-681 వద్దగల సైడు కాలువ చెత్తతో పూడుకుపోయింది. దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. **- కొమ్ము రాంబాబు, స్థానికుడు**

✔ పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.

- వి.రామకోటేశ్వరరావు, ఏఎంవోహెచ్, వీఎంసీ

\- న్యూస్‌టుడే, సీతారాంపురం

రైతుబజార్లలో కూరగాయల ధరలు.. వంకాయలు-38, టమాటా-38/42, బెండ-40, పచ్చిమిర్చి-42, కాకర-38, బీర-38, క్యాలీ ఫ్లవర్-30/35, క్యాబేజీ-32, క్యారెట్-48, దొండ-30, బంగాళదుంప-38, ఉల్లిపాయలు-48, గోరు చిక్కుడు-32, దోస-36, సొర-20/25, పొట్ల-20/25, అరటికాయ-5/6, చామదుంప-36, అల్లం-70/140, మునగ-7/8, ఆకు కూరలు (కట్ట)-4, కంద-56, బీట్ రూట్-34, కీరదోస-32, బీన్స్-140, క్యాప్సికమ్-75, నిమ్మ (డజను)-32/40, కొత్తిమీర కట్ట-20/10, పుదీనా-5/20, పచ్చిమామిడి-14/15 (నిన్నటివి). నగరంలోని రైతుబజార్లలో ఈ ధరలు (రూ.కిలో) వర్తిస్తాయి. **- ఎన్టీఆర్ కలెక్టరేట్, విజయవాడ**

ధర వరలు



సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలకు అదనపు బాధ్యతలు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ ప్రణాళికా విభాగంలో కొన్ని మార్పులు చేస్తూ అధికారులు చర్యలు తీసుకున్నారు. కొందరు టీపీఎస్‌లు, టీపీవోలు బదిలీ కావడం, డివిజన్ల పర్యవేక్షక బాధ్యతలు చూసేందుకు కావాల్సినంత మంది టీపీబీవోలు లేకపోవడంతో ఆ బాధ్యతలను ప్రస్తుతం సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలకు అప్పగించారు. కార్పొరేషన్ పరిధిలో 240 మంది సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలు ఉన్నారు. వారిలో సీనియారిటీ, ఇతర అర్హతల ఆధారంగా 12 మందిని ఎంపిక చేసి టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఆఫీసర్ (టీపీబీవో) ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. టీపీబీవో-1గా దగ్గుబాటి ప్రదీప్ కశ్యప్, టీపీబీవో-2గా మైలు వసంతరావు, టీపీబీవో-3గా నెలమలిపురి ఐశ్వర్య, టీపీబీవో-4గా జరుగుల నేతాజీ, టీపీబీవో-5గా అంజూరి సత్యనారాయణ, టీపీబీవో-6గా చెన్నూరి సాయికిషోర్, టీపీబీవో-7గా జిలానీ మీరం సాహెబ్ ఘరి, టీపీబీవో-8గా తడ్డి లక్ష్మణరావు, టీపీబీవో-9గా కరణం రవికుమార్, టీపీబీవో-10గా పరిసె ప్రభుకుమార్, టీపీబీవో-11గా దావు వీర వెంకట రాజ్‌కుమార్, టీపీబీవో-12గా కర్రి నాగేశ్వరరావులకు బాధ్యతలు అప్పగించారు.

అనుమతి బాధ్యతలిలా..

భవన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చే బాధ్యతలను అధికారుల కేడర్, స్థాయికి అనుగుణంగా అప్పగించారు. ఆ నిర్ణయం ఆగస్టులో తీసుకున్నా, ప్రస్తుతం అమల్లోకి తెస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 100 చ.మీ.లోపు విస్తీర్ణంలో భవన నిర్మాణాలకు అనుమతి మంజూరు చేసే అధికారాన్ని ఇన్‌ఛార్జి టీపీబీవోలకు అప్పగించారు. 101 - 200 చ.మీ. విస్తీర్ణంలో ప్లాను మంజూరు చేసే అధికారాన్ని టౌన్‌ప్లానింగ్ అధికారి, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్‌కు ఇచ్చారు. 201 - 500 చ.మీ. విస్తీర్ణం గల స్థలంలో ప్లాను మంజూరు చేసే అధికారాన్ని డిప్యూటీ సిటీ ప్లానర్, అసిస్టెంట్ సిటీప్లానర్లకు అప్పగించారు. 501 - వెయ్యి చ.మీ. విస్తీర్ణంగల స్థలానికి ప్లాను మంజూరు చేసే బాధ్యత ప్రణాళికా విభాగం ముఖ్య అధికారికి, 1001 చ.మీ. పైబడిన స్థలంలో నిర్మాణాలకు ప్లాను మంజూరు చేసే అధికారం కమిషనర్‌కు కల్పిస్తూ ఆదేశాలు జారీచేశారు.

ప్రణాళికాధికారుల రిలీవ్

స్పందనకు వందనం

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళికా విభాగంలో సుదీర్ఘకాలంగా విధులు నిర్వహిస్తున్న పలువురు ప్రణాళికాధికారులను ప్రభుత్వం ఇటీవల బదిలీ చేయగా, ఎట్టకేలకు వారందరినీ రిలీవ్ చేస్తూ ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రణాళికా విభాగంలో చాలాకాలంగా పనిచేస్తున్న అధికారులను సెప్టెంబరు నెలలోనే ప్రభుత్వం బదిలీ చేసింది. ఉత్తర్వులు కూడా జారీ అయ్యాయి. వరదల కారణంగా వారిని రిలీవ్ చేసే ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోయింది. వరద తగ్గినా ప్రణాళికాధికారులను అధికారులు రిలీవ్ చేయలేదు. దీనిపై 'ఈనాడు'లో ఈనెల 18న 'బదిలీ అయ్యారు..రిలీవ్ కాలేదు' శీర్షికన వార్త ప్రచురితమైంది. కమిషనర్ స్పందించి బదిలీ అయిన అధికారులందరినీ రిలీవ్ చేయాలని ప్రణాళికా విభాగం ముఖ్య అధికారిని ఆదేశించారు. సోమవారం రాత్రి ఆదేశాలు జారీ చేయగా, మంగళవారం వారంతా రిలీవ్ అయ్యి వెళ్లిపోయారు. సత్యనారాయణపురం ప్రాంతంలో పనిచేస్తున్న వీఎంవీ రమణారెడ్డి, కేదారేశ్వరిపేట పరిధిలోని కె.అరుణ, పాతబస్తీ పరిధిలోని కె.ఆశ, భవానీపురం ప్రాంతంలోని కె.వెంకటేశ్వరరావు, పటమట ప్రాంతంలోని శేషశైల, రామలింగేశ్వరనగర్ పరిధిలోని కొండలరావు తదితర టీపీవోలు, టీపీఎస్‌లు తమ బదిలీ ప్రాంతాలకు వెళ్లిపోయారు.

కృష్ణా తీరం.. డ్రోన్ల హోరం

నగర వాసులకు కొత్త అనుభూతి



నవోత్సాహం



పున్నమిఘాట్‌లో డ్రోన్ విన్యాసాలను ఆసక్తిగా తిలకిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



యువత.. కేరింత

ఈనాడు డిజిటల్ - అమరావతి, న్యూస్‌టుడే - భవానీపురం, విద్యాధరపురం

పున్నమి, భవానీ ఘాట్ వేదికగా నిర్వహించిన డ్రోన్ షో చూపరులను ఆకట్టుకుంది. మంగళవారం ఉదయం మంగళగిరిలో సీఎం చంద్రబాబునాయుడు సమ్మిట్‌ను ప్రారంభించారు. 'షో'ను చూడటానికి ప్రజలు భారీ ఎత్తున తరలొచ్చారు. ఒక్కసారిగా వేలాది డ్రోన్లు ఆకాశంలోకి ఎగిరి వివిధ రకాల ప్రదర్శిస్తున్న దృశ్యాలను దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన అతిథులు ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సినిమా, జానపద పాటలకు కళాకారుల చేసిన నృత్యాలు ప్రేక్షకులను హోరెత్తించాయి. లేజర్ షో ఆకట్టుకుంటుంది.



చిన్నారులను అభినందిస్తూ..



మంగళగిరి సీకే కన్వెన్షన్‌లో సాంస్కృతిక ప్రదర్శనను తిలకిస్తున్న సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి రామ్మోహన్, రాష్ట్ర మంత్రులు అనిత, అచ్చెన్నాయుడు, అధికారులు తదితరులు

ఆశ్చర్యంగా ఉంది



ఇలాంటి సదస్సులు మాలాంటి విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతగానో ఉపయోగపడతాయి. నూతన సాంకేతికతతో ఒకేసారి ఐదు వేలకు పైగా డ్రోన్ల ప్రదర్శన ఆశ్చర్యంగా అనిపిస్తోంది. ఈ కార్యక్రమంతో కొత్త విషయాలు తెలుసుకున్నాం.

\- ఎన్.అజయ్, సన్ని, చందు (విద్యార్థులు)

కనువిందు చేసింది



గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇలాంటి సదస్సు నిర్వహించలేదు. సాంకేతికతో డ్రోన్ల ప్రదర్శనలతో పాటు సాంప్రదాయ నృత్య, గీతాలాపనలు కనువిందు చేస్తున్నాయి. ఒకే సదస్సులో ఇన్ని కార్యక్రమాలు నిర్వహించడం నూతన అనుభూతిని ఇస్తున్నాయి.

\- శ్రావ్య (గృహిణి, విజయవాడ)

చాలా ఆనందంగా ఉంది



ఇలాంటి ప్రదర్శన ఎప్పుడూ చూడలేదు. మంగళగిరిలో జరుగుతున్న సదస్సు అందరికీ ఎంతో ఉపయోగకరం. కొత్త పరిజ్ఞానాన్ని అందరూ తెలుసుకునేందుకు ఇలాంటివి ఎంతో దోహదపడతాయి. మన విజయవాడలో డ్రోన్ షో నిర్వహించడం చాలా ఆనందంగా ఉంది. పిల్లలకు ఇలాంటి కార్యక్రమాలు మరింతగా నచ్చుతాయి.

\- కె.కృష్ణ ప్రియ (ప్రైవేటు ఉద్యోగిని, విజయవాడ)

ప్రదర్శన ఆకట్టుకుంది



గతంలో ఎన్నడూ లేని విధంగా విజయవాడ వేదికగా ఏర్పాటు చేసిన భారీ డ్రోన్‌షో ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనను తిలకించడానికి అవకాశం కల్పించడం శుభ పరిణామం. సాంకేతికతపై సామాన్యులు అవగాహన పెంచుకునేందుకు వీలవుతుంది. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి అందరినీ భాగస్వామ్యం చేస్తున్న కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు.

\- సురేష్‌కుమార్ (ప్రైవేటు ఉద్యోగి, అయోధ్యనగర్)

కొత్త ఆలోచనలకు దోహదం



భారీ సంఖ్యలో డ్రోన్లను ఒకేచోట ప్రదర్శించడం అద్భుతంగా ఉంది. ఇలాంటి సదస్సులు మా భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడతాయి. వీటి ద్వారా నూతన సాంకేతికతపై మరింత ఆసక్తి పెరుగుతోంది. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న ప్రభుత్వానికి ధన్యవాదాలు.

\- వి.కావ్య, ప్రవళిక, సరోజిని (కళాశాల విద్యార్థినులు)

విగ్రహ ప్రతిష్ఠాపన పూర్తి!

రెండో గుడి నిర్మాణ పనులు వేగవంతం

మధురానగర్, న్యూస్‌టుడే

మధురానగర్ వి.వి.నరసరాజురోడ్డులో అమ్మవారు వెలిశారని రెండో గుడి నిర్మాణాన్ని స్థానికులు వేగవంతం చేశారు. అధికారులు ఎన్నిసార్లు హెచ్చరించినా పట్టించుకోకుండా తమ పని తాము చేసుకుపోతున్నారు. గుడి నిర్మాణం వద్దంటూ స్థానికులు కొందరు అభ్యంతరం వ్యక్తం చేశారు. నగరపాలక సంస్థ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం మధ్యాహ్నం గుడి పేరుతో తెరలు ఉపయోగించి ఏర్పాటు చేసిన నిర్మాణాన్ని నగరపాలకసంస్థ అధికారులు తొలగించేందుకు వచ్చారు. వీరిని స్థానికుల్లో కొంత మంది అడ్డుకున్నారు. మరికొందరు తమ ఇళ్ల ఎదుట గుడి ఏంటని.. తొలగించాలంటూ అధికారులతో పేర్కొన్నారు. ఈ క్రమంలో కొందరు గుమ్మడికాయలు దిష్టి తీసి హడావుడి చేశారు. అధికారులు వెనుకంజ వేయాల్సి వచ్చింది. ముందుగా దీనిపై ఫిర్యాదులు చేసినా పట్టించుకోకుండా నిర్లిప్తత వహించటంతో.. ఈ పరిస్థితి తలెత్తిందని ప్రజలు విమర్శించారు. మంగళవారం సాయంత్రం ఇటుకలు అడ్డుపెట్టి సిమెంటుతో దిమ్మె నిర్మించి దానిపై అప్పటికప్పుడు అమ్మవారి విగ్రహం పెట్టేశారు.



ఏర్పాటు చేసిన విగ్రహం



దిమ్మె నిర్మిస్తూ..



వెనుతిరుగుతున్న పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది

ఫిర్యాదు వచ్చింది.. చర్యలు తీసుకుంటాం

వి.వి.నరసరాజురోడ్డులో గుడి నిర్మిస్తున్నట్లు స్థానికుల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. మంగళవారం మధ్యాహ్నం అధికారులు వెళ్లారు. స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఉద్రిక్తత ఏర్పడింది. స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై తప్పకుండా చర్యలు తీసుకుంటాం. **- రాంబాబు, సహాయ పట్టణ ప్రణాళికాధికారి**

అవకాశాలు అందిపుచ్చుకోండి

మాచవరం, న్యూస్‌టుడే : ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల ప్రభుత్వ డిగ్రీ కళాశాల (మహిళల)యూత్ ఫెస్టివా 2కె24ను మహాత్మాగాంధీ రోడ్డులోని మినర్వా గ్రాండ్‌లో మంగళవారం నిర్వహించినట్లు ప్రిన్సిపల్ వల్లూరు నీరజ తెలిపారు. విద్యార్థినుల ఆసక్తి, అభిరుచులు తెలుసుకోవడం, వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడమే ఈ యూత్ ఫెస్టివా 2కె24 ప్రధాన లక్ష్యమన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రైవేటు రంగంలో ఉపాధి అవకాశాల కోసం తగిన నైపుణ్యాలు పెంచుకోవాలని సూచించారు. ఎస్‌డీఎం సిద్ధార్థ మహిళా కళాశాల పూర్వ సంచాలకులు తుమ్మల విజయలక్ష్మి మాట్లాడుతూ.. విద్యార్థినులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకూడదని చెప్పారు. చదరంగం, క్యారమ్స్, పాటలు, జానపద నృత్యం, మూగ సైగలు, బ్యానర్ తయారీ తదితర పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థినుల సాంస్కృతిక కళా ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. ప్రిన్సిపల్ వల్లూరు నీరజ అధ్యక్షత వహించగా.. వైస్ ప్రిన్సిపల్ కె.బాలకృష్ణ, సుమిత్ర, సత్యవాణి, సుధారాణి, అరుణ, ప్రసాదరావు, లావణ్య, నాగలక్ష్మి, దివ్య, తదితర అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



విజేతలకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే ఉమామహేశ్వరరావు. పక్కన విజయలక్ష్మి, నీరజ



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు


సీతారాంపురం, న్యూస్‌టుడే : చుట్టుగుంట సబ్ స్టేషన్ 11కేవీ సీతారాంపురం ఫీడర్ పరిధిలోని విద్యుత్తు లైన్ల మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల 23న ఉదయం 8 నుంచి 10 గంటల వరకు పలు ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తామని ఈఈ పి.రవీంద్రబాబు తెలిపారు. విశాలాంధ్ర ప్రెస్, విశాలాంధ్ర ప్రెస్ రోడ్డు, బోయపాటివారి వీధి, శ్రీనివాసరావు వీధి, నేతాజీ వీధి, బారిస్టర్ వీధి, బంకపల్లివారి వీధి, పాపయ్య వీధి, స్వాతి ప్రెస్ ప్రాంతం, కడియాలవారి వీధి, బెల్లపు శోభనాద్రి వీధి, చలసాని వెంకట కృష్ణయ్య వీధి, కోవెలమూడివారి వీధి, ఎంజే నాయుడు హాస్పిటల్ ప్రాంతం, దాసరివారి వీధిలో సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నియామకం

గాంధీనగర్, న్యూస్‌టుడే : గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్ తాత్కాలిక రాష్ట్ర నూతన ప్రధాన కార్యదర్శిగా బత్తుల అంకమ్మరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జానీపాషా మంగళవారం గాంధీనగర్‌లోని ఏపీ ఎన్జీవో కార్యాలయంలో నియామక పత్రం అందజేశారు. సంఘం ఎన్నికలు నిర్వహించే వరకు అంకమ్మరావు ఆ పదవిలో కొనసాగుతారని ఆయన తెలిపారు.

నేటి నుంచి కృష్ణమాచార్య శతజయంతి ఉత్సవాలు

గాంధీనగర్, న్యూస్‌టుడే : సంగీత, సాహిత్య కళానిధి, గాన కళా ప్రపూర్ణ, అష్టావధాని నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యుల శతజయంతి ఉత్సవాలు బుధవారం నుంచి ఈ నెల 27వ తేదీ శివరామక్షేత్ర శ్రవణ సదన వేదిక(రామకోటి)పై నిర్వహిస్తున్నట్లు పీఠం అధ్యక్ష కార్యదర్శులు రంగనాయకి, బుచ్చయ్యాచార్యులు తెలిపారు. మంగళవారం రామకోటిలో కార్యక్రమ కరపత్రాలు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ.. తరతరాల నుంచి సంగీత, సాహిత్యాలు వారసత్వ సంపదగా భాసిల్లుతున్నట్లు తెలిపారు. కృష్ణమాచార్యులు విరబూసిన పారిజాతం లాంటివారని పేర్కొన్నారు. వారి పేరుతో 2002లో కళాపీఠం నెలకొల్పినట్లు చెప్పారు. ఉత్సవాల్లో భాగంగా 23న శతజయంతి ప్రత్యేక సంచిక ఆవిష్కరణ, 26న శతావధాని వారణాసి శివరామకృష్ణ, 27న ప్రఖ్యాత గాత్ర సంగీత విద్వాంసులు డి.రాఘవాచారికి సన్మానం ఉంటుందని వివరించారు. ఏటా నిర్వహించే ఉత్సవాల్లో ఉద్దండులైన 25మందికి సన్మానాలు చేశామన్నారు. ఈ ఐదు రోజులు ఉదయం నుంచి రాత్రి వరకు కృష్ణమాచార్యులు వారి శిష్య, ప్రశిష్యుల సంగీత కచేరీలు ఉంటాయి. కృష్ణమాచార్యులకు సంగీత నీరాజనాలర్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీకేవీ రామానుజాచార్యులు, ఎన్.సి.హెచ్.శ్రీరామచక్రవర్తి, బీవీసీ ఆచార్య, ఎం.లక్ష్మి, రమణ, సి.హెచ్.కృష్ణస్వామి తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న రంగనాయకి, బుచ్చయ్యాచార్యులు తదితరులు

పన్ను చెల్లింపులపై అవగాహన

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : ఆదాయ పన్ను చెల్లింపుపై ఉద్యోగులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆదాయ పన్ను శాఖ అసిస్టెంట్ కమిషనర్ విజయ్‌బాబు పేర్కొన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్) సైతం తప్పనిసరిగా అండర్ సెక్షన్ 139 (1) ప్రకారం తప్పనిసరిగా ఐటీ ఫైల్ చేయాలని తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం మహాత్మాగాంధీ రోడ్డులోని కేడీసీసీ బ్యాంకు ప్రాంతీయ కార్యాలయంలో పీఏసీఎస్ ప్రతినిధులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విజయ్‌బాబు మాట్లాడుతూ.. సహకార సంఘాలు ఐటీ పరిధిలోకి వచ్చాయని చెప్పారు. కార్యదర్శులు తప్పనిసరిగా ఐటీ ఫైల్ చేయాలని, లేని పక్షంలో వారికి అపరాధరుసుం పడుతుందని హెచ్చరించారు. 2018 నుంచి 2023 వరకు ఫైలింగ్ చేయని వారు తప్పనిసరిగా.. అండర్ సెక్షన్ 119 (2) ప్రకారం ఫైల్ చేయాలని కోరారు. సకాలంలో చేసిన వారికి మినహాయింపులు ఉంటాయని తెలియజేశారు. పీఏసీఎస్ ప్రతినిధుల సందేహాలను ఆయన నివృత్తి చేశారు. ఆదాయ పన్ను శాఖాధికారులు బి.ఈశ్వరరావు, పి.అంకమ్మరావు, కేడీసీసీ బ్యాంకు జనరల్ మేనేజర్ ఎన్.రంగబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయ్‌బాబు. వేదికపై అధికారులు ఈశ్వరరావు, అంకమ్మరావు

సీఎం సహాయనిధికి విరాళం

పటమట, న్యూస్‌టుడే: తూర్పు నియోజకవర్గంలో పలు కాలనీల ప్రజలు, వివిధ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు సీఎం సహాయనిధికి అందించిన రూ.25 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, గద్దె క్రాంతి కుమార్ మంగళవారం ఉండవల్లిలోని మంత్రి నారా లోకేశ్‌ని కలిసి అందజేశారు. నియోజకవర్గంలో అభివృద్ధి గురించి మంత్రి అడిగి తెలుసుకున్నారు. వరదల సమయంలో సేవలు అందించిన క్రాంతి కుమార్ అభినందించారు.

కార్మికుల వేతనాలపై కార్పొరేషన్‌కు ఆదేశాలు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ పరిధిలో ఒప్పంద పద్ధతిన విధులు నిర్వహిస్తున్న కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని న్యాయస్థానం సూచించింది. దీనిపై గతంలో ఎంప్లాయీస్ యూనియన్ నాయకుడు ఎ.రంగనాయకులు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, కార్మికులకు సమాన పనికి సమాన వేతం చెల్లించేందుకు కార్పొరేషన్ అధికారులు అంగీకరించారు. ఆపై న్యాయస్థానం ఆదేశాలను అమలు చేయలేదు. దీనిపై న్యాయస్థానం అసహనం వ్యక్తం చేయడంతో పాటు, తమ ఆదేశాలను ధిక్కరించినట్లు గుర్తించింది. తగిన వివరణ ఇవ్వాలని అధికారులకు సూచించింది. అయినా అధికారులు స్పందించకపోవడంతో న్యాయస్థానం గతంలో ఇచ్చిన ఆదేశాలు అమలు చేయాలంటూ రంగనాయకులు తిరిగి కోర్టుని ఆశ్రయించారు. స్పందించిన న్యాయస్థానం 6 వారాల్లో కార్మికుల వేతనాల సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించింది. డైరెక్టర్ ఆఫ్ కమిషనర్ మున్సిపల్ ఎడ్మినిస్ట్రేషన్ ద్వారా బాధ్యులైన అధికారులకు న్యాయస్థానం సూచనలు చేసింది. ఫలితంగా డైరెక్టర్ ఆఫ్ కమిషనర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ నుంచి నగరపాలక సంస్థ కార్యాలయానికి మంగళవారం సర్క్యులర్ జారీ అయ్యింది. ప్రతిగా నగరపాలక సంస్థ అధికారులు న్యాయస్థానానికి హాజరై తమ వాదన వినిపించాల్సి ఉంటుంది.

పార్ట్‌టైం ఉద్యోగం పేరిట మోసం

గృహిణి నుంచి రూ.17 లక్షలు వసూలు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : ఆన్‌లైన్ మోసాలపై పోలీసులు అవగాహన కల్పిస్తున్నా.. అమాయక ప్రజలు సైబర్ నేరగాళ్ల బుట్టలో పడిపోతున్నారు. తాజాగా ఓ గృహిణి రూ.17 లక్షలు పంపి, మోసపోయారు. పటమట ఎన్టీఆర్ సర్కిల్ సమీపంలో ఉండే ఓ యువతి (38) గృహిణిగా ఉన్నారు. ఆమెకు ఆగస్టు 10న గుర్తు తెలియని వాట్సాప్ నంబరు నుంచి ప్రెస్టీజ్ కంపెనీ ప్రతినిధిని అంటూ మేసేజ్ వచ్చింది. పార్ట్ టైం ఉద్యోగం ఉందని, ఒక లింక్ పంపి కొన్ని టాస్క్‌లు ఇచ్చారు. వాటిని పూర్తి చేయగానే.. ఆమె ఖాతాలోకి డబ్బులు వచ్చాయి. తర్వాత వారు మరో లింక్ పంపి, పేరు రిజిస్టర్ చేసుకోమని చెప్పడంతో అలాగే చేశారు. వారు పంపిన పలు టాస్క్‌లు పూర్తిచేశారు. ఈ సారి ఆమె ఖాతాలో ఆదాయానికి బదులు.. నెగిటివ్ బ్యాలెన్స్ చూపడంతో సదరు కంపెనీకి ఫోన్ చేశారు. వారు చెప్పిన మాటలు నమ్మి.. విడతల వారీగా రూ.17లక్షలు పంపారు. చివరికి తాను మోసపోయినట్లు గుర్తించి.. సైబర్ క్రైం పోర్టల్‌లో ఫిర్యాదు చేశారు. విజయవాడ సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరిమిన వరుణుడు

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : నగరంలో మంగళవారం మధ్యాహ్నం అకస్మాత్తుగా కురిసిన వర్షానికి సూర్యారావుపేటలోని ప్రకాశంరోడ్డు మునిగిపోయింది. ఎస్‌బీఐ జోనల్ కార్యాలయం వద్ద భూగర్భ డ్రైనేజీ బ్లాక్ అయ్యి, మురుగునీరు నిలిచిపోయింది. ఒక్కసారిగా జోరున వాన పడడంతో మురుగునీరు పోయే మార్గంలేకుండా పోయింది. దాదాపు గంట సేపు వాహనచోదకులు వర్షం నీటితో కలిసిన మురుగులోనే రాకపోకలు సాగించారు. సాయంత్రం 5 గంటలకు వాన నీరు పోవడంతో సాధారణ పరిస్థితి నెలకొంది. గత కొద్ది రోజులుగా ప్రకాశంరోడ్డులో మురుగునీటి పారుదల సక్రమంగా లేదు. స్థానికులు ఇబ్బందులు పడుతూనే రాకపోకలు సాగిస్తున్నారు. భారీగా వాన పడడంతో.. తీవ్ర ఇక్కట్లకు లోనయ్యారు. అధికారులు యుద్ధప్రాతిపదికపై భూగర్భడ్రైనేజీ సమస్య తీర్చాలని వారు కోరుతున్నారు.



నీటిలోనే రాకపోకలు



మునిగిన ప్రకాశం రోడ్డు

హెచ్‌పీ తొలి ఏఐ ల్యాప్‌టాప్

హెచ్‌పీ ఇండియా తమ తొలి ఏఐ ఆధారిత 2 ఇన్ 1 ల్యాప్‌టాప్‌ను ఆవిష్కరించింది. పేరు ఓమ్నిబుక్ అల్ట్రా ఫ్లిప్. ఇంటెల్‌కు చెందిన లూనార్ లేక్ ప్రాసెసర్, ప్రత్యేక న్యూరల్ ప్రాసెసింగ్ యూనిట్ (ఎన్‌పీయూ) తో కూడిన ఇది సెకనుకు 48 ట్రిలియన్ల ఆపరేషన్స్ చేయగలదు. ఫ్రీలాన్సర్లు, కంటెంట్ క్రియేటర్లను దృష్టిలో పెట్టుకొని దీన్ని రూపొందించారు. 2.8కె ఓఎల్ఈడీ డిస్‌ప్లే గల దీని బ్యాటరీ 21 గంటల వరకూ పనిచేస్తుంది. ల్యాప్‌టాప్, ట్యాబ్లెట్, టెంట్ మోడ్‌ల్లోకి మార్చుకోవచ్చు. ఏఐ జనరేటెడ్ ముప్పులు, సైబర్ దాడులను అడ్డుకోవటానికి రూపొందించిన హెచ్‌పీ వోల్ఫ్ సెక్యూరిటీ అనే ఏఐ భద్రతా వ్యవస్థ రక్షణగా ఉంటుంది. మెరుగైన వర్చువల్ సమావేశాల కోసం 9ఎంపీ ఏఐ కెమెరా, పాలీ ఆడియో జోడించారు. ఎక్లిప్స్ గ్రే, అట్మాస్ఫెరిక్ బ్లూ రంగుల్లో ఉండే అల్ట్రా 7 రకం ప్రారంభ ధర రూ. 1,81,999. అట్మాస్ఫెరిక్ బ్లూ రంగులో వచ్చే అల్ట్రా 9 రకం ధర రూ. 1,91,999. వీటిని హెచ్‌పీ ఆన్‌లైన్ స్టోర్, ఇతర ఆన్‌లైన్ అంగళ్లలో కొనుక్కోవచ్చు.




కొత్తగా ఐప్యాడ్ మినీ

ఐప్యాడ్ మినీ ప్రియులకు శుభవార్త. మూడేళ్ల తర్వాత ఇది కొత్త రూపు సంతరించుకుంది. ఐప్యాడ్ మినీ 2024గా అందుబాటులోకి వచ్చింది. దీన్ని **ఐప్యాడ్ మినీ 7** అనీ పిలుచుకుంటున్నారు. 8.4 అంగుళాల లిక్విడ్ రెటీనా డిస్‌ప్లేతో కూడిన ఇది యాపిల్ ఏ17 ప్రొ చిప్‌సెట్‌తో పనిచేస్తుంది. ఈ చిప్‌సెట్‌తో కొత్త ఐప్యాడ్ మినీకి యాపిల్ ఇంటెలిజెన్స్ తోడైనట్టయ్యింది. దీంతో రైటింగ్ టూల్స్, కస్టమ్ ఎమోజీల వంటివన్నీ వాడుకోవచ్చు. ఇది యాపిల్ పెన్సిల్ ప్రొ టూల్‌నూ సపోర్టు చేస్తుంది. దీంతో బొమ్మలు గీసుకోవచ్చు, రాసుకోవచ్చు. వెనకాల యాపిల్ స్మార్ట్ హెచ్‌డీఆర్ 4 కంప్యూటేషన్లను సపోర్టు చేసే 12ఎంపీ వైడ్ కెమెరా సెన్సర్.. సెల్ఫీలు, వీడియో కాల్స్ కోసం ముందు 12ఎంపీ కెమెరా ఉన్నాయి. స్టోరేజీ కూడా రెట్టింపయ్యింది. 128జీబీ స్టోరేజీ మొదలుకొని 256జీబీ, 512జీబీ రకాలూ అందుబాటులో ఉన్నాయి. మరింత వేగంగా వైఫై ప్రసారానికి వీలుకల్పించే వై-ఫై 6జీని కూడా ఇది సపోర్టు చేస్తుంది. కేవలం వై-ఫై మోడల్ ధర రూ. 49,900. వై-ఫైతో పాటు సెల్యులర్ మోడల్‌కైతే రూ. 64,900 చెల్లించాల్సి ఉంటుంది. బ్లూ, పర్పుల్, స్టార్‌లైట్, స్పేస్ గ్రే రంగుల్లో లభిస్తుంది.

వయసా మరలవే!

వృద్ధాప్యాన్ని ఆపితే? ఆ మాటకొస్తే వెనక్కి తిప్పితే? మనకు అసాధ్యమేమోగానీ శాస్త్రవేత్తలు తలచుకుంటే కానిదేముంది? యాంటీబయాటిక్ మందుల ఆవిష్కరణతో ఇన్‌ఫెక్షన్ మరణాలను గణనీయంగా తగ్గించి, ఫలితంగా జీవనకాలాన్నీ పెంచిన శాస్త్రరంగం ఇప్పుడు ఆయుష్షను పెంచటం మీదా దృష్టి సారించింది. వయసు మీరే ప్రక్రియను అర్థం చేసుకునే దిశగా పురోగతీ సాధించింది. వ్యాధి కారక కణాలను నిర్మూలించగల మాత్రలను కనుగొనటం దగ్గరి నుంచి జెల్లీఫిష్ పునరుజ్జీవనం వెనక రహస్యాలను ఛేదించటం వరకూ శాస్త్రవేత్తలు ఎన్నెన్నో ప్రయత్నాలు చేస్తున్నారు. వాన పాములు, కోతుల వంటి జంతువులను ఎక్కువకాలం ఆరోగ్యంగా జీవించేలా చేయగలుగుతున్నారు. ప్రస్తుతానికి చాలా పరిశోధనలు ఎలుకల వరకే పరిమితమైనప్పటికీ వీటిల్లో కొన్నయినా త్వరలోనే మనుషుల మీద ప్రయోగ పరీక్షల దశకు చేరుకోవచ్చని ఆశిస్తున్నారు. అన్నీ సవ్యంగా సాగితే మరో పదేళ్లలోనే వీటి ఫలితాలను చవి చూసినా ఆశ్చర్యపోనవసరం లేదు. మరణాన్ని జయించ లేకపోయినా ఎక్కువకాలం ఆరోగ్యంగా జీవించొచ్చన్నది నిస్సందేహం. అలాంటి కొన్ని ప్రయత్నాలు ఇవిగో..



వృద్ధ కణాల ఊడ్చివేత

శరీరం వెలుపల కణ విభజన నిరంతరం కొనసాగుతుందని ఒకప్పుడు భావించేవారు. అయితే 50 సార్లు విభజన చెందిన తర్వాత, ఈ ప్రక్రియ ఆగిపోతున్నట్టు లియొనార్డ్ హేఫ్లిక్ 1961లో గుర్తించారు. ఇవి వృద్ధాప్యానికి చేరుకుంటున్నట్టు బయటపడింది. మనుషులు, జంతువుల్లోనూ ఇవి వృద్ధాప్యానికి కారణమవుతున్నాయా? దీనికి అవుననే సమాధానం వస్తోంది. వయసు మీద పడుతున్నకొద్దీ శరీరంలో ఇలాంటి కణాలు పోగుపడుతూ వస్తుంటాయి. మంచి విషయం ఏంటంటే- వీటిని ఊడ్చివేసే, నిర్మూలించే మందులను ఆవిష్కరించటం. డాసాటినిబ్ అనే కీమోథెరపీ మందు.. పండ్లు, కూరగాయల్లోని క్వెర్‌సెటిన్ అనే రుచి కారకం ఎలుకల్లో 'వృద్ధ' కణాలను నిర్మూలించి, మంచి ఆరోగ్యంతో ఎక్కువ కాలం జీవించేలా చేస్తున్నట్టు బయటపడింది. క్యాన్సర్, గుండెజబ్బుల వంటి వ్యాధుల నివారణకే కాకుండా శరీరానికి ఇంకాస్త బలాన్నీ ఇస్తున్నట్టు వెల్లడైంది. కంపెనీలు ఇలాంటి మరికొన్ని మందులను రూపొందించటం మీదా దృష్టి సారించాయి. వీటిల్లో ఏది సఫలమైనా వయో ప్రక్రియను ఆపే దిశగా కొత్త ముందడుగు పడినట్టే.

ఐస్‌లాండ్‌లో అద్భుత మందు

భారీ రాతి బొమ్మలకు నిలయమైన ఐస్‌లాండ్ అద్భుతమైన మందునూ ప్రసాదించింది. అదే రాపామైసిన్. దీన్ని 60ల్లో అక్కడి నేలలో గుర్తించారు. బ్యాక్టీరియా జాతులతో పుట్టుకొచ్చే ఇది క్యాన్సర్ చికిత్సలకు, రోగనిరోధకశక్తిని అణచి పెట్టటానికి తోడ్పడుతుంది. అంతేకాదు.. గతి తప్పిన ప్రొటీన్లనూ అడ్డుకుంటుంది. మన శరీరం సజావుగా పని చేయటానికి తోడ్పడే ప్రొటీన్లు గతి తప్పితే విషతుల్యాలుగా మారతాయి. అదృష్టం కొద్దీ మన శరీరంలో స్వీయ భక్షణ (ఆటోఫేజీ) ప్రక్రియ కొన సాగుతూ ఉంటుంది. దీని మూలంగానే కణాలు గతి తప్పిన అణువులను దారిలోకి తేవటం, సరికొత్తగా తయారుచేయటం సాధ్యమవుతోంది. ఇక్కడే రాపామైసిన్ ప్రాధాన్యం సంతరించుకుంటోంది. ఇది గతి తప్పిన ప్రొటీన్లను ఊడ్చి వేయటానికి కణాలకు తగిన శక్తిని ప్రసాదిస్తుంది. ఇలా వయో ప్రక్రియను అడ్డుకుంటుంది. ఇది ఎలుకల్లో 20% వరకూ ఆయుష్షను పెంచినట్టు ప్రయోగ పరీక్షల్లో బయటపడింది. గుండె, చిగుళ్ల జబ్బుల వంటి వాటినీ తగ్గిస్తున్నట్టు వెల్లడైంది. ఈస్ట్, నేలపాములు, ఈగల జీవనకాలాన్నీ పెంచుతున్నట్టు తేలింది. వృద్ధుల్లోనూ రాపామైసిన్ ఇలాంటి ప్రభావమే చూపుతుండటం విశేషం.

శిశువుల్లో దాగిన రహస్యం

శిశు జననం అద్భుతమైన ప్రక్రియ. జీవ నిర్మాణం ఏదో ఒక స్థాయిలో వృద్ధాప్య ప్రక్రియను వెనక్కి మళ్లించిందనటానికిదో నిదర్శనమనీ చెప్పుకోవచ్చు. ఎందుకంటే తల్లిదండ్రుల నుంచి సంక్రమించిన కణాలతోనే పిండం అభివృద్ధి చెందుతుంది. అంటే వారిలోని పాత కణాలు తిరిగి తొలి వయసు నుంచి పురుడు పోసుకుంటున్నాయన్న మాట. వివిధ రకాల ప్రాణుల్లో అంతగా క్షీణించకుండా తరతరాలుగా, లక్షలాది ఏళ్లుగా కొనసాగుతూ వస్తుండటం విశేషం. పిల్లల్లో ఇదెలా సంభవమో తెలుసుకుంటే పెద్దవారిలోనూ వయో ప్రక్రియను నిలువరించొచ్చా? టురిటోప్సిస్ డోర్నీ అనే 'అమర' జెల్లీఫిష్‌లు దీన్ని సాధించనట్టే కనిపిస్తోంది. ఇవి ఒత్తిడికి గురైనప్పుడు తమ వయో ప్రక్రియను శిశు దశకు మళ్లిస్తాయి. తిరిగి మొదటి నుంచీ పునరుజ్జీవం చెందుతాయి. ఇలా ఎన్నిసార్లయినా చేస్తాయి కూడా. వయసును వెనక్కి మళ్లించటమనేది జీవనశాస్త్ర నియమాలకు విరుద్ధం కాదనే సంగతిని ఇవి రుజువు చేస్తున్నాయి. మనుషుల్లోనూ ఇది సాధ్యమైతే? పరిపక్వ కణాల్లో గడియారాన్ని వెనక్కి తిప్పొచ్చని 2012 నోబెల్ గ్రహీత ప్రొఫెసర్ షిన్యా ఎమనక, ప్రొఫెసర్ జాన్ గుర్డాన్ నిరూపించారు కూడా. కేవలం నాలుగు జన్యువులతోనే ఇది సాధ్యమవుతున్నట్టు, ఇవి పాత కణాలను తిరిగి మూల కణాలుగా మారుస్తున్నట్టు తేలింది. ఈ ప్రక్రియను మనుషులకు ఎలా వర్తింపజేయొచ్చనేది ఇంకా తెలియనప్పటికీ అమెజాన్ సంస్థకు చెందిన ఆల్టోస్ ల్యాబ్ దీని మీద గట్టిగానే కృషి చేస్తోంది. ఎలుకల్లో జీవనకాలం 25% పెరిగినట్టు ప్రాథమిక ఫలితాలు చెబుతున్నాయి. పూర్తిస్థాయి ఫలితాలు వెలువడితే అది గొప్ప విషయమే కాగలదు.

ఇప్పటికే ఉన్న ఔషధాలతోనూ..

ఇతర జబ్బులకు వాడుతున్న కొన్ని ఔషధాలూ వయో ప్రక్రియను అడ్డుకోవటం గమనార్హం. ఉదాహరణకు- మధుమేహానికి వాడే ఎస్‌జీఎల్‌టీ-2 ఇన్‌హిబిటార్స్ రకానికి చెందిన కానాగ్లిఫ్లోజిన్, డాపాగ్లిఫ్లోజిన్, ఎంపాగ్లిఫ్లోజిన్‌లనే చూడండి. ఇవి గ్లూకోజును తగ్గించటంతో పాటు మొత్తంగా ఆరోగ్యాన్ని మెరుగు పరచే పనినీ చేపడుతున్నాయి. ఇలా ఆయుష్ష పెరిగేలా చేస్తున్నాయి. కానాగ్లిఫ్లోజిన్ ఎలుకల్లో 14% వరకు జీవనకాలాన్ని పొడిగిస్తున్నట్టు వెల్లడైంది. గ్లూకోజును తగ్గించే మెట్‌ఫార్మిన్, అకార్బోస్.. ఎముకల పటుత్వాన్ని కాపాడే బిస్‌ఫాస్ఫేట్ రకం మందులు సైతం మంచి ఫలితం చూపుతున్నాయి. బరువు తగ్గటానికి కొత్తగా అందుబాటులోకి వచ్చిన సెమాగ్లుటైడ్ కూడా ఆశలు రేపుతోంది. ఇది తక్కువ ఆహారం తినేలా చేయటం ద్వారా జంతువుల్లో జీవనకాలాన్ని పెంచుతున్నట్టు బయట పడింది. ఈ మందులు ఇప్పటికే అందు బాటులో ఉండటం మరింత ఆసక్తి కరమైన విషయం.

ఔషధాలను మిళితం చేసి..

ఒక్కో మందుతోనే సమర్థ ఫలితాలు కనిపిస్తున్నప్పుడు అన్నింటికీ కలిపితే? శాస్త్రవేత్తలు ఈ దిశగానూ ప్రయత్నించారు. రాపామైసిన్, అకార్బోస్ మందుల కలయిక మంచి ప్రభావం చూపిస్తున్నట్టు తేలింది. వీటి సాయంతోనే ఒక ఎలుక ప్రస్తుతం ఎక్కువకాలం జీవిస్తున్న మూషిక రికార్డును కొట్టేసింది. రాపామైసిన్ రక్తంలో గ్లూకోజు మోతాదులను అస్తవ్యస్తం చేస్తుంది. దీన్ని అడ్డుకోవటానికే అకార్బోస్‌ను జోడించారు. వీటి కలయికతో మగ ఎలుకల్లో 40%, ఆడ ఎలుకల్లో 30% జీవనకాలం పెరగటం విశేషం. రాపామైసిన్, వృద్ధ కణాలను నిర్మూలించే మందు, డీఎన్‌ఏ మీది రక్షణ టోపీలను బలోపేతం చేసే చికిత్స, ఎముక మజ్జ మార్పిడి.. ఇలా నాలుగు పద్ధతులను మేళవించీ శాస్త్రవేత్తలు ప్రయోగాలు నిర్వహించారు. ఇదీ ఆయుష్షను పెంచుతున్నట్టు తేలింది.

its@eenadu.in
ఈ-నాడు

పాట రాసి.. బాణీ కట్టి..

సంగీతాన్ని సృష్టించటంలో సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతోంది. కృత్రిమ మేధ (ఏఐ) రాకతో ఇది మరింత పుంజుకుంది. అతి సులభంగా నిమిషాల్లోనే సంగీతాన్ని సృష్టించటానికి వీలు కల్పిస్తోంది. కేవలం వాయిద్యాలతోనే కాదు, కావాలంటే పాటలనూ రాసిపెట్టే స్థాయికి చేరుకుంది. ఇందుకు ఓ మంచి ఉదాహరణ **ట్యాడ్ ఏఐ** (https://tad.ai) ఇదో ఆన్‌లైన్ ఏఐ సాంగ్ జనరేటర్. సులభంగా ఒరిజినల్ సంగీతాన్ని సృష్టించటం దీని ప్రత్యేకత. యూజర్ ఇచ్చిన ఇన్‌పుట్స్ (ప్రాంప్ట్స్)ను విశ్లేషించి పాట శీర్షిక, అంశాలను సూచిస్తుంది. తనే ప్రత్యేకమైన బాణీలు సమకూర్చుతుంది. ఇది మెషిన్ లెర్నింగ్ ఆల్గోరిథమ్‌ల సాయంతో అప్పటికే పెద్దమొత్తంలో ఉన్న సంగీతాన్ని విశ్లేషించుకొని వివిధ రీతులను, శైలులను నేర్చుకుంటుంది. అందువల్ల యూజర్ ఇన్‌పుట్స్ సాయంతో ఒరిజినల్ బాణీలను సృష్టిస్తుంది. సంగీతం మాస్టార్లు తమ కొత్త పాటలకు ఆధారాలు, ఐడియాల కోసం ట్యాడ్ ఏఐని వాడుకోవచ్చు. సంగీత పరిజ్ఞానం అంతగా లేనివారికీ ఉపయోగపడుతుంది. పెద్దగా శిక్షణ తీసుకోకున్నా, వాయిద్యాల వంటి వనరులు లేకున్నా కేవలం పదాల సూచనలతోనే కోరుకున్న మ్యూజిక్ ట్రాక్స్‌ను సృష్టించుకోవచ్చు. అదీ కొద్ది నిమిషాల్లోనే. మధ్యలో ఏదైనా అవాంతరం వచ్చినా, ఎలాంటి బాణీ కావాలో తేల్చుకోకపోయినా ఇది సాయం చేస్తుంది. కొత్త సంగీత ఐడియాలను, జానర్లను ముందుంచుతుంది.

ఎలా వాడుకోవాలి?

- ముందుగా https://tad.ai లోకి వెళ్లాలి. ఖాతాను సృష్టించుకోవాలి. గూగుల్ ఖాతాతోనైనా సైన్‌ఇన్ కావొచ్చు.
- హోం పేజీలో జనరేట్ ఏఐ సాంగ్స్ ఫర్ ఫ్రీ అనే బాక్సు మీద క్లిక్ చేయాలి.
- ఎడమ వైపున సాంగ్ టైటిల్ బాక్సులో పాటకు శీర్షిక పెట్టుకోవాలి.
- లిరిక్స్ బాక్సులోకి వెళ్లి పాటను



రాయాలి. రాయటం రాకపోతే ఏఐ జనరేట్ ఆప్షన్‌ను ఎంచుకోవాలి.
- ఎలాంటి జానర్, మూడ్ అవసరమో నిర్ణయించుకోవాలి.
- అనంతరం క్రియేట్ బటన్ మీద క్లిక్ చేయాలి. అంతే. ఇచ్చిన సమాచారాన్ని ఏఐ విశ్లేషించి నిమిషాల్లో ప్రత్యేకమైన పాటను బాణీతో సహా క్రియేట్ చేసి పెడుతుంది.
- తర్వాత ఆ పాటను వినొచ్చు. నచ్చినట్టుగా వస్తే ట్రాక్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఒకవేళ నచ్చకపోతే ఇన్‌పుట్స్‌ను సవరించుకొని, తిరిగి కొత్తది సృష్టించుకోవచ్చు. ఈ ప్రక్రియ కొద్ది నిమిషాల్లోనే పూర్తవుతుంది కాబట్టి తక్కువ సమయంలోనే బోలెడన్ని పాటలను క్రియేట్ చేసుకోవచ్చు.

వాట్సప్‌లో ఛాట్ రికార్డింగ్

వాట్సప్‌లోని మెటా ఏఐ పర్సనల్ అసిస్టెంట్‌గా బాగా ఉపయోగపడుతోంది. సందేహాలకు సమాధానాలిస్తూ చాలా విషయాల్లో చేదోడుగా నిలుస్తోంది. దీనికి కొత్తగా ఛాట్ మెమరీ ఫీచర్ జత కానుంది. మనం మెటాకు అందించిన అవసరమైన మొత్తం సమాచారాన్ని రికార్డు చేయటం దీని ప్రత్యేకత. ఇలా ఇది మరింత మెరుగైన పర్సనల్ అసిస్టెంట్‌గా తోడుంటుంది. ఉదాహరణకు- యూజర్ శాకాహారి అని అది గుర్తించిందనుకోండి. ఆ వంటకాలనే సూచిస్తుంది. ప్రస్తుతానికి ఈ ఫీచర్ అభివృద్ధి దశలోనే ఉంది. ఇష్టా యిష్టాలను బట్టి పనిచేసే దీన్ని త్వరలోనే కొందరు యూజర్లు పరీక్షించటానికి అందుబాటులోకి తేవొచ్చని భావిస్తున్నారు.

మరిన్ని కథనాల కోసం చూడండి. https://epaper.eenadu.net

ఈనాడు ప్రతిభ
pratibha.eenadu.net/eenadupratibha.net
విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

కరెంట్ అఫైర్స్

■ ఇండియన్ కోస్ట్‌గార్డ్ (ఐసీజీ) దేశీయంగా అభివృద్ధి చేసిన భారత దేశపు మొట్టమొదటి కాలుష్య నియంత్రణ నౌక ఏది? (2024 ఆగస్టు 29న ఈ నౌకను గోవాలో ప్రారంభించారు. గోవా షిప్‌యార్డు లిమిటెడ్ (జీఎస్ఎల్) నిర్మించిన ఈ నౌక పొడవు 114.5 మీటర్లు, వెడల్పు 16.5 మీటర్లు, బరువు



మాదిరి ప్రశ్నలు

4170 టన్నులు.) జ: సముద్ర ప్రతాప్

■ 2023-24 ఆర్థిక సంవత్సరంలో లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) భారత ప్రభుత్వానికి ఎంత మొత్తంలో డివిడెండ్‌ను చెల్లించింది? (ఎల్ఐసీలో 96.5 శాతం మెజారిటీ వాటాను కలిగి ఉన్న భారత ప్రభుత్వం, ఎల్ఐసీ వార్షిక రాబడిలో భాగంగా ఈ డివిడెండ్ చెల్లింపును పొందింది.) జ: రూ. 6,103.62 కోట్లు

■ ఎస్ఏఎఫ్ఎఫ్ (సౌత్ ఏషియన్ ఫుట్‌బాల్ ఫెడరేషన్) అండర్ - 20 ఫుట్‌బాల్ ఛాంపియన్ షిప్ 2024 టైటిల్ విజేతగా ఏ జట్టు నిలిచింది? (ఈ టైటిల్‌ను గెలవడం ఈ జట్టుకు ఇదే తొలిసారి. ఆతిథ్య నేపాల్ జట్టు పై ఈ జట్టు ఫైనల్లో 4-1 గోల్స్ తేడాతో విజయం సాధించింది. ఈ టోర్నీలో పాల్గొన్న 6 జట్లు: భారత్, నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక, మాల్దీవులు, భూటాన్.) జ: బంగ్లాదేశ్

మరింత సమాచారం

ప్రిపరేషన్ టెక్నిక్

చదివిన పాఠాన్ని, నేర్చుకున్న అంశాలను స్నేహితులకు బోధించాలి. ఆ విధంగా ఇతరులకు వివరించడం ద్వారా విషయంపై అవగాహన పెరుగుతుంది. మౌలికాంశాలపై పట్టు మరింత బలోపేతం అవుతుంది.

డీఎస్సీ-2024
బయాలజీ మెథడాలజీ

స్థిరం.. సులభం.. సరళం!

ఎవరికైనా అప్పు ఇస్తే కొంత కాలానికి అసలుతోపాటు అదనంగా కొంత సొమ్ము అందుతుంది. బ్యాంకులో డబ్బు డిపాజిట్ చేస్తే, అకౌంట్‌లో మొత్తం కొద్దికొద్దిగా పెరుగుతూ ఉంటుంది. ఆ అదనాన్ని, ఈ పెరుగుదలను వడ్డీ అంటారు. ఇందులో అనేక రకాలు ఉన్నప్పటికీ ముందుగా గుర్తుకు వచ్చేది బారువడ్డీ. దీనినే సాధారణ వడ్డీ లేదా సరళ వడ్డీ అని కూడా అంటారు. వడ్డీ రేటు స్థిరంగా ఉండే దీనిని లెక్కించడం సులభం. అభ్యర్థుల్లో ఆర్థికపరమైన లెక్కల ప్రాథమిక పరిజ్ఞానాన్ని అంచనా వేయడానికి పోటీ పరీక్షల్లో వీటిపై ప్రశ్నలు అడుగుతుంటారు. శాతాలు, గుణకార, భాగహారాలపై పట్టు పెంచుకుంటే ఈ లెక్కలను వేగంగా చేయవచ్చు.





జనరల్ స్టడీస్ అరిథ్‌మెటిక్

బారు వడ్డీ

అసలు: కొంత కాలానికి అప్పు తెచ్చుకున్న సొమ్మును అసలు (P) అని అంటారు.

వడ్డీ (Interest): అప్పు తెచ్చుకున్న వ్యక్తి తాను తీసుకున్న సొమ్మును వాడుకున్నందుకు, అప్పు ఇచ్చిన వ్యక్తికి కొంత సొమ్మును (అసలు కాకుండా) అదనంగా చెల్లిస్తాడు. దాన్నే వడ్డీ అని అంటారు.

వడ్డీ రెండు రకాలు

1) బారు వడ్డీ
2) చక్ర వడ్డీ

బారు వడ్డీ (Simple Interest)

ఎంత కాలానికైనా వడ్డీని అసలు పైనే లెక్కగడితే అలాంటి వడ్డీని 'బారు వడ్డీ' అని అంటారు.

సంవత్సరానికి వడ్డీ రేటు (%): దీన్ని ముందుగానే ఒక షరతు మీద ఆధారపడి నిర్ణయించి వడ్డీని లెక్కగడతారు.

కాల వ్యవధి: అప్పును ఎంత కాలానికైతే తీసుకుంటామో దాన్ని 'కాల వ్యవధి' అని అంటారు.

మొత్తం సొమ్ము = అసలు + బారు వడ్డీ

అసలు = P, వడ్డీరేటు = R% సంవత్సరానికి

కాలం = T, మొత్తం = A అనుకుంటే

బారువడ్డీ $(S.I.) = \frac{PTR}{100}$

$A = P + S.I.$

$A = P + \frac{PTR}{100} = P\left(1 + \frac{TR}{100}\right)$

ముఖ్యమైన అంశాలు:

$SI = \frac{PTR}{100}$; $T = \frac{SI.100}{PR}$

$R = \frac{SI.100}{PT}$; $P = \frac{SI.100}{TR}$

మాదిరి ప్రశ్నలు

1. సంవత్సరానికి 12% చొప్పున నిర్దిష్ట మొత్తంపై సంపాదించిన సాధారణ వడ్డీ ఆరు సంవత్సరాల్లో రూ. 10,800 అయితే మొత్తం ఎంత?

1) రూ.21,000 2) రూ.18,000
3) రూ.15,000 4) రూ.12,000

వివరణ: అసలు = P

సంవత్సరానికి అయ్యే వడ్డీ శాతం = 12%

∴ 6 సంవత్సరాలకు అయ్యే వడ్డీ శాతం = 72%

6 సంవత్సరాల్లో అయ్యే వడ్డీ రూపాయల్లో 10,800

∴ 72% ... 10,800, 100% ... ?

$\frac{100}{72} \times 10,800$ = రూ.15,000 **జ: 3**

2. అరవింద్ తన కుమారుడికి ఆరేళ్ల వయసులో సంవత్సరానికి 15% సాధారణ వడ్డీ మీద కొంత సొమ్మును బ్యాంకులో డిపాజిట్ చేశాడు. తన కుమారుడికి 12 ఏళ్లు వచ్చేటప్పటికి ఆ బ్యాంకులో సొమ్ము రూ.37,240 అయ్యింది. అయితే అరవింద్ బ్యాంకులో డిపాజిట్ చేసిన సొమ్ము ఎంత?

1) రూ.11,500 2) రూ.16,900
3) రూ.19,600 4) ఏదీకాదు

వివరణ: అసలు (P) = 100% అనుకుంటే బ్యాంకులో ఆ సొమ్మును 6 సంవత్సరాలు ఉంచాడు.

∴ సంవత్సరానికి అయ్యే వడ్డీ = 15%

6 ఏళ్లకు అయ్యే వడ్డీ = 6 × 15% = 90%

మొత్తం = అసలు + వడ్డీ

= 100% + 90% = 190%

లెక్క ప్రకారం

∴ 190% ... 37,240, 100% ... ?

$\frac{100}{190} \times 37,240$ = రూ.19,600 **జ: 3**

3. ఒక వ్యక్తి మూడేళ్లపాటు నిర్దిష్ట మొత్తాన్ని, నిర్దిష్ట సాధారణ వడ్డీరేటు చొప్పున పెట్టుబడి పెట్టాడు. అయితే ఇప్పుడున్న సాధారణ వడ్డీరేటు కంటే 4% పాయింట్లు ఎక్కువ సాధారణ వడ్డీకి పెట్టుబడి పెట్టినట్లయితే రూ.96 ఎక్కువ లాభం వస్తే, అతడి పెట్టుబడి ఎంత?

1) రూ.2,400 2) రూ.1,600
3) రూ.400 4) రూ.800

వివరణ: పెట్టుబడి (లేదా) అసలు = రూ.x

వడ్డీరేటు = r% అనుకుంటే

లెక్కప్రకారం వడ్డీరేటును 4% పాయింట్లు పెంచితే రూ.96 అదనంగా లాభం వస్తుంది.

$\therefore \frac{x \times 3 \times (r+4)}{100} - \frac{x \times 3 \times r}{100} = 96$

$= \frac{3xr + 12x - 3xr}{100} = 96$

$\therefore 12x = 96 \times 100 \Rightarrow x$ = రూ.800

పెట్టుబడి (x) = రూ.800 **జ: 4**

4. ఒక నిర్దిష్ట మొత్తంలో 25% సొమ్మును సంవత్సరానికి 12% సాధారణ వడ్డీకి, 50% సొమ్మును 8% వడ్డీకి, మిగిలిన సొమ్మును 6% చొప్పున రుణంగా ఇచ్చారు. అయితే ఆ మొత్తానికి సంవత్సరానికి సాధారణ వడ్డీ సుమారు ప్రభావవంతమైన రేటు ఎంత?

1) 8% 2) 9% 3) 7.5% 4) 8.5%

వివరణ: అసలు (P) = x అనుకుంటే

లెక్కప్రకారం ఆ అసలులో 25% సొమ్ముకు 12%; 50% సొమ్ముకు 8%; మిగిలిన 25% సొమ్ముకు 6% వడ్డీరేటు చొప్పున రుణంగా ఇచ్చారు.

$\therefore \left(\frac{25x}{100} \times \frac{12}{100}\right) + \left(\frac{50x}{100} \times \frac{8}{100}\right) + \left(\frac{25x}{100} \times \frac{6}{100}\right) = \frac{x \times 1 \times R}{100}$

$= \frac{3x}{100} + \frac{x}{25} + \frac{3x}{200} = \frac{Rx}{100}$

$= \frac{6x + 8x + 3x}{200} = \frac{Rx}{100}$

$\Rightarrow \frac{17x}{200} = \frac{Rx}{100} \Rightarrow R = \frac{17}{2} \Rightarrow 8.5\%$ **జ: 4**

5. హేమంత్ ఒక వ్యక్తి నుంచి సంవత్సరానికి 12% వడ్డీరేటుపై (సాధారణ వడ్డీ మీద) రూ.15,000 అప్పుగా తీసుకున్నాడు. ఆ తర్వాత దానిలో రూ.8,000 లను నగేశ్‌కు సంవత్సరానికి 15% సాధారణ వడ్డీకి అప్పుగా ఇచ్చాడు. మిగిలిన మొత్తాన్ని ....% వడ్డీరేటు చొప్పున రాజుకు అప్పుగా ఇచ్చాడు. హేమంత్ ఆ ఇద్దరి వద్ద నుంచి రూ.1,980 సాధారణ వడ్డీని మూడు సంవత్సరాలకు పొందితే, మూడేళ్ల తరువాత హేమంత్ చెల్లించాల్సిన మొత్తం వరుసగా....

1) 15% రూ.2,500 2) 16% రూ.4,800
3) 18% రూ.5,400 4) 20% రూ.6,600

వివరణ: హేమంత్ అప్పుగా తీసుకున్న అసలు రూ.15,000

నగేష్ రూ.8,000 15% ; రాజు రూ.7,000 r% అనుకుంటే

లెక్క ప్రకారం $8,000\left(1 + \frac{3 \times 15}{100}\right) + 7000\left(1 + \frac{3r}{100}\right) - 15,000\left(1 + \frac{3 \times 12}{100}\right)$

$= 1,980$

$= 11,600 + 7,000\left(1 + \frac{3r}{100}\right) - 20,400$

$= 1,980$

$7,000\left(1 + \frac{3r}{100}\right) = 1,980 + 8,800$

$1 + \frac{3r}{100} = \frac{10,780}{7,000}$

$\frac{3r}{100} = \frac{10,780}{7,000} - 1$

$\frac{3r}{100} = \frac{10,780 - 7,000}{7,000}$

$\frac{3r}{100} = \frac{3,780}{7,000} \Rightarrow 3r = 54$

$r = 18\%$

∴ 3 సంవత్సరాల తరువాత హేమంత్ చెల్లించిన వడ్డీ

$= \frac{3 \times 12 \times 15,000}{100}$

$= 3 \times 12 \times 150$

= రూ.5,400 **జ: 3**



రచయిత: డాక్టర్ కంచుమర్తి దొర

పదోతరగతి

గణితం



వర్గబహుపది కనుక్కుంటారా..!

ప్రశ్నలు జవాబులు

2 మార్కులు **బహుపదులు**

1) ఒక వర్గ బహుపది శూన్యాల మొత్తం, లబ్ధం వరుసగా −3, 2 అయితే ఆ వర్గబహుపదిని కనుక్కోండి.

సాధన: ఆ బహుపది శూన్యాలు α, β అనుకోండి.

$\alpha + \beta = -3, \alpha.\beta = 2$ అని ఇచ్చారు.

కావాల్సిన వర్గ బహుపది $p(x) = k[x^2 - (\alpha + \beta)x + \alpha.\beta]$, 'k' ఒక వాస్తవ సంఖ్య.

$\Rightarrow k[x^2 - (-3)x + 2] \Rightarrow k = 1$ విలువకు బహుపది $x^2 + 3x + 2$.

2) ఒక వర్గ బహుపది శూన్యాల మొత్తం, లబ్ధం వరుసగా $\frac{1}{4}$, −1 అయితే ఆ వర్గబహుపదిని కనుక్కోండి.

సాధన: ఆ బహుపది శూన్యాలు α, β అనుకుంటే.

$\alpha + \beta = \frac{1}{4}, \alpha.\beta = -1$

కావాల్సిన వర్గ బహుపది $p(x) = k[x^2 - (\alpha + \beta)x + \alpha.\beta]$, 'k' ఒక వాస్తవ సంఖ్య.

$\Rightarrow k\left[x^2 - \left(\frac{1}{4}\right)x + (-1)\right] \Rightarrow k\left(\frac{4x^2 - x - 4}{4}\right)$

$k = 4$, విలువకు బహుపది $4x^2 - x - 4$.

3) ఒక వర్గ బహుపది శూన్యాల మొత్తం, లబ్ధం వరుసగా $\sqrt{2}$, $\frac{1}{3}$ అయితే ఆ వర్గ బహుపదిని కనుక్కోండి.

సాధన: ఆ బహుపది శూన్యాలు α, β అనుకుంటే.

$\alpha + \beta = \sqrt{2}, \alpha.\beta = \frac{1}{3}$

కావాల్సిన వర్గ బహుపది $p(x) = k[x^2 - (\alpha + \beta)x + \alpha.\beta]$, 'k' ఒక వాస్తవ సంఖ్య.

$\Rightarrow k\left[x^2 - (\sqrt{2})x + \left(\frac{1}{3}\right)\right] \Rightarrow k\left(\frac{3x^2 - 3\sqrt{2}x + 1}{3}\right)$

$k = 3$, విలువకు బహుపది $3x^2 - 3\sqrt{2}x + 1$.

ముఖ్యమైనవి మరికొన్ని.. (4 మార్కులు)

1) బహుపది $6x^2 - 3 - 7x$ యొక్క శూన్యాలను కనుక్కొని, బహుపది శూన్యాలకు, గుణకాలకు మధ్య ఉన్న సంబంధాన్ని సరిచూడండి.

2) బహుపది $t^2 - 15$ యొక్క శూన్యాలను కనుక్కొని, బహుపది శూన్యాలకు, గుణకాలకు మధ్య ఉన్న సంబంధాన్ని సరిచూడండి.

జవాబుల కోసం

- డాక్టర్ టీఎస్‌వీఎస్ సూర్యనారాయణ మూర్తి

తనను తాను

మనువాడిన బ్రిట్నీ!



మిసిసిపీ: అమెరికన్ పాప్‌స్టార్ బ్రిట్నీ స్పియర్స్ (42) గత ఆదివారం ఇన్‌స్టాగ్రాం వేదికగా పంచుకొన్న ఓ పోస్టు అందరినీ కలవరపాటుకు గురిచేసింది. 30 ఏళ్ల శాం అస్గరీతో 14 నెలలు కొనసాగిన బ్రిట్నీ వివాహబంధం ఇటీవలే ముగిసింది. గత మే నెలలో ఈ జంట విడాకుల ఒప్పందానికి వచ్చింది. ఈ నేపథ్యంలో పెళ్లిగౌను ధరించి బ్రిట్నీ ఇన్‌స్టాలో చేసిన పోస్టు అభిమానులను ఆశ్చర్యపరుస్తోంది. "నన్ను నేను పెళ్లి చేసుకున్నా. ఇది తెలివితక్కువ పనిగా మీకు అనిపించవచ్చు. కానీ, నా జీవితంలో నేను చేసిన అద్భుతమైన పనిగా దీన్ని భావిస్తున్నా" అంటూ ఆమె రాసుకొచ్చారు. ఈ పోస్టుతోపాటు పంచుకొన్న వీడియోలో నవవధువులా నిలబడిన బ్రిట్నీ పక్కన వరుడు ఎవరూ లేరు. ఎటువంటి వివరణ లేకుండా ఖాళీగా ఉన్న చర్చి ఫొటో షేర్ చేసింది. ఒంటరిగా హనీమూన్‌కు బయలుదేరుతున్నట్లు విమానం పక్కన నిలబడి ఉన్న మరో పోస్టులో "టర్క్స్ అండ్ కేకస్, ఇదిగో నేను వచ్చేశా" అని బ్రిట్నీ వ్యాఖ్య జోడించింది. టర్క్స్ అండ్ కేకస్ దీవులు అట్లాంటిక్ సముద్రంలో ఉన్నాయి.

మరో 80 విమానాలకు బాంబు బెదిరింపులు

దిల్లీ: విమానయాన సంస్థలకు గత కొద్దిరోజులుగా వస్తున్న బాంబు బెదిరింపులు ఆగడంలేదు. సోమవారం నుంచి మంగళవారం మధ్య 24 గంటల్లో దాదాపు 80 జాతీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులకు హెచ్చరికలు వచ్చాయని 'బాంబు బెదిరింపుల మూల్యాంకన కమిటీ ప్రకటించింది. దీంతో 24 గంటల్లో బెదిరింపులు అందుకున్న విమానాల సంఖ్య 80కి చేరుకుంది. గత తొమ్మిది రోజుల్లో 170 విమానాలకు కలిగిన అంతరాయం వల్ల రూ.600 కోట్ల నష్టం వాటిల్లి ఉంటుందని అధికారులు తెలిపారు.



వైఫల్యాల తర్వాత బలంగా పుంజుకోండి

జీవితం అంటే వైఫల్యాలను తప్పించుకోవడం కాదు! ఎన్ని వైఫల్యాలు ఎదురైనా తిరిగి బలంగా పుంజుకోవడం!! గెలుపు, ఓటమి అనేవి ఒకే నాణేనికి ఉన్న రెండు ముఖాల వంటివి. ఓటమికి వెరవకుండా, ప్రతిరోజూ మిమ్మల్ని మీరు మెరుగుపరుచుకుంటూ ముందుకెళ్లండి.

– డేవిడ్ లవ్‌జాయ్, పాడ్‌కాస్టర్



పెన్సిల్వేనియా గెలవాల్సిందే!

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో కీలకంగా మారిన రాష్ట్రం



1 శాతం అటూఇటూ..

2016 ఎన్నికల్లో ట్రంప్ కేవలం 1శాతం ఓట్లతో పెన్సిల్వేనియాలో విజయం సాధించారు. అదే 1 శాతం ఓట్ల తేడాతో 2020లో ఈ రాష్ట్రాన్ని కోల్పోయారు.

- 2024 ఎన్నికల్లో నువ్వానేనా అన్నట్లు ఈ రాష్ట్రం ఉంది. దాదాపుగా టాస్ వేసినట్లుగానే ఫలితం ఉండవచ్చని అంటున్నారు.
- కీలక రాష్ట్రం కావడంతో ట్రంప్, హారిస్‌లు.. డబ్బు, సమయం, శక్తినంతా ఇక్కడే ధారపోస్తున్నారు. వాణిజ్య ప్రకటనలూ ఇక్కడే ఎక్కువగా ఇస్తున్నారు.
- పెన్సిల్వేనియా ఓటర్లను ఆకట్టుకోవడానికి సోమవారం నుంచి 21 మంది ప్రముఖులతో రిపబ్లికన్ పార్టీ బస్సు యాత్ర ప్రారంభించింది. ఇందులో భారతీయ అమెరికన్ కాష్ పటేల్ ఉన్నారు.
- రెండు పార్టీలకు చెందిన దాదాపు 50 సభలు గత 3 నెలల్లో పెన్సిల్వేనియాలో జరిగాయంటేనే ఇక్కడ పోటీ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.
- ప్రతి 4 డాలర్లలో 1 డాలరును ఈ రాష్ట్రంలోనే ప్రకటనల కోసం రెండు పార్టీలు ఖర్చు చేశాయి.
- ట్రంప్ ఇటీవల మెక్ డొనాల్డ్‌లో అక్కడి సిబ్బందిలా దుస్తులు వేసుకుని పని చేసింది ఈ రాష్ట్రంలోనే కావడం విశేషం.

వాషింగ్టన్: అమెరికా స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించిన పెన్సిల్వేనియా ప్రస్తుతం జరుగుతున్న అధ్యక్ష ఎన్నికల్లోనూ అత్యంత కీలకంగా మారింది. అధ్యక్షులుగా ఎన్నిక కావాలంటే ఈ రాష్ట్రంలో తప్పక గెలవాల్సిన పరిస్థితి నెలకొంది. డొనాల్డ్ ట్రంప్, కమలా హారిస్ మధ్య ఈ రాష్ట్రంలో ఉత్కంఠ భరిత పోరు సాగుతోంది. పెన్సిల్వేనియాలో 19 ఎలక్టోరల్ కాలేజ్ ఓట్లున్నాయి. అత్యధికంగా కాలిఫోర్నియాలో 54 ఓట్లున్నాయి. ఇది డెమొక్రాట్లకు కంచుకోట. రిపబ్లికన్లు బలంగా ఉన్న టెక్సాస్‌లో 40 ఓట్లున్నాయి.



- దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాల్లో గతంలో అధ్యక్ష అభ్యర్థులకు వచ్చిన ఓట్ల ఆధారంగా ట్రంప్, హారిస్‌లకు వచ్చే ఓట్లను రాజకీయ నిపుణులు అంచనా వేశారు.
- ఏడు కీలక రాష్ట్రాల్లోని ఓట్లపైనే ఇప్పుడు అందరి దృష్టి కేంద్రీకృతమైంది. ఇందులో ఆరిజోనా (11), విస్కాన్సిన్ (10), మిషిగన్ (15), పెన్సిల్వేనియా (19), జార్జియా (16), నార్త్ కరోలినా (16) ఉన్నాయి.
- వేగంగా మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఇద్దరు అభ్యర్థులు పెన్సిల్వేనియాపై దృష్టి సారించారు. ఇక్కడ తప్పనిసరిగా గెలవాల్సిన పరిస్థితి నెలకొంది.
- ఓటర్లను ఆకట్టుకునేందుకు ట్రంప్, హారిస్‌కు సంబంధించిన వేల మంది వాలంటీర్లు పెన్సిల్వేనియాలో మకాం వేశారు.
- పెన్సిల్వేనియాలో గెలవకుండా 270 ఎలక్టోరల్ ఓట్లు సాధించడం అసాధ్యమని రాజకీయ నిపుణులు అంచనా వేస్తున్నారు.
- 270టువిన్.కామ్ వెబ్‌సైట్ అంచనా ప్రకారం.. హారిస్‌కు 226 ఓట్లు, ట్రంప్‌నకు 219 ఓట్లు రావొచ్చని అంచనా.

హెజ్‌బొల్లా రాకెట్ల వర్షం

కూల్చేసిన ఇజ్రాయెల్ ● నెతన్యాహు సేనల దాడిలో 13 మంది మృతి



బీరుట్‌లో ధ్వంసమైన భవనాల వద్ద సహాయక చర్యలు

టెల్ అవీవ్: ఇజ్రాయెల్ మధ్య ప్రాంతంపై హెజ్‌బొల్లా మంగళవారం రాకెట్లతో విరుచుకుపడింది. వాటిని ఇజ్రాయెల్ అడ్డుకుంది. ఒక రాకెట్ నిర్మానుష్య ప్రాంతంలో పడింది. ఈ దాడుల్లో ఒక రిజర్విస్టు సైనికుడు మృతి చెందాడు. దాడుల నేపథ్యంలో 10 లక్షల మంది ఇజ్రాయెలీలు సురక్షిత బంకర్లలో తలదాచుకున్నారు. విమాన సేవలకు కొంత అంతరాయం కలిగింది. మరోవైపు సోమవారం రాత్రి ఇజ్రాయెల్ జరిపిన దాడిలో 13 మంది లెబనాన్ వాసులు మరణించారు. పలువురు గాయపడ్డారు. ఇటు పశ్చిమాసియాలో పర్యటిస్తున్న అమెరికా విదేశాంగశాఖ మంత్రి ఆంటోనీ బ్లింకెన్.. కాల్పుల విరమణకు అవకాశాలు స్వల్పమేనని పేర్కొన్నారు. హెజ్‌బొల్లా మంగళవారం ఇజ్రాయెల్‌లోని జనసమర్థ ప్రాంతాలపై రాకెట్ దాడులు చేసింది. అయితే ఎటువంటి నష్టం జరగలేదని ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది. బ్లింకెన్ ఇజ్రాయెల్‌కు రావడానికి కొద్ది గంటల ముందు ఈ దాడులు జరిగాయి. 5 ప్రొజెక్టైల్స్‌ను లెబనాన్ నుంచి హెజ్‌బొల్లా ప్రయోగించిందని, వాటిలో ఒక్కటి మినహా అన్నింటినీ క్షిపణి రక్షణ వ్యవస్థ అడ్డుకుందని ఇజ్రాయెల్ తెలిపింది. ఒకటి నిర్మానుష్య ప్రాంతంలో పడిందని వెల్లడించింది. దాడుల కారణంగా బెన్ గురియన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కొంతసేపు రాకపోకలు నిలిచిపోయాయి. బీరుట్‌లోని ప్రధాన ఆసుపత్రి ప్రాంతంలో సోమవారం రాత్రి ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 13 మంది మరణించారని లెబనాన్ ఆరోగ్యశాఖ ప్రకటించింది. 57 మంది గాయపడ్డారని తెలిపింది.

★ లెబనాన్, సిరియా సరిహద్దులోని జాతీయ రహదారిపై ఇజ్రాయెల్ దాడులు చేసింది. సిరియాలోని ప్రాంతంపై మంగళవారం ఈ దాడి జరిగినట్లు జాతీయ వార్తా సంస్థ వెల్లడించింది.

రద్దీ ప్రాంతంపై ఇజ్రాయెల్ దాడి

బీరుట్: లెబనాన్ రాజధాని బీరుట్‌కు దక్షిణాన ఉన్న రద్దీ ప్రాంతంపై మంగళవారం ఇజ్రాయెల్ దాడి చేసింది. ఈ ప్రాంతంలోనే శరణార్థి శిబిరం కూడా ఉంది. హెజ్‌బొల్లా స్థావరాలుగా పేర్కొంటూ రెండు భవనాలపై ఇజ్రాయెల్ బాంబులతో దాడి చేసింది. ఈ దాడుల్లో మరణాలపై వివరాలందలేదు. ఫ్రాన్స్ రాయబారి ఇంటికి దగ్గరలోనే ఈ దాడి జరిగింది.

వక్ఫ్ బిల్లుపై జేపీసీ భేటీ రసాభాస

- గాజుసీసా పగలగొట్టి ఛైర్మన్ వైపు విసిరిన టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ
- ఎంపీ చేతికి గాయం..



చేతికి కట్టుతో కల్యాణ్ బెనర్జీ

దిల్లీ: కేంద్రం ప్రతిపాదించిన వక్ఫ్ సవరణ బిల్లుపై ఏర్పాటైన సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) సమావేశం మంగళవారం రసాభాసగా మారింది. ప్రారంభమైన కొద్దిసేపటికే ఎంపీలు వాగ్వాదానికి దిగారు. టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ తనకు ఎదురుగా నీళ్ల కోసం పెట్టిన గాజుసీసాను టేబులుకేసి కొట్టగా ఆయన చేతివేళ్లకు గాయమైంది. అనంతరం పగిలిన బాటిల్‌ను ఛైర్మన్ వైపు కల్యాణ్ విసిరారు. ఫలితంగా సమావేశం వాయిదా పడింది. బెనర్జీకి పార్లమెంటు ఆవరణలోని డిస్పెన్సరీలో ప్రథమచికిత్స చేసి కుట్లు వేశారు. ఈ వ్యవహారాన్ని పార్లమెంటరీ కమిటీ తీవ్రంగా పరిగణించింది. భాజపా సభ్యుడు నిశికాంత్ దుబే తీర్మానం ప్రవేశపెట్టగా, 10-8 ఓటింగుతో ఆమోదించిన కమిటీ కల్యాణ్ బెనర్జీని సమావేశాల నుంచి ఒకరోజు సస్పెండు చేస్తూ నిర్ణయం తీసుకొంది. భాజపా ఎంపీ జగదాంబికా పాల్ అధ్యక్షతన ఏర్పాటైన సమావేశం ఒడిశాకు చెందిన రిటైర్డ్ జడ్జీలు, న్యాయవాదుల అభిప్రాయాలు వింటుండగా ఈ వివాదం తలెత్తింది.

వదిలేస్తే.. రేపు తుపాకీతో వస్తారు: పాల్

జేపీసీ సమావేశంలో జరిగిన దాడి నుంచి తాను త్రుటిలో తప్పించుకొన్నట్లు ఛైర్మన్ జగదాంబికా పాల్ తెలిపారు. సభ్యులను ఇలా వదిలేస్తే రేపటి సమావేశానికి మరొకరు రివాల్వరుతో వస్తారని మీడియా ఎదుట వ్యాఖ్యానించారు. బాటిల్‌ను ఛైర్మన్ వైపు విసరడం తన ఉద్దేశం కాదని కల్యాణ్ బెనర్జీ విచారం వ్యక్తం చేసినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

గుజరాత్‌లో అయిదేళ్లుగా నకిలీ కోర్టు!

- భూవివాదాలు లక్ష్యంగా తీర్పులు
- మోసగాడైన 'జడ్జి' అరెస్టు



అహ్మదాబాద్: ఉత్తుత్తి బ్యాంకులు.. పోలీసులు.. ఇపుడు ఏకంగా కోర్టులు కూడా ఈ జాబితాలో చేరాయి. గుజరాత్ రాజధాని నగరంలో గత అయిదేళ్లుగా "తీర్పులు" ఇస్తున్న నకిలీ కోర్టు గుట్టు రట్టయ్యింది. నకిలీ ట్రైబ్యునల్ ఏర్పాటు చేసి, న్యాయమూర్తిగా తీర్పులు ఇచ్చిన మోరిస్ శామ్యూల్ క్రిస్టియన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. శామ్యూల్ అనుచరులే కోర్టు సిబ్బందిగా, న్యాయవాదులుగా నటించేవారు. గాంధీనగర్‌లోని తన కార్యాలయంలో నిజమైన కోర్టు వాతావరణాన్ని శామ్యూల్ సృష్టించాడని పోలీసులు తెలిపారు. అహ్మదాబాద్ సిటీ సివిల్‌కోర్టు రిజిస్ట్రారు నగరంలోని కరంజ్ పోలీస్‌స్టేషనులో ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. నిందితుడు శామ్యూల్ ప్రభుత్వ భూమికి సంబంధించి 2019లోనే తన క్లయింట్‌కు అనుకూలంగా ఉత్తర్వులు ఇచ్చాడు. తర్వాత ఆ భూమి రెవెన్యూ రికార్డుల్లో తన క్లయింట్ పేరును చేర్చాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశాడు. ఈ ఉత్తర్వును అమలుచేయాలని కోరుతూ శామ్యూల్ మరొక న్యాయవాది ద్వారా సిటీ సివిల్‌కోర్టులో అప్పీల్ చేశాడు. తాను జారీ చేసిన నకిలీ ఉత్తర్వులను కూడా ఈ పిటిషనుకు జత చేశాడు. ఆ ఉత్తర్వులు నకిలీవని కోర్టు రిజిస్ట్రారు గుర్తించడంతో శామ్యూల్ బండారం బయటపడింది.

● గత అయిదేళ్లుగా శామ్యూల్ నకిలీ కోర్టు నడుస్తోంది. సిటీ సివిల్‌కోర్టులో భూవివాదాల కేసులు పెండింగులో ఉన్న కక్షిదారులను గుర్తించి నిందితుడు వల పన్నేవాడు. ప్రభుత్వం నియమించిన అధికారిక మధ్యవర్తిగా పరిచయం చేసుకునేవాడు. తర్వాత పిటిషనర్లను తన 'కోర్టు'కు పిలిపించుకునేవాడు. అక్కడ ట్రైబ్యునల్ ప్రిసైడింగ్ అధికారిగా నటిస్తూ తన క్లయింట్లకు అనుకూలమైన తీర్పులు ఇచ్చి, ఉత్తర్వులను జారీ చేస్తాడు. వారి నుంచి సొమ్ము తీసుకునేవాడు.

గుర్తింపుపై చిగురించిన ఆశలు..

న్యూస్‌టుడే, కృష్ణావిశ్వవిద్యాలయం (మచిలీపట్నం)

నేడు కృష్ణా విశ్వవిద్యాలయానికి 'న్యాక్' బృందం



వర్సిటీలో ఉన్న కళాశాలలు 3 | విద్యార్థులు 2,500

ఉప ప్రాంగణం: డా.ఎంఆర్‌ఏఆర్ పీజీ సెంటర్, నూజివీడు

అనుబంధ కళాశాలలు 160 | విద్యార్థులు 48,000

ఇప్పటి వరకు సాధించిన గుర్తింపులు: ఐఎస్‌వో,యూజీసీ - 12బి

మచిలీపట్నంలో కృష్ణా విశ్వవిద్యాలయం ప్రారంభమై 16 ఏళ్లు అవుతోంది. ఇంతవరకు న్యాక్ గుర్తింపు రాలేదు. కూటమి ప్రభుత్వ చొరవతో ప్రస్తుతం అన్ని వసతులు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం ఇక్కడ ఆర్ట్స్ అండ్ సైన్స్, ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలలు ఉన్నాయి. వీటిలో అత్యాధునిక వసతులతో పాటు ఆధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయి. న్యాక్ గుర్తింపు సాధనలో భాగంగా ఇప్పటికే విశ్వవిద్యాలయంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి అవసరమైన కార్యాచరణ చేపట్టింది. బోధనతో పాటు ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్, సామాజిక సేవా కార్యక్రమాల్లో విద్యార్థుల భాగస్వామ్యం ఇలా మొత్తం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం మొత్తం ఏడు అంశాలపై నివేదిక అందించింది. బుధవారం నుంచి (23, 24, 25 తేదీలు) శుక్రవారం వరకు వర్సిటీని న్యాక్ బృందం సభ్యులు సందర్శించనున్నారు. ఆయా అంశాలు పరిశీలించి సంతృప్తి చెందితే గుర్తింపు అందిస్తారు.

ప్రయోజనాలెన్నో..

విశ్వవిద్యాలయాలకు ప్రతి ఐదేళ్లకు ఓసారి న్యాక్ గుర్తింపు ఇస్తారు. ఈ హోదా ఉంటే కేంద్ర ప్రభుత్వం నుంచి వివిధ ప్రాజెక్టులు, పరిశోధనలకు నిధులు మంజూరు అవుతాయి. విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కూడా మెరుగవుతాయి. గతంలో వర్సిటీకి ఐఎస్‌వో సర్టిఫికేషన్ రాగా.. 2021లో యూజీసీ 12బి గుర్తింపు సాధించింది.

అన్ని ఏర్పాట్లు చేశాం..



న్యాక్ బృందం తొలిసారి విశ్వవిద్యాలయంలో పర్యటించనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు చేశాం. ఈ గుర్తింపు సాధనలో భాగంగా ఎప్పటి నుంచో కసరత్తు చేశాం. గుర్తింపు ఇచ్చేందుకు అవసరమైన అన్ని వసతులు ప్రస్తుతం వర్సిటీలో ఉన్నాయి. బోధనతో పాటు ఇతర అంశాల్లో విద్యార్థులను భాగస్వామ్యం చేస్తున్నాం. న్యాక్ గుర్తింపు వస్తే విశ్వవిద్యాలయంలో పరిశోధన అవకాశాలు విస్తృతం అవడంతో పాటు వర్సిటీ అభివృద్ధికి అన్ని విధాలుగా దోహదపడుతుంది. కచ్చితంగా గుర్తింపు సాధిస్తామన్న నమ్మకంతో ఉన్నాం.

-రాయన శ్రీనివాసరావు, ఉపకులపతి

ఇంకా వెంటాడుతున్న సమస్యలు..

గతంతో పోల్చుకుంటే పలు వసతులు సమకూరినా ఇంకా అనేక సమస్యలు వెంటాడుతున్నాయి. వాటిలో ప్రధానమైన సమస్య వసతిగృహాలు లేకపోవడమే. ఈ కారణంగా ఇక్కడ చేరేందుకు దూరప్రాంత విద్యార్థులు వెనుకంజ వేస్తున్నారు. గతేడాది డిసెంబరు నాటికే భవన నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉన్నా వివిధ కారణాలతో జాప్యం జరిగింది. వీటితో పాటు రూ.6కోట్లతో ఫార్మసీ కళాశాల, రూ.8 కోట్లతో ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణ పనులు ప్రారంభించారు. దీని నిమిత్తం ప్రాంగణంలోనే ఐదు ఎకరాల చొప్పున స్థలం కేటాయించారు. ఫుడ్ కోర్టు నిర్మాణానికి రూ.1.5కోట్లు, ప్రహరీతో పాటు ముఖద్వారం నిర్మాణానికి రూ.3.5కోట్లు నిధులతో చేపట్టిన ఈ పనులు సకాలంలో పూర్తి చేయకపోవడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. బయో డైవర్సిటీ ప్లాంట్‌తో పాటు ఆక్వా పాండ్ తదితరాలు కూడా వర్సిటీ ప్రాంగణంలో ఏర్పాట్లు చేసేలా చర్యలు తీసుకున్నారు. ఎంతవరకు ఫలితమిస్తాయో వేచి చూడాల్సి ఉంది.

మద్యం తయారీ కేంద్రాల్లో సీఐడీ తనిఖీలు



ఆటోనగర్‌లోని కాంటినెంటల్ వైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో తనిఖీ చేస్తున్న సీఐడీ అధికారులు

ఆటోనగర్, కంచికచర్ల, న్యూస్‌టుడే : విజయవాడ ఆటోనగర్‌లోని కాంటినెంటల్ వైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ డిస్టిలరీపై మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సీఐడీ అధికారులు తనిఖీలు చేయడం ప్రారంభించారు. రాత్రి 10:30 గంటల వరకు కొనసాగాయి. గత ప్రభుత్వంలో ఈ కేంద్రంలో ఎంత మొత్తంలో మద్యం తయారు చేశారు, ఎంత ఎగుమతి చేశారు తదితర అంశాలపై అధికారులు రికార్డులు పరిశీలిస్తున్నారు. ఈ కేంద్రంలో వివిధ బ్రాండ్ల మద్యాన్ని తయారు చేస్తారు. అదనపు ఎస్పీ ఆధ్వర్యంలో 13 మంది సీఐడీ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. స్థానిక పోలీసుల సహకారంతో బయట వ్యక్తులు లోపలికి రాకుండా లోపల వ్యక్తులు బయటకు వెళ్లకుండా తనిఖీలు నిర్వహిస్తున్నారు.

సెంథినీలో...

కంచికచర్ల మండలం గండేపల్లి శివారు సెంథినీ బయో ప్రొడక్ట్స్ కర్మాగారంలో కూడా సీఐడీ అధికారులు రాత్రి 10 గంటల వరకు తనిఖీలు నిర్వహిస్తున్నారు. వివరాలు చెప్పేందుకు అధికారులు ఇష్టపడటం లేదు. 2019-24 మధ్య కాలంలో మద్యం తయారీ రికార్డులు పరిశీలిస్తున్నట్లు సమాచారం.

శర్వాని కంపెనీలో..

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని పెనుగొలను పంచాయతీ పరిధిలో 8 ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన శర్వాని మద్యం తయారీ కర్మాగారంలో మంగళవారం రాత్రి రాత్రి 10 గంటల వరకూ వరకు సీఐడీ అధికారులు తనిఖీ చేస్తూనే ఉన్నారు. సోదాలు పూర్తయ్యేందుకు ఇంకా సమయం పడుతుందని తెలిసింది. సీఐడీ అదనపు ఎస్పీ ప్రసాద్ ఆధ్వర్యంలో ఉదయాన్నే కంపెనీ వద్దకు చేరుకున్నట్లు సమాచారం. కంపెనీలో మద్యం తయారీ రకాలు, దస్త్రాలను తనిఖీ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక హైదరాబాదుకు చెందిన సి.చంద్రారెడ్డి తదితరులు 2017లో ఇక్కడ మద్యం తయారీ కర్మాగారం ప్రారంభించారు. ప్రస్తుతం ర్యాడిక్ కంపెనీకి చెందిన ఫార్ములా మద్యం తయారు చేస్తున్నట్లు సమాచారం. గత వైకాపా పాలనలో ఇక్కడి కంపెనీలో తయారు చేసిన కొన్ని మద్యం రకాలపైన సీఐడీ అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది.

గొడవర్రు, దావులూరులో..

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే: సీఐడీ అధికారులు స్థానిక పోలీసు, రెవెన్యూ అధికారులతో కలిసి గొడవర్రులోని బీవీఎస్ డిస్టిలరీస్ ప్రైవేట్ లిమిటెడ్, దావులూరులోని బీఆర్‌కే స్పిరిట్స్ సంస్థలో సోదాలు నిర్వహించారు. ప్రధానంగా 2019- 24 సంవత్సరాల్లో పలు ఫిర్యాదుల నేపథ్యంలో ఈ దాడులు చేసినట్లు తెలుస్తోంది. రికార్డుల పరిశీలన, గోదాముల్లోని నిల్వ సరకు, తయారీ, నాణ్యత తదితర అంశాలను పరిశీలిస్తున్నారు.

బకాయి బిల్లుల చెల్లింపు ఆనందదాయకం



సీఎం చంద్రబాబుకు అభినందనలు తెలియజేస్తున్న బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : రహదారుల అభివృద్ధి పనులకు సంబంధించి మూడేళ్ల నుంచి రూ.3 వేల కోట్లు బకాయి ఉండగా... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోపే రూ.748 కోట్లు విడుదల చేసి గుత్తేదారుల్లో ఆనందాన్ని నింపిందని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీఏఐ) జాతీయ ఉపాధ్యక్షుడు డి.పంకజ్‌రెడ్డి అన్నారు. గుత్తేదారులకు బకాయి బిల్లులు విడుదల చేసిన నేపథ్యంలో విజయవాడ ఎంజీ రోడ్డులోని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ కార్యాలయంలో మంగళవారం సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అప్పులు తీసుకొచ్చి పనులు చేశామని, బిల్లుల చెల్లింపు జాప్యం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని తెలిపారు. మిగిలిన నిధులు కూడా విడతల వారీగా చెల్లించాలని కోరారు. సీఆర్‌ఎఫ్ నిధుల కింద రూ.350 కోట్లు కేటాయించడమే కాకుండా... అదనంగా రూ.150 కోట్లు విడుదల చేయడానికి అంగీకరించిన కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీకి అభినందనలు తెలియజేశారు. చిన్న గుత్తేదారులకు రావాల్సిన పాత బకాయిలు రూ.200 కోట్లు కూడా నిధులు విడుదల చేయాలని కోరారు. జాతీయ మాజీ ఉపాధ్యక్షుడు చెరువు రామకోటయ్య మాట్లాడుతూ... ఎన్నికల ముందు ఇచ్చిన హామీని చంద్రబాబు నిలబెట్టుకున్నారని తెలిపారు. బీఏఐ రాష్ట్ర ఛైర్మన్ అత్తలూరి నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ.. అభివృద్ధిలో భాగస్వాములయ్యే గుత్తేదారులకు ప్రభుత్వం సహకారం అందిస్తోందనే ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.వెంకట నాగిరెడ్డి, ఎన్.నాగేశ్వరరావు, ఎ.కాశీవిశ్వేశ్వరరావు, కోశాధికారి పి.శేషగిరిరావు, బి.రాఘవరావు, వల్లభనేని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. బుడమేరు గండి పూడ్చడంలో కీలకంగా వ్యవహరించిన జాతీయ మాజీ ఉపాధ్యక్షుడు వల్లభనేని వెంకటేశ్వరరావును అభినందించారు.

కృష్ణా వరద తగ్గుముఖం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : కృష్ణా నదిలో ప్రకాశం బ్యారేజీ వద్ద మంగళవారం వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. ఉదయం 8 గంటలకు ఎగువ నుంచి 2,05,179 క్యూసెక్కుల మేర వచ్చింది. 20 గేట్లను 5 అడుగులు, మిగతా 50 గేట్లను 4 అడుగులు ఎత్తారు. సముద్రంలోకి 1,96,750 క్యూసెక్కులు, పంట కాల్వలకు 8,429 క్యూసెక్కులు విడుదల చేశారు. క్రమేపీ వరద తగ్గుముఖం పట్టింది. సాయంత్రం 6 గంటలకు ఎగువ నుంచి 1,38,718 క్యూసెక్కులు రాగా, 40 గేట్లను 4 అడుగులు, మిగతా 30 గేట్లను 3 అడుగుల మేర ఎత్తారు. సముద్రంలోకి 1,69,250 క్యూసెక్కులు విడుదల చేశారు. ఎగువ నుంచి పులిచింతల (వజినేపల్లి) ద్వారా 1,32,062, మునేరు (కీసర) నుంచి 6,271, పాలేరు నుంచి 385 క్యూసెక్కుల మేర వస్తోంది.

కాల్వలకు 9,824 క్యూసెక్కులు

ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా డెల్టా పరిధిలోని పంట కాల్వలకు 9,824 క్యూసెక్కులు ఇస్తున్నారు. వీటిలో కృష్ణా తూర్పు ప్రధాన కాల్వకు 6,318, కృష్ణా పశ్చిమ ప్రధాన కాల్వకు 3,506 క్యూసెక్కులు ఇస్తున్నారు. కృష్ణా తూర్పు ప్రధాన కాల్వ నుంచి రైవస్ కాల్వకు 3105, ఏలూరు కాల్వకు 1204, కేఈబీ కాల్వకు 1104, బందరు కాల్వకు 905 క్యూసెక్కులను విడుదల చేశారు.

బీఎస్సీ నర్సింగ్ సీట్ల భర్తీకి చర్యలు

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: ప్రస్తుత విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని కళాశాలల్లో అందుబాటులో ఉన్న బీఎస్సీ నర్సింగ్ నాలుగేళ్లు, రెండేళ్ల కోర్సుల్లో ప్రవేశానికి ఐచ్ఛికాలు పెట్టుకోవాలని విజయవాడ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పేర్కొంది. విశ్వవిద్యాలయానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ రోజు (మంగళవారం) రాత్రి 9 గంటల నుంచి 25వ తేదీ రాత్రి 9 గంటల్లోగా ఐచ్ఛికాలు ఇచ్చుకోవాలని, ఇతర వివరాలకు 90007-80707, 80082-50842 నెంబర్లలో సంప్రదించవచ్చని విశ్వవిద్యాలయ వర్గాలు వెల్లడించాయి.

ఎండీఎస్ ప్రత్యేక స్ట్రే కౌన్సెలింగ్‌కు... రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు దంత వైద్య కళాశాలల్లో కౌన్సెలింగ్‌లో భర్తీ కాని పీజీ దంత వైద్యం (ఎండీఎస్) సీట్లకు ఈరోజు రాత్రి 9 గంటల నుంచి బుధవారం (23వ తేదీ) మధ్యాహ్నం 12 గంటల్లోగా ఆప్షన్లు పెట్టుకోవాలని, సీట్ల వివరాలు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో పొందుపర్చామని అధికారులు తెలిపారు.

28, 30 తేదీల్లో ఐటీఐ ఐదో విడత కౌన్సెలింగ్

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: నాలుగో విడత కౌన్సెలింగ్ అనంతరం ఎన్టీఆర్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో మిగిలిన సీట్లకు ఐదో విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు విజయవాడ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్, కన్వీనర్ ఎం.కనకారావు ఓ ప్రకటనలో తెలిపారు. అర్హతగల అభ్యర్థులు ఈ నెల 26వ తేదీ రాత్రిలోగా 'ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్' వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలన్నారు. దరఖాస్తుదారులు ఏ కళాశాలకు తమ ఐచ్ఛికాలు పెట్టుకుంటారో అక్కడికి 27వ తేదీ సాయంత్రం 3 గంటల్లోగా వెళ్లి తమ ఒరిజినల్ ధ్రువపత్రాలను పరిశీలన చేయించుకొని అక్కడ ఇచ్చే ధ్రువీకరణ పత్రంతో కౌన్సెలింగ్‌కు రావాలని సూచించారు. ఈనెల 28న ప్రభుత్వ, 30న ప్రైవేటు ఐటీఐల్లో కౌన్సెలింగ్ ఉంటుందని, అన్ని పత్రాలతో రావాలని తెలిపారు. ఇతర వివరాలకు 94906-39639, 77804-29468 నంబర్లలో సంప్రదించాలని చెప్పారు.

అత్యాధునిక వసతులతో సొంతింటి కల సాకారం



జ్యోతి వెలిగించి వార్షికోత్సవాన్ని ప్రారంభిస్తున్న శ్రీభ్రమర టౌన్‌షిప్స్ ఛైర్మన్ గళ్లా రామచంద్రరావు

పట్టాభిపురం: అత్యాధునిక వసతులతో ప్రజలకు సొంతింటి కల సాకారం చేస్తున్నామని శ్రీభ్రమర టౌన్‌షిప్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ గళ్లా రామచంద్రరావు పేర్కొన్నారు. గుంటూరు రింగ్‌రోడ్డులోని సిద్ధార్థ గార్డెన్స్‌లో శ్రీభ్రమర హౌసింగ్ సంస్థ వార్షికోత్సవం మంగళవారం నిర్వహించారు. రామచంద్రరావు మాట్లాడుతూ ఇప్పటి వరకు 9,000 మందికి పైగా సొంతింటి కల సాకారం చేశామన్నారు. నిర్మాణ రంగంలో కొత్తదనం సృష్టించాలన్న ఆశయంతో 2015లో శ్రీభ్రమర టౌన్‌షిప్స్‌ను ప్రారంభించామని తెలిపారు. గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో 30కి పైగా అద్భుతమైన ప్రాజెక్టులకు రూపకల్పన చేసి అభివృద్ధి చేసి స్థిరాస్తి రంగంలో ప్రత్యేక ముద్ర వేశామని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం ఆధునిక సౌకర్యాలతో ప్రాజెక్టులు చేపట్టి నగర జీవనశైలిని సమతుల్యం చేసేందుకు శ్రీభ్రమర కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు మారం చంద్రశేఖర్, ఎం.ఎస్.రాజు, లక్ష్మీపతిరాజు, శైలారెడ్డి, యడ్లపల్లి మురళీకృష్ణ, రావెల గోపాలకృష్ణ, కాకర్ల సతీష్, కమ్మ రవి పాల్గొన్నారు.